

309
త్వరలో
విడుదల!
విజయావారి
అప్పుచేసి
పప్పుకూడు
డైరెక్షన్...... ప్రసాద్
నిర్మాతలు..... నాగిరెడ్డి & చక్రపాణి

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25 న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 32
2-4-58

Founder : K. NAGESWARA RAO

విలంబి చైత్ర శుద్ధ త్రయోదశి బుధవారం


విషయానుక్రమణిక

★

ముఖచిత్రం :
జలరుహా వారి
'రాజనందిని' చిత్రంలో
అంజలీదేవి

★

★



శస్త్ర చికిత్సలో పురోగమనం

[లీనార్డ్ ఎంజెల్]

ఒక తొంభై ఆరేళ్ళ ముసలమ్మకు తుంటి ఎముక విరిగింది. న్యూయార్కులో ఒక ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదే ఏ పదిహేను సంవత్సరాలనాడో అయితే, అక్కడ ఏ కట్టో కట్టి మంచమే శరణ్యమని పడేసేవారు. అలా కదలక మెదలక మొద్దులాగ మంచంసేవ చేయటం ముసలివాళ్ళకు మరణశయ్య లాంటిది. అది పరలోకానికి పోయే టందుకు తగిన వాహనం లాంటిది. పాపం ఆ కష్టాలన్నీ భరించలేక ఎప్పుడో అంటే ఇంచుమించు రెండువారాల్లో—గుటుక్కుమనేపని.


కాని ఈ ముసలమ్మ సంగతి వేరుగా పరిణమించింది. శస్త్రచికిత్సకోసం ఆపరేషన్ గదిలోకి తీసుకువెళ్ళారు. ఎముక మధ్యగా ఒక మేకుకొట్టి విరిగిపోయిన ముక్కలను అతికారు. ఎంత ఆశ్చర్యం! మరునాడే ఆమె మంచంమీదనుంచి లేచింది. పన్నెండు రోజులయేసరికి ఆస్పత్రినుంచి ఇంటికి మామూలు మనిషిలాగ తిరిగివచ్చింది.

నిజంగా ప్రాణంకాపాడటమనేది చాలా అద్భుతమైన సంగతి. గత పాతిక సంవత్సరాలలో శస్త్రచికిత్సలో విప్లవాత్మకమైన పురోగమనం కనిపిస్తున్నది. తెలుసుకున్నప్పుడు డాక్టర్లు గుండెను తెరిచి శస్త్రచికిత్స చేయగలరు. అంతేకాదు, హృదయకుహరంలోని కుళ్ళు తీసివేసేటందుకు కాస్సేపు గుండె కొట్టుకోకుండా ఆపుచేయగలరు!

ఈ రోజుల్లో వైద్యులు శస్త్రచికిత్స చేయలేనిభాగం శరీరంలో లేనేలేదు. వ్యాధి మూలంగా శక్తివిహీనమై పోయిగానీ, లేక మడతలుపడి అడ్డుగాతయారైగానీ ఉన్న రక్తనాళాలను డాక్టర్లు వారి చిత్తానుసారం పాతవాటిని తీసివేసి క్రొత్తనాళాలను తిరిగి జోడించగలరు. క్షయవ్యాధిచేత బాధపడిన వ్యక్తికి తిరిగి ఆవ్యాధి అంకురించకుండా చేసేటందుకు శ్వాసకోశంలో చెడిపోయిన భాగాలను తీసివేయటం పరిపాటి అయింది. అతి అపాయకరమైన అసంఖ్యాకమైన గాయాలను మాన్పటంలో డాక్టర్లు చూపే ప్రతిభ అమోఘం. మోటార్ కార్ల యుగమైన ఈరోజుల్లో పెట్రోలువల్ల అనేక కాల్పుల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాటిని నయంచేయటంలో వారుతీసుకొనే శ్రద్ధాసక్తులు వర్ణనాతీతం. ఇన్నాళ్ళుగా శస్త్రచికిత్సకు లొంగని లివర్, పాంక్రియాస్ తిత్తులుకూడా ప్రస్తుతం శస్త్రచికిత్సకు దాసోహం అంటున్నాయి.

శస్త్ర చికిత్సలో నూతన విధానాలను డాక్టర్లు అవగాహన చేసుకొని, వాటిలో చక్కని ప్రావీణ్యం సంపాదించారు. ఒక తరానికి పూర్వం మిక్కిలి వృద్ధులు, చాలా చిన్నపిల్లలు అంటే మరీ పసికందులు, వ్యాధి బాగా ముదిరిపోయి ఎక్కువగా బాధపడేవారు. ఈతరహా వ్యాధిగ్రస్తుల జోలికి చివరకు శస్త్రధారులైన డాక్టరు కూడా పోవటానికి వెరిచి వారిని మృత్యుదేవతకు బలిగా వదిలివేసేవారు. కాని రోజులు మారాయి. శస్త్రాలతో మృత్యుదేవతను పారద్రోలి ఆలాంటిరోగులు సంపూర్ణారోగ్యంలో సుదీర్ఘకాలం జీవించేటట్లు చేయగలుగుతున్నారు.

అమెరికాలో ప్రస్తుతం 30 వేలమంది సర్జన్లు ఉన్నారు. వారిలో 20 వేలమంది "అమెరికన్ కాలేజి ఆఫ్ సర్జన్స్"లో చేరగలిగిన అర్హత పొందేటందుకు తగిన నైపుణ్యం సంపాదించారు. అంటే ఎంతో అనుభవం,



అమెరికన్ గ్రామ సీమలోని ఆధునిక శస్త్రవైద్యశాల.

★ శస్త్రచికిత్సలో పురోగమనం ★

తెలివితేటలు ఉంటేగాని ఆ ప్రవేశార్హత డాక్టర్లకు లభించదు. ఇతరలో చాలా వేల మంది ప్రత్యేక నిపుణులుగా శిక్షణ పొందారుగానీ, ఆ కళాశాలలో చేరకలిగేటంత అనుభవం ఇంకా వారు శస్త్ర చికిత్సలో సంపాదించలేదు. మొత్తం 6,500 అస్పత్రుల్లోగల 17,000 ఆపరేషన్ గదుల్లో వారు పనిచేస్తున్నారు. మామూలుగా చిన్న చిన్న ఆపరేషన్లు లెక్క వేయక వదిలేస్తే, ప్రతిసంవత్సరానికి వారు ఒకకోటి మందికి శస్త్ర చికిత్స చేస్తున్నారు.

మునుపటికంటే అధిక సంఖ్యాకులైన వ్యాధిగ్రస్థులు శస్త్ర చికిత్సమూలంగా వ్యాధి విముక్తులవుతున్నారు. ఉదాహరణకు గుండెనుంచి వచ్చే పెద్దర కనాళంలో తరచు వచ్చే అపాయకరమైన "వాళం బిగిసిపోయే" వ్యాధి నివారణకు జరిగిన ఆపరేషన్ విషయం ఆలోచిద్దాం. హృద్రోగాలపై విజయవంతంగా జరిగిన తొలిశస్త్ర చికిత్సల్లో అదొకటి. అది జరుపుతున్న మొట్టమొదటి రోజుల్లో పదింటొకరోగి మరణిస్తుండేవాడు; కాని ఇప్పుడో 200 మందికి 199 మంది ఆ వ్యాధినించి విముక్తిపొంది హాయిగా ఉంటున్నారు. అపెండిక్స్ తీసివేయటం లాంటి మామూలు ఆపరేషన్లలో ఎక్కడో బాగా ముదిరిపోయిన వ్యాధిగ్రస్థులకు తప్ప చావులు లేవనే చెప్పవచ్చు.

అయితే శస్త్రచికిత్స పురోగమనానికి, దానివల్ల మరణించిన రోగుల సంఖ్యనూ ముడిపెటలేము. గుండె ఆపరేషన్లు లాంటివి కొన్ని జరిగిన తొలిరోజుల్లో చాలామంది ఆపరేషనుఅయినవెంటనే మరణిస్తుండేవారు.

దానికి రెండుకారణాలు ఉన్నాయి. జంతు ప్రయోగశాలలఅనుభవంలో సర్జన్లు తెలుసుకోలేని కొన్ని విషయాలు ఉండటం మొదటి కారణం. క్లిష్టతరమైన ఆశస్త్రచికిత్స చేయించుకునే వ్యక్తులు ఒక కాలు కాటిలోపెట్టి ఉన్నవారవటము మరొక కారణము.

శస్త్రచికిత్సాపురోగమనాన్ని గ్రహించేటందుకు తొడ ఎముక విరిగిన తొంభైఆరేళ్ళ ముసలమ్మలాంటి రోగులవిషయాలూ, బోస్టన్ నగరంలో శిశువుల ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాబర్ట్ ఇ. గ్రాస్ చేసిన శస్త్రచికిత్సల వంటివీ ప్రబలనిదర్శనాలనవచ్చు. డాక్టర్ గ్రాస్ హృద్రోగ శస్త్రచికిత్సలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించినా, పసిపిల్లలకుచేసే శస్త్రచికిత్సలవిషయంలో మార్గదర్శకుడుగా ప్రసిద్ధికెక్కాడు. వందలాది చిట్టిమానవులకు పెద్దపెద్ద శస్త్రచికిత్సలుచేసి వారి ప్రాణాలు కాపాడాడు. రెండుపౌనుల ఆరు ఔన్సుల బరువుమాత్రమే గల ఒక ఆడశిశువు పొత్తికడుపులో పెద్దశస్త్రచికిత్సచేసి ఆపిలకు ప్రాణదానం చేశాడు.

అలాంటి రోగులను 'శస్త్రచికిత్సాలయ' పరిభాషలో 'పూర్ రిస్క్స్' అంటారు. అంటే శస్త్రచికిత్స చేసినప్పటికి ఆరోగి జీవించే అవకాశాలు చాల తక్కువనీ, వాళ్ళ శస్త్రచికిత్సను తట్టుకొనేటంత బలం కూడా కలిగిఉండరనీ అర్థం. శస్త్రచికిత్సానంతరం మరణించేవారిలో పసిపాపలసంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే వ్యాధి ఉద్రిక్తపరిస్థితులననుసరించి పెదలకుకూడా ప్రాణాపాయం సంభవించవచ్చు. కాని "పూర్ రిస్క్స్"వర్గంకంటే క్లిష్టపరిస్థితుల్లో ఉన్న వ్యాధిగ్రస్థులకుకూడా నేడు విజయవంతంగా శస్త్రచికిత్స జరిగి, వ్యాధులు బాగా నయం చేయబడుతున్నవి. శస్త్రచికిత్సలో నైపుణ్యానికి అదే నికరమైన నిరూపణ.

శరీరంలో ఇంతకు ముందెప్పుడు శస్త్రచికిత్సకు అందని అవయవాలను ఇప్పుడు ఎలా చికిత్స చేయకలుగుతున్నారు? ఎన్నో క్రొత్తక్రొత్త వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఎలా ఆరోగ్యవంతులు కాగలుగుతున్నారు? మానవ నైపుణ్యం వల్లనే అది జరగటంలేదు. గతంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన శస్త్రవైద్యశిఖామణి థియొడర్ బిల్రాత్ కంటె ప్రస్తుతం పని చేస్తున్న వైద్యులు మహనీయులని గానీ, చిత్రకళానిధి రెంబ్రాంట్ కంటె వర్తమాన చిత్రలేఖకులు బ్రహ్మలనిగానీ కాదు.

ఆ పురోగమనానికి అత్యంత ప్రధానమైన కారణం ఒకటి ఉంది. ఆధునిక, శస్త్రచికిత్సలో అవలంబిస్తున్న చిన్న కిటుకు ఒకటి ఉన్నది. శస్త్రచికిత్సలోనూ, తదనంతరం జరిగే చికిత్సల్లోనూ రోగి యొక్క అంతర్గత, బహిర్గత అవయవాలు వీలైనంత తక్కువగా కదులుతూ ఉండేటటుచేసే విధానమే అది. దానిని ఎంత జాగ్రత్తగా ఆచరణలో పెడితే అంత సుకరంగా చికిత్స తేలిపోతుంది. అదే ఆ విధానంలోవున్న ధర్మసూత్రం.

ఆ విధానం ప్రథమదశలో ఎలాంటి సూత్రాలకు బద్ధమైనడిచిందో తరతరాల శస్త్రవైద్యులు చేసిన కృషిలో ద్యోతకమౌతుంది.

కాని ఆ నిశ్చల విధానాన్ని ఒక పద్ధతి ప్రకారం శస్త్ర చికిత్సలో జరిపించిన మహావ్యక్తి విలియమ్ స్టూవర్ట్ హాల్స్టెడ్. 1889 జాన్స్ హాప్కిన్స్ వైద్యపాఠశాలలో శస్త్రచికిత్సా బోధకుడుగా చేరారు. ఒక్కొక్క కాఫీ గింజనూ తానే స్వయంగా ఏరి, వాటితో తయారుచేసిన కాఫీమాత్రమే సేవించేవాడు. బాల్టిమోర్ లో చలువచేసిన దుస్తులు తన అభిరుచికి తగిపోలేదని, పారిస్ పంపించి ఉతికించి తెప్పించుకొనే వాడు. ఆ అకుంఠిత శ్రద్ధనే శస్త్ర చికిత్సలో కూడా ఆయన ప్రదర్శించాడు.

రోగులకు మత్తుమందు వాడకుండా శస్త్రచికిత్స చేసేరోజుల్లో వైద్యులు త్వరితగతిని దానిని ముగించేవారు. కాని అప్పుడు కూడా డాకర్ హాల్స్టెడ్ అమిత శ్రద్ధతోను జాగ్రతతోనూ, నెమ్మదిగానూ ఆపరేషను చేసేవాడు. చికిత్సలో శరీరాన్ని కోయవలసి వచ్చినప్పుడు రోగి ఒంటిలోని రకం చాల తక్కువగా పోయేటటు చూసేటందుకు ప్రతి రక్తనాళాన్ని అతి జాగ్రతగా బిగించికట్టేవాడు. గాయం మూయవలసి వచ్చినప్పుడు కండరంలోని ప్రతిపొరను కలిపి అతికించేవాడు; ధాతువులనూ చర్మాన్ని అతి శ్రద్ధతో కలిపి కుట్టేవాడు. ఇతర శస్త్రవైద్యులు గంటలో ముగించే చికిత్సను ఆయన నాలుగునుంచి ఆరుగంటలు తీసుకొనేవాడు. శస్త్రచికిత్స జరిగిన తర్వాత రోగి బ్రతకటమే గాక ఇతర వైద్యులు చికిత్సచేసిన రోగులకంటే అధిక ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండేవారు. ఆ విషయం అందరినీ ఆశ్చర్యచకితులుగా చేసేది.

హాల్స్టెడ్ కాలంనుంచి శస్త్రచికిత్సా సమయంలో రోగికి ఆవంతైనా అపాయం కలగకుండా ప్రతి వైద్యుడు కడు జాగ్రత్తతో పని చేసేవాడు. ఆధునిక పరిశోధనల వల్ల, హాల్స్టెడ్ అతని సమకాలికులకంటే అంటే 1930 నాటి శస్త్రవైద్యులకంటే, నేటి వైద్యులు రోగిని రక్షించేటందుకు ఏమిచేయాలో బాగా నేర్చుకొన్నారు. అందుచేత నేటి శస్త్రవైద్యుడు ఎక్కువ మంది రోగులకు, ఎక్కువ రకాల శస్త్రచికిత్స చేయగలుగుతున్నాడు.

రోగిని రక్షించే విధానాలన్నింటినీ ఉటంకించి ఏడు ప్రధాన శీర్షికల క్రింద విడదీయవచ్చు:

రోగ నిదానంలో నూతన విధానాలు, శరీర పోషక ఆహారంలో తగిన శ్రద్ధ. క్షేమకరమైన మత్తుపదారములు, వాటి వాడకము.

క్రిమి సంహారకాలు—నూతన క్రిమినిర్మూలక ఔషధులు రకము, మొదలగు శారీరక ద్రవాలు, నష్టం కాకుండా చూడడం; రక్తంయొక్క రసాయనికపు నిష్పత్తిలో మార్పులు రాకుండా చూడటం.

శరీర శాస్త్ర సంబంధమైన ప్రమాణ సూత్రాలను శస్త్ర చికిత్సకు అన్వయించటం అంటే శస్త్రవైద్యుడు చేస్తున్న కృషి, ఆచరణలో పెట్టే విధానం, శస్త్రచికిత్సానంతరం తీసుకోవలసిన జాగ్రతా, ముఖ్యంగా రోగితేరుకొంటున్నప్పుడుపాటించడమూ. ★

—మిగతా వచ్చేవారం]



(గేయనాటిక)

"ముక్తామల"

నాంది:

శ్రీ సీతారాముల చరితం
కరుణారసపూర్ణం!
నిత్యనూతనం, సత్యసుందరం.

* * *

అది ఒక సుందర దృశ్యం,
అది ఒక విషాద గీతం,
మధుర వేదనా భరితం,
విరహ గీతికా ఖండం,

* * *

బృందగానం:

అలనాడు ఒకనాడు
అయోధ్య రాముండు
ఆరని వ్యథతోడ
అలమటించెను చాల!
వినరాని పలు కేమొ
వినియె కాబోలు
విలపించెనమ్మ
విశ్వేశ్వరుండు!
నీకళ్లె వెలుగులె
వాడు జీవితము!
నీ హస్తస్పర్శయె
వాకు అమృతము!
నీవులేనిది నేను
బ్రతుకలేనన్నాడు—
ఎన్నెన్నొ ప్రియములు
నోరారపలికి
విడిచెనమ్మ రాఘవుడు
విపినాంతరములందు—
దేవిజానకిని!
శంకించె లోకమ్మ!
సీతమ్మ శీలమ్మ!
ఏమిపాపమొ గాని!
ఎంత ఘోరమొ గాని!
శోకించె రాముండు
సీతమ్మ నెడబాసి.

* * *

జానకీ విరహాగ్ని
హృదయమ్ము కాల్చగ
ఆనాటి స్మృతు లన్ని
అగ్నియై దహియింప
పంచవటి పూర్వ
పరిచిత స్థలముల
విహరింప నొకనాడు
వెడలె రాఘవుడు.

[నిష్క్రమణ]
[వనదేవతలు ప్రవేశం]

వనదేవతలు:

విన్నారా విన్నారా ఓ
ప్రియసఖులారా!
ఎంతో చక్కని సందేశం!
రాముడు మన
రఘురాముడు
వచ్చెనట పంచవటీ
వనవిహారమునకె.
రావే శిఖీ వాసంతీ!
ఏమే చెలీ ఆత్రేయీ,
ఎందున్నారే మీరంతా
స్వాగత మీరే మన రామునకు!

[నిష్క్రమణ]
[ప్రవేశం రాముడు]

రాముడు:

నమోవాకమమ్మ
వనదేవతలారా,
అమ్మ గోదావరీ
ఎంత మనోహరమమ్మ నీ గానం
ఎందైనా కనిపించినదా నీ మైథిలి
భూమాతా,
ఎందులకమ్మ, ఆ కంపం,
నీవైనా ఆశ్రయ మీలేదా
నీ తనయకు!
తరులారా, గిరులారా!
ఎంత ఉన్నతం మీస్కంధం,
పరమ పవిత్ర చరిత్రను
భూసుతను చూచితిరా ఎందైనా?
పంచవటి స్థలీ,
నీ వేనమ్మ మా హృదయాలకు
ఆదర్శం, మా భావనలకు పాత్యం,
నీ వెరుగవె అమ్మ
నా హృదయం!
కరుణ చూపలేవె
కానలలో జానకిని విడనాడిన
కఠినాత్ముని పై—
ఓ వనదేవీ!
నేనమ్మ రాఘవుడను!
క్షంతవ్యుడను కానా దేవీ!

* * *

అది మాలతీ నికుంజం
ఏమా అరవిరసిన పూవుల అందం
అదిగో కేకారవ శోభిత
ఉత్కంఠ మయూరం,
ప్రియాసంవర్ధిత
సుందరవర్ణ చిత్రితం!
ఏమమ్మ మల్లీ!
ఎవరిదమ్మ ఆపరిమళ మాధుర్యం.
జానకి సుమహస్తముల
మొలకెత్తిన నీకీ సౌందర్యం
లాలిత్యం సహజమె తల్లీ!
ఇటు రావే హరిణీ
ఎందులకా కన్నీరు
ఏమిటా కన్నులలో దిగులు
లేబచ్చికతో కడుపార
నిను సాకిన జానకి లేదా యిచ్చట!
ఎందులకా చంచల వీక్షణాలు!
ఎవరికోసమా ఆతృత!
కనుగొనలేదా జానకిని
ఎందున్నది నీ మాతృదేవి"

* * *

[ప్రవేశం-వాసంతిక]

వాసంతిక

ఎవరోహో, ఎవరోహో
ఓహో రాఘవులా?
జనకసుతా హృదయేశ్వరులా?
స్వాగతం! సుస్వాగతం!
ఏదీ జానకి? ఏదీ నీ హృదయేశ్వరి?
ఏది మా సోదరి? ఏది నీ ప్రియసఖి?

★ పంచవటి ★

నీవే జీవితమని, నీవే సర్వమ్మని
నెమ్మదితో నిను పూజించిన
అబలను-అమృత హృదయను
అసహాయను-ఆరాధ్య దేవిని
వీలవిడిచితి వెట్లు విడిచితి
కానలోపల కఠోరహృదయా!
ఎంత శాంతము-ఎంతకరుణ
ఎంత రాగము-ఎంత మార్దవము
ఎంతలో కఠినమాయెను
ఎంతలో కర్కశుడవైతివి రాఘవా!
బ్రతుక గలవా సీతవిడచి
పగులలేదా నీదు హృదయం!

రాముడు :

ఆగు మాగుము సోదరీ!
రగులనీకుము అగ్ని జ్వాలలు
పగుఃనీకుము హృదయ ఫలకం,
లోకం నలుమూలల
ప్రతిధ్వనించిన నా
ఆక్రోశం
సోకలేదా నీదు చెవులకు—
జానకి వినా లేనే లేదు
రాఘవుడు-ఈ జీవితమే శూన్యం!
సత్యం ఇది. దేవీ
ముమ్మాటికి సత్యం!
సీతా నిర్వాసనమా!
అది నా ధర్మం! దేవీ!
చేసితి త్యాగం ప్రజకై!

వాసంతిక :

ఏదీ నీ ధర్మం, ఇదేనా నీ త్యాగం
ఎవరికోసమా క్రౌర్యం!
పరమసాధ్విని జానకిని
పరుసను లాడిన లోకమా
నీకారాధ్యం!
బండబారెనా నీదుగుండె
కాల్పలేదా సీత విరహం

రాముడు :

నీవన్నది సత్యం
బ్రతుకజాల సీత విడిచి
లోకంకోసం చేసితి త్యాగం!
సీత లేనిదే ఏమున్నది లోకం!

ఎందున్నాడు రాముడు!
లేదు సఖీ—లేడా రాముడు!
ప్రియా విరహదగ్ధం
ప్రబలాఘాత విశీర్ణం
నా హృదయం!
జానకితోడి జీవిత మాధుర్యం
నాకిక స్వప్నం—సోదరీ!
నేకున్నది చూడు నారూపం
ఏదీ పంచవటీ నాటి హాసం!
అనురాగం- ఆహ్లాదం
నిండిన ఆ కాలం!
సోదరీ! నేనేనా ఆ
పంచవటీ రాఘవుడను!

వాసంతిక :

మన్నింపుమో దేవ!
ఊరడిల్లుమో ప్రభూ!
ఎంత శోకము
ఎంత అనలము
ఎన్ని ప్రళయ పయోధులు
ఎన్ని అగ్ని పర్వతములు
అణచి పెట్టితివయ్యా నీ
ఎడదలోపల రాఘవా!
కడిగివేయుము నీ కళంకమ్ము
కన్నీటి ధారతోడ
ఏడ్చి వేయుము ఎలుగెత్తి
విదేహతనయ విరహా భారమ్ముతీర!

* * *

వండువెన్నెల - నిండువెన్నెల
పాలవెల్లువ పొంగిపారలే
పంచవటిలో సొంపునింపే
పాలరాత్రిని శరద్రాత్రిని
మరచినావే మాధవా!
మరువగలనా! నాటి రేయి!
మరపురాని మధురదృశ్యం!

* * *

వెన్నెలలో రాయంచలతో
గోదావరీ తిన్నెలలో
రాఘవునే రఘురాముని నే
సర్వము నే మరచి క్రీడించెను
మా ప్రియసోదరి!
నీ హృదయేశ్వరి!

పువ్వుల వనాంతరమ్ములో
పుప్పొడిలో శయనించి
నిరీక్షింతు నామె రాక
కన్నులింత చేసికొని,

* * *

మందమారుతమ్ము గిలిగింతపెట
శారద చంద్రికోమ్మృదు స్పర్శతగిలి
తుహినకిరణుడు నీమోము కాంతులీన
నీదు రూపమ్మె మెరసె నామె హృదంతరాన


* * *

దిగ్గన లేచి అడుగులు తడబడ
దీనాననయై సాధ్వసమూర్తియై
కంపిత కరప్రణామాంజలియై
సజలనయనాలతో ఎదుట నిలిచె
నీ ప్రియతమ!
ఎంతకోపమ్మెంత లోపల
ఎంత ప్రేమగ - ఎంత కరుణగ
మారిపోయెనో మరచినావె
రాఘవా!
అణచిపెట్టిన ఆనందవార్ధి
కోపతటమును త్రెంచి పారగ
అక్కు చేర్చితి నామె మోమును
ప్రేమరసము పొంగి పారల.
మీకళ్ళ వెలుగులు
మీ వదన కాంతులు
మీ రాగ దీప్తులు
మీ మధురహాసమ్ము
సిగ్గుపరచెను చందమామను
వెల్లివిరిసెను లోకమంతయు
లేదలనాటి పంచవటి
రాదానాటి శారదరాత్రి
ఏదానాటి పునీతదాంపత్యం
మనోజ్ఞమధుర జీవితం!
అన్ని గతించిపోయె!
మిగిలె నొక దీర్ఘవిషాదగీతి!
ఎంత మధురం
ఎంత విదారకం
ఎంత బాధాకరం
దేవా మీ చరితం
ఎంత విషాదాంత కావ్యం!

(నిష్క్రమణం)

భరత వాక్యం:

సీతారాముల చరితం
నవరసభరితం
కరుణారసపూర్ణం
నిత్యనూతనం, సత్యసుందరం.





మా బలరాం న్యూ ఎలిఫిన్‌స్టన్‌లో 'లిస్బన్' చూడ్డానికి వెళ్లాడు. ఆ వేళ అనుకోండే వాడు వాసంతి ప్రక్కనే కూర్చోవడం తటస్థించింది. అసలు వాడు ఆడపిల్లలంటే ఆమడదూరం పారిపోయేరకం. మరి వాడికా బుద్ధి ఎలా పుట్టిందో. ఆ అమ్మాయిని గాఢంగా ప్రేమించేసి ఊరుకున్నాడు.

ఆ అమ్మాయి పేరు వాసంతి అని వాడికి తెలియదు. ఇంతకి ముందెప్పుడూ వాడు ఆ అమ్మాయిని చూడనే నాలేదు. అయితే ఆ అమ్మాయిని చూసేసరిడంతో ఆమె తనకోసమే పుట్టిందనే దృఢాభిప్రాయం వాడిలో లోతుగా పాతుకుపోయింది. ఆ అమ్మాయితో ఎలా పరిచయం కలగజేసుకోడమూ ఆమెని ఎలా పలకరించడమూ అనే ఆలోచనలో ఇంటర్వెల్ వచ్చేదాకా సతమతమౌతూనే ఉన్నాడు మావాడు.

అకస్మాత్తుగా మావాడికి తన పాదంమీద ఏదో బరువుగా ఉన్నటూ, ఉండుండి పాదం చచ్చేట్లా నొప్పి పెడుతూన్నటూ అనిపించింది. తను కూర్చున్న కుర్చీ కాలు పాదంమీద పడిందో లేక వెనకనుంచి ఏదైనా బరువైన రాయి పాదంమీదికి దొర్లిపడిందో అన్న అనుమానం మా బలరాంని బాధించసాగింది. ఇంతలో ఇటర్వెల్‌కి లైట్లు వెలిగాయి. మావాడు క్రిందికి వంగిచూశాడు. తన ప్రక్కనే కూర్చున్న అమ్మాయి పిక్చర్ మీది ఉత్సాహాతిరేకంవల్ల కాబోలు తన బూటుకాలు దర్జాగా మావాడి పాదంమీద ఆన్చి ఉంచింది. అంతేకాదు తన ఆనందానుభూతికి అనుగుణ్యంగా అవసరమని తోచినప్పుడల్లా తన బూటు హైహీలుతో మావాడి పాదాన్ని అతి నిర్దాక్షిణ్యంగా నొక్కిపారేసోంది.

కొంచెం బాధపడితే పడ్డాడుగాని మా బలరాంకి బలే అవకాశం దొరికింది. "క్షమించండి" అన్నాడు వాడు అతికామ్‌గా.

ఆ అమ్మాయి తల వాడికేసి త్రిప్పింది. "ఏమిటి?" అన్నట్టు చూసింది.

"నా పాదం-మీరు ఆనందించడం అయిపోతే నా పాదం తీసుకుందామని."

ఆ అమ్మాయి క్రిందికి చూసింది, సిగ్గుపడిపోయింది. చటుక్కున కాలు తీసుకుంటూ, "వెరీవెరీ సారీ" అంది.

"పరవాలేదు-మీ ఆనందానికి నా పాదం దోహదమిచ్చిందంటే చాలా సంతోషించదగ్గ విషయం."

"నాకు మీరు చెప్పేందాకా నిజంగా తెలియనేలేదు సుమండీ"

"అందులో ఆశ్చర్యమేముంది? దీన్నిబట్టి మీకు డిటెక్టివ్ ఫిలిమ్స్ అంటే చాలా ఇష్టమని తెలుస్తోంది."

"ఇంతా అంతా అనుకున్నారా? చచ్చేటంత ఇష్టం.

"ఈ విషయంలో మనిద్దరం ఒకటే. మరి డిటెక్టివ్ నవలలు?"

"ఇంక అడిగారూ; మరీ ఇష్టం."

"ఇంకేం? మనిద్దరికీ ఈ విషయంలో ఏం తేడాలేదు. మీరు "రజాయిమీద రక్తం" చదివారా?"

"చదవకేం? "తెగిన గొంతులు"కంటె చాలా బావుంది నాకు."

"బాగా అంతే. అసలైన హత్య-రక్తం, గాయాలూ, వికృతరూపం అన్నీ ఉన్నాయి. తెలివైన డిటెక్టివ్-అర్థంలేని కీలకాల ఆధారంతో అద్భుత పరిశోధన చేశాడు."

ఇద్దరు సాహిత్యప్రియులూ ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు చూసుకున్నారు. సమానసాహిత్యాభిరుచికంటె స్నేహానికి గట్టిపునాది ఇంకేముంది?

ఆ అమ్మాయి అతి ఉత్సాహంతో "నా పేరు వాసంతి" అంది.

మావాడు అంతకంటె ఉత్సాహంతో, "నాపేరు బలరాం" అన్నాడు.

అంతలో ఆ అమ్మాయి ఉత్సాహం ఉప్పగా చల్లారిపోయిన దానిలా "ఒక్క

రామునిశాపం

మునిపల్లె సరస్వతి

లంకాధిపతి వైరి రామచంద్రుడు,
దండకారణ్యమున దశరథునియానన్,
సంపదలు విడనాడి సీతతో గూడి.
గండములు దాటుచు గడుపుచుండగను-
మాయలేడిని గాంచి మరదిలక్ష్మణుని,
ముదిత సీతాదేవి ముదమారవేడ,
ఇనవంశ సోదరుల్ నిశితశరములతో,
బసిడి జింకను బట్టపయనమైనారు.
మంచి సమయంబంచు నెంచి రావణరాజు,
దండకారణ్యమున కొచ్చిదా నిలచి,
శంఖధ్వనుల జేసి చెలియనుంకించి
పంచవటియందున్న పడతి సీతను బట్టి-
గగన వీథులు దాటె గరుడవాహనురీతి,
విహగ జాలము లన్ని వెఱచె నా ఘడియ,
సుగుణశీలురైన సోదరుల కపుడు
దగిలె నపశకునములు యా నిమునమందె-
శోకవారధి దేలిన శ్రీరామవిభుడు,
పంచవటియందు కాంతలేకుంట గాంచి,
విగతజీవుడైన మానవుని రీతిగా
జగములదిరో కార్చు నిట్టూర్పు విడిచె,
చెట్టు పుట్టలనేమి: గుట్టుగా నెన్నో
సకలజీవుల నడిగె సీత సంగతిని-
శోకించి శ్రీరామచంద్రు డానాడు
చేరె నాకాంతార కాసారమునకు:
చక్రవాకములార! మీ చెలియ సీత
ఎందేగెనో జాడ నెరిగింపరమ్మనుచు,
శోకించుచున్నాడ సీతమ్మకొఱకు,
దుఃఖాన్ని ఈనాడు దిగమింగజాలనె.
దంపతులగు చక్రవాకములు,
రాముని శోకముగాంచి నవ్వినవి-
శోకసంద్రము నున్న శ్రీరామవిభుని
మనసు కూరట లేక మరి బాధ రెచ్చె:
రామరాజ్యము నేలు రామాభిరాముడు,
తామసము విడలేక శాపమును విడచె,
చక్రవాకము లార ఏరాత్రిసమయముల,
చెలుల చెంతనెనుండి శోకింతురనియె,
చూపు లేకుండగా చక్రవాకములు,
ప్రియుల చెంగటనుండి ప్రేమ నెరుగకను,
ఆనాటి నుండియు నీనాటివరకు
రామశాపము దలచి రాత్రి దుఃఖించు:

పప్పులో విషం

సంగతి-మనం ఇలా మాట్లాడుతూండగా మా నాన్న చూశారంటే కొంప మునిగిందన్న మాటే. ఆయన అసలే రిటైర్డు మిలిటరీ ఆఫీసరు-అందులో ముక్కోపి."

మా బలరాం గ్రుడ్లుమిటకరిస్తూ "అలాగా" అన్నాడు.

"అసలు సంగతి-ఫార్మల్ గా ఇంట్రడ్యూస్ చెయ్యబడకుండా నాతో మాట్లాడే వాళ్లని చూస్తే మానాన్నకి మహాఒళ్ళుమంట. ఆయన అటువంటి వాళ్ళని ఎంతేనా ద్వేషిస్తారు."

నీళ్ళు నములుతూ మావాడు మళ్లీ "అలాగా" అన్నాడు.

వాసంతి మరుక్షణంలో విషయాన్ని మార్చేస్తూ "మీరు లక్షాధికారనుకోండి-డబ్బుకోసం మిమ్మల్ని ఎవడో హత్యచేస్తాడు. పదునైన కైజారుపోటులో హత్య జరగడం బావుంటుందా? లేక విరసవిషగంధకాల ప్రయోగంద్వారానో తుదముట్టించబడడం బావుంటుందా? చెప్పండి!" అంటూ మా బలరాంని నిలవదీసి అడిగింది.

మా బలరాం ఆమె ప్రశ్నకి ఏం జవాబు చెప్పడమా అన్న డైలమాలో పడ్డాడు. ఇంతలో ఒక భీమకాయుడు వచ్చి అమాంతం వాసంతి ప్రక్క ఖాళీగాఉన్న సీటులో కూర్చున్నాడు. అంతేకాదు, అసలే బెదురు బెదురుగా ఉన్న మా బలరామ్‌ని ఇంకా హడలకొడుతూ నఖశిఖపర్యంతం పరీక్షించసాగాడు. దెబ్బతో మావాడు కంగారెత్తిపోయి శూన్యదృక్కులతో వాసంతికేసి చూశాడు.

ఆ భీకరమూర్తి "ఎవరీవ్యక్తి?"అని వాసంతిని ప్రశ్నించాడు. వాసంతి మా బలరాంకేసి కొంటెగా చూస్తూ "ఈయన బలరాంగారని మా కాలేజిమేట్"అంటూ వాణ్ణి తనతండ్రికి ఇంట్రడ్యూస్ చేసింది.

వాసంతి తండ్రి భీమారావు అతినిర్లక్ష్యంగా, మావాణ్ణి బెదిరిస్తూన్నట్టు "అలాగా!" అన్నాడు. తరవాత వాసంతితో ఫరవాలేదు. నా గా జాతి నాయకుణ్ణొకణ్ణి తుపాకితో కాలుమీద కాల్చానని చెప్పాను జ్ఞాపకముందా? ఈ బలరాం ఎవరో వాడిలా ఉన్నాడు. అయితే వాడు కొంచెం ఎరుపు ముక్కుకి కాద వుంటుంది అంతే తేడా."

మా బలరాం ఉలిక్కిపడి,"కాల్చేశారా! ఎందుకు?" అని అడిగాడు.

"పెద్దమనిషి తరహాగా ప్రవర్తించకపోడం వల్ల."

మావాడు కొంచెం కంగారుగానే, "ఆ దెబ్బతో వాడి తెగులు కుదిరి పెద్దమనిషి తరహానిగూర్చి ఒక పుస్తకం వ్రాసేసి ఉంటాడు" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

భీమారావు గగ్గయ్య పోజులో ఇంకా నిర్లక్ష్యంగా మావాడిచేతికి తన విజిటింగ్ కార్డు అందించాడు.

"నిస్సందేహంగా వ్రాసే ఉంటాడు. సరే, ఇందులో నా ఎడ్రసు ఉంది. ధైర్యముంటే ఏరోజేనా మధ్యాహ్నం మా ఇంటికి రావచ్చు. పెద్ద పులి చర్మాలు, పులి తలకాయలు-గోళ్లు, దుప్పికొమ్ములూ ఇత్యాది వాటిమీద మోజుంటే తప్పకుండా రావచ్చు."

నిజానికి మా బలరాంకి అటువంటి వస్తువులంటే ఎంతమాత్రం మోజులేదు. అడవులు-అడవి జంతువులు-వేట-వేటగాడు-తుపాకి ఇత్యాది శబ్దాలే మావాడికి పనికిరావు.

ఇంటర్వల్ అయిపోయింది. మావాడికి పిక్చర్ మీది ఆసక్తి ఎప్పుడో నశించింది. వాడిని అప్పట్లో ఎదుర్కొన్న సమస్య ఒకటే-వాసంతి ప్రేమని పొందడం ఎలా? భీమారావు అనే ఈ విలన్‌ని ఎలా టాకిల్

చెయ్యడం ?

మా బలరాంని గూర్చి ఎక్కువగా చెప్పడం నాకిష్టంలేదు. అయితే వాడు అతి స్వల్పకాలంలో అద్భుతఫలితాన్ని సాధించగలిగాడని మాత్రం ఒప్పుకుతీరాలి.

ఒకనాటి సాయంత్రం వాడు తిన్నగా వాసంతి ఇంటికివెళ్లాడు. అదృష్టవశాత్తు ఆమెతండ్రి ఊళ్ళోలేడు. వాడు అతి ధైర్యంగా వాసంతి చేతిని తనచేతిలోకి తీసుకుని తన ప్రేమని వ్యక్తపరిచేశాడు.

కొంతసేపటిదాకా అంతా బాగానే నడిచింది. వాసంతి పెద్దప్రయత్నమేం చెయ్యలేదు. నాకలలోని ప్రేమికుడవు నువ్వే అని ఒప్పుకుంది.

ఆ తరువాతే ఆమె అసలు విషయానికి వచ్చింది.

వాసంతి తన విశాల నేత్రాల్లో నీళ్లు తిరుగుతూండగా "లాభంలేదు- మానాన్న ఈ పెళ్ళికిచస్తే ఒప్పుకోరు" అంది.

బలరాంకి అర్థంకాలేదు- "ఎందుచేత ? నావిషయంలో ఆయనకి గల అభ్యంతరం ఏమిటి ?" అని అడిగాడు.

"చెప్పలేను - కాని నీసంగతి వచ్చినప్పుడల్లా ఆయన, 'ఆ బుర్ఖదిల్' అంటున్నారు.

"బుర్ఖదిల్ అంటే ?"

"విడబరచి చెప్పడం కష్టం — ఆయన అసహ్యించుకునే ఏ జంతువుపేరో ఐ ఉంటుంది. నువ్వు బాల రచయితవని ఆయనకి తెలియడం ముప్పొచ్చింది."

"బాల రచయితవంటి సరళమైన, పరిశుద్ధమైన స్వభావంగల యువకులింకెవరున్నారు ఈ ప్రపంచంలో ?" అంటూ మా బలరాం ఛాలెంజి చేశాడు.

"అవును. నాకు తెలుసు. కాని మా నాన్న మిలటరీ ఉద్యోగస్థుల్నీ, ఇంకా ఆ వృత్తికీ, అటువంటి వృత్తులకి చెందినవాళ్లనీ గౌరవిస్తారు."

"నేను ఒక సుప్రసిద్ధ డిటెక్టివ్ రచయిత వద్ద ఎప్రెంటిస్ గా పనిచేస్తూన్న సంగతి నీకు తెలియదనుకుంటాను."

వాసంతి సందేహిస్తూనే "అయివుండొచ్చు కాని—" అంటూ నసిగింది.

మా బలరామ్‌కి చికాకు పుట్టుకొచ్చింది— "ఎందుకొచ్చిన గొడవ! ఇవన్నీ పాతకాలపు సంగతులు. ఇరవై ఏళ్లక్రితం తల్లిదండ్రుల అభిప్రాయప్రకారం పెళ్ళిళ్ళు జరిగేవి. అదంతా ఇప్పుడు సాగదు."

"అవును-అయితే దురదృష్టవశాత్తూ మా నాన్నకి ఈ విషయాలన్నీ తెలియవు."

బలరాం గట్టిగా అరిచాడు, "ఈ పెద్దవాళ్ళెప్పుడూ ఇంతే! అనవసర విషయాల్లో జోక్యం కలగజేసుకుంటూరు. చల్లగా ఎక్కడికేనా పారిపోదాం. పెళ్లి చేసుకుందాం. తరవాత మెల్లిగా ఉత్తరం రాయచ్చు మీ నాన్నకి."

వాసంతి ఒళ్ళు ఒక్కసారిగా గుర్పొడిచింది. ఆమె, "అమ్మో! ఇంకేమన్నా ఉందా? మన్ని వేటాడేస్తారు. నీకు మానాన్న సంగతి తెలియదు. ఉత్తరం అందిన క్షణం మనం ఎక్కడుంటే అక్కడికి వచ్చేస్తారు. ఒక్క దెబ్బని నిన్నూ నన్నూ—ముఖ్యంగా నిన్ను పైకెగరేసి క్రిందికి ఒదిలేస్తారు. ఇంక మన హనీమూన్ నాశనమై పోయిందన్నమాటే!"

మా బలరాం ఎంత మాత్రం కంగారుపడలేదు. ఆలోచించాడు. "మనం చెయ్యవలసిందల్లా ఒక్కటే కనిపిస్తోంది. నేను మీ నాన్నని కలుసుకుని మాట్లాడుతాను. ఆయనకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తాను. ఆయన ఇప్పుడెక్కడున్నారు?"

"విల్లివాకంలో హరిప్రసాద్ అని జమీందారు ఒకాయన ఉన్నాడు. మా నాన్న స్నేహితుడు. నాలుగు రోజులు ఉండి రావడానికి అక్కడికి వెళ్ళారు."

"అయితే ఇంకేం? హరిప్రసాద్ గారితో నాకు బాగా పరిచయంఉంది. అప్పుడప్పుడు వస్తూ ఉండమని కనిపించినప్పుడల్లా అంటూంటారు. వెంటనే వెళ్లాను. మీ నాన్నకి నా సంగతి బాగా తెలిసేట్లా చేస్తాను చూడు. సమయం చూసి అసలు సంగతి అడుగుతాను. పని జరగక పోయినప్పుడు చూస్తాను."

"కాని బలరాం-జాగ్రత్త సుమా అసలే నువ్వు మెత్తని వాడవు. అందులో నూ చాలా మొహమాటస్తుడివి. మా నాన్న ధాకకి నువ్వు తట్టుకోలేవేమో?"

"ప్రేమ ఎంతైనా చేయిస్తుంది - చూస్తూ ఉండు."

"అంతేనంటావా? నాన్న సంగతి నీకు తెలిసిందే కదా. ఏదేనా స్టిమ్యులెంట్ - ఏ ద్రాక్షాసవంలాంటి టానిక్కేనా నీ వెంట ఉండడం మంచిదేమో. మా నాన్న వంటివాణ్ని ఎదుర్కొడానికి వెళ్ళేటప్పుడు అటువంటిదేదేనా వెంట తీసుకు వెళ్ళమని నా సలహా."

మా బలరాం కొంచెం ఆలోచించిన తరువాత, "నిజమే. నీసలహా అమూల్యమైనది ఆ ప్రకారమే చేస్తాను. అయితే నేను వెళ్లినా మరి."

"సరే కాని నన్ను మరిచి పోతావేమో నని నాకు భయంగా ఉంది."

"ఎంతమాట! నిన్ను ఎడబాసి ఉన్న ప్రతి క్షణం నీ సుందరరూపం నా కళ్లముందు నాట్యం చేస్తూనే ఉంటుంది. అయితే ఒక్క సంగతి—"స్వర్ణ మేఖల" క్రొత్త రచన "పప్పులో విషం" నావెంట పట్టుకెళుతున్నాను. అప్పుడప్పుడు అది చదువుతూ ఉంటాను. ఆ మిగిలిన టైమంతా మాత్రం...అన్నట్టు 'పప్పులో విషం' చదివావా?"

"ఇంకా చదవలేదు. ఇందాకా బజారునుంచి వస్తూన్నప్పుడు పుస్తకంమాత్రం కొన్నాను. నువ్వు లేనప్పుడు ఆ పుస్తకంతోటే గడపాలి. త్వరగా వచ్చేస్తావుగా"

"ఓ, పని ఐపోతే అక్కడ ఇంకొక్క క్షణం ఉండను. ఇంక నేను వెడతాను. "తెగిన ముక్కు రహస్యం"లో డిటెక్టివ్ మేఘనాదరావు ఎట్టి వ్యతిరేక పరిస్థితుల్లో ప్రభాకుమారిని పెండ్లాడాడో గుర్తుంచుకో. ఇద్దరు దారుణహంతకుల్ని-ఒక పూరి బందిపోటు ముఠానీ అతను ఆ అమ్మాయికోసమే, అవలీలగా జయించాడన్నది కూడ నువ్వు మరిచిపోకు."

ఇలా అంటూనే మా బలరాం తొందరగా పరిగెత్తాడు.

వాడు భోజనంవేళకు విల్లివాకం చేరుకున్నాడు. హరిప్రసాద్ స్వాగతమిచ్చాడు. వాసంతి తండ్రి భీమారావుకాక ఇంకొక పాతికపాటి యువకుడుకూడ జమీందారు అతిథిగా వచ్చాడు. పేరు మురళీధర్. ఈ మధ్యే పోలీస్ ఇన్స్పెక్టర్ గా రిక్రూట్ అయాడు.


భీమారావుని ప్రత్యక్షంగా చూడ్డంతో మాబలరాంయొక్క ఉత్సాహమంతా ఒక్కసారి చల్లారిపోయింది. ఆ రోజున సినీమా హాల్లో చూసినప్పుడు భీమారావు గగ్గయ్యని మరిపించాడు. ఇప్పుడు గగ్గయ్యని మరిపించడమే కాక, దొమ్మేటిని జ్ఞాపకం చేస్తూన్నట్టు కనిపించాడు. అతనికితోడు ఈ ఇన్స్పెక్టరొకడు.

భోజనాలుకాగానే బలరాం తన గదిలోకి వెళ్ళిపోయాడు. సూట్ కేస్ లోంచి ద్రాక్షాసవంసీసా తీశాడు. ఒకదాని తరవాత ఒకటి చొప్పున నాలుగు గ్లాసుల షరబత్ కలుపుకుని త్రాగేశాడు. అలా చెయ్యడంలో వాడి ఉద్దేశ్యం భీమారావు గదికివెళ్లి వాసంతి విషయం వెంటనే తేల్చేసుకోడానికి తగిన ధైర్యం, ఉత్సాహం కలిగించుకోడమే.

వాడిఉద్దేశ్యం ఎంతవరకు నెరవేరిందో చెప్పడం కష్టం. అయితే లేని ఆవేశం ఏదో తెచ్చుకుని వాడు పెదపెద్ద అంగలతో భీమారావు గదికేసి పరిగెత్తాడు. భీమారావు మంచంమీద పడుకుని అతిశ్రద్ధగా ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. అట్టమీది పేరుచూసి మావాడు అకస్మాత్తుగా స్తంభించిపోయాడు. భీమారావు 'స్వర్ణమేఖల' క్రొత్త రచన 'పప్పులో విషం' చదవడంలో మున్నిగై ఉన్నాడు.

మాబలరాం ఒక్క దెబ్బతో ఉగ్రుడైపోయాడు. గట్టిగా అరుస్తూ "ఎంతదారుణం ఎంతసాహసం! నన్నడగకుండా నాపుస్తకం తీసుకుని చదవడానికి మీ కెన్ని గుండెలున్నాయి!" అన్నాడు. భీమారావు పుస్తకం కొంచెం క్రిందికిదింపి మావాడికేసి కోపంగా

(47 వ పేజీ చూడుడు)


దృఢశక్తి....
తుషార్‌తో వండిన మీ భోజన పదార్థములు నుండి మీ కవసరమైన శక్తినంతయు పొందగలరని మీరు నిస్సందేహముగా నమ్మవచ్చును. అసలు నేతి యందలి పుష్టికి సమానమగు అదనపు పుష్టికరమైన ఆహార పదార్థములతో కలసి, ఆరోగ్య పద్ధతుల్లో సీలు వేసిన డబ్బాల యందు నింపబడిన తుషార్ మీ ఆరోగ్యమునకు, ఆనందమునకు ఆదర్శమైనది.
Tushar
2 పౌ॥, 5 పౌ॥, 10 పౌ॥ల, డబ్బాల్లో లభించును.
వనస్పతి విటమిన్ ఏ, డి లతో నిండియున్నది.
తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్, కర్నూలు.
Tushar



భారత రక్షణవ్యయం భారీగా ఉన్నదా?

సాధారణ బడ్జెట్ పై లోక్ సభ చర్చ సాగించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని గూర్చి చాలా మూఢనమ్మకాలున్నాయి. దేశం తాలూకు ధనం దుర్వినియోగమై పోకుండా పార్లమెంటు జాగ్రత్తగా చూస్తూ ఉంటుందనేది ఈ మూఢనమ్మకాల్లో ముఖ్యమైనది. ఇంతకంటె కల్తీలేని మూఢనమ్మకం మరొకటి ఉండదు. వృథావ్యయం కాకుండా, దుబారా కాకుండా నివారించే శక్తి పార్లమెంటుకు లేదు. ఈ విషయం ప్రశ్నాకాలంలో స్పష్టంగా తేలిపోయింది.

అంచనాల సంఘం నివేదిక ఒకటి ఇటీవల ప్రచురితమైంది. ప్రారంభ, ప్రాథమిక, ప్రాతిపదిక, నిర్బంధ విద్యల సమస్యను ఈ నివేదికలో సాకల్యంగా చర్చించారు. ప్రారంభ విద్యకు సంబంధించినంతవరకూ భారతదేశానికంతటికీ ఒకే విధానమంటూ లేకపోవటం బాగా లేదని ఈ సంఘం విచారం వెలిబుచ్చింది. మిగతా విద్యాదశలను గూర్చి వేరే నివేదికల్ని ప్రచురిస్తారు. అయితే ప్రశ్న ఏమిటంటే, ఇది రాజ్యాంగ విహితమా కాదా అని. విద్యావిషయిక వ్యవహారాలను 1921 లోనే రాష్ట్రాలకు బదలాయించారు. భారత ప్రభుత్వం ఫెడరల్ పద్ధతి ప్రభుత్వం గనుక విద్యావ్యవహారాలు రాష్ట్రాలకి సంబంధించినవే. యూనివర్సిటీ విద్యకు కేంద్రం డబ్బు సహాయం చేయటంకూడా రాజ్యాంగ చట్టానికి విరుద్ధమే అన్నప్పుడు, జిల్లాబోర్డు బాధ్యతకు సంబంధించిన పూర్వ ప్రాథమిక విద్యను గూర్చి వేరే చెప్పనవసరమే లేదు. రాజ్యాంగానికి ఆధారభూతమైన ఫెడరల్ వ్యవస్థ ముఖ్యసూత్రాలను రాజ్యాంగ నిర్మాతలే నిర్లక్ష్యం చేయటం శోచనీయంగా ఉంది.

అయితే కేంద్రప్రభుత్వానికి మాత్రమే సంబంధించిన దేశరక్షణ బాధ్యతను పలువురు విమర్శించారు. భారతదేశం తనంతట తానుగా ఆయుధ బలం తగ్గించేసుకోవాలనే వాదనను సమర్థించటానికి మహాత్మాగాంధీ పేరుకూడా చర్చలోకి లాక్కొచ్చారు. అహింసా సిద్ధాంతాన్ని అగ్నిపరీక్షకు పెట్టారు.

"గాంధీజీ జీవితంలో అంతిమఘట్టం" అని శ్రీ ప్యారీలాల్ రచించిన పుస్తకంలో అహింసనుగూర్చిన ఒక చిన్న ఉదాహరణ ఉంది :

మాట్లాడితేక తీసి జళిపించే రజాకార్ నాయకుడు కాసెం రజ్వీకి మహాత్మాగాంధీకి జరిగిన సమావేశంవల్ల రజ్వీలో కాస్తయినా

వెన్ను పెంచటం, పశుపులు, సామగ్రుల ధరలు పెరిగిపోవటం, రైల్వేచార్జీలు పెరగటం, జాతీయ పౌరసేన, లోక్ సహాయక సేన మున్నగు వాటిమీద ఎక్కువఖర్చు పెట్టటం, సైనికులవద్ద రెండవ ప్రపంచయుద్ధ కాలంనుంచీ ఉంటున్న ఆయుధసామగ్రిని తీసేసి కొత్త ఆయుధాలను సరఫరాచేయటం మొదలైన కారణాలవల్ల రక్షణవ్యయం అధికమైంది.

గడచిన ఆరేళ్ళలో పెట్టుబడి కేటాయింపులతోసహా రక్షణవ్యయం ఈ క్రింది విధంగా ఉన్నది :—

	1953 -54	1954 -55	1955 -56	1956 -57	1957 -58	1958-59 బడ్జెట్
రెవిన్యూపద్దు నుంచి తీసుకొని చేసినఖర్చు	186	187	172	192	266	278
రక్షణశాఖ పెట్టుబడి కేటాయింపు	10	8	18	20	25	27

హృదయ పరివర్తనం జరిగినట్లు లేదు. జరక్కపోగా మనిషి మరింత విశృంఖలంగా తయారయ్యాడు. ఆ తరవాత అతడు ఢిల్లీ ఎర్రకోటలో తను స్థిరపడేదాకా నిద్రపోనని ప్రతిజ్ఞచేశాడు. సరిగ్గా ఎనిమిదినెలల తరవాత పోలీసుచర్య జరిగి కాసింరజ్వీ కోరిక నెరవేరింది. అంటే భారతసైన్యం జరిపిన పోలీసుచర్య అనంతరంగాని రజాకార్ నాయకుడికి బుద్ధి రాలేదన్నమాట.

రక్షణశాఖపద్దు అధికం కావటానికి చాలా కారణాలున్నాయి. సైనికులకు అల

సైనికులకిచ్చే అలవెన్సు పెంచటం, ఎక్కువ గృహాలు కట్టించటం, రైల్వే చార్జీలు పెరగటం మొదలైన కారణాలవల్ల సైనికులకు అయ్యే ఖర్చు రు 33 నుండి 35 కోట్లదాకా ఎక్కువకాగా, సరుకులు సామగ్రుల ఖర్చు 70 నుండి 72 కోట్ల రూ.లదాకా ఎక్కువైంది. సరుకుల ఖరీదులు ప్రపంచమంతటా పెరిగాయి; భారతదేశంలోనూ పెరిగాయి. లోగడ ప్రారంభించిన కొన్ని కార్యక్రమాలు ప్రస్తుత సంవత్సరంలోను, వచ్చేసంవత్సరంలోను ముగింపునకు రాబోతున్నాయి. అందుచేతే ఈ రెండేళ్ళలోనూ వీటికింద డబ్బు అధికంగా ఖర్చు పెట్టవలసివస్తోంది.

కేంద్రప్రభుత్వపు ఆదాయంలో చాలా పెద్దభాగం రక్షణశాఖకే ఖర్చుఅయిపోతోందని కొందరు విమర్శించారు. ఈ క్రింది పట్టిక చూసి, కేంద్రప్రభుత్వపు మొత్తం ఆదా

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

★ న్యూఢిల్లీ లేఖ ★

యంతో పోలిస్తే రక్షణ వ్యయం నిజానికి తగ్గుతూ వస్తోందని గ్రహించవచ్చు:—

సంవత్సరం	రక్షణ రివిన్యూ ఖర్చు	మొత్తం భారత ప్రభుత్వపు రాబడి	రక్షణపద్దు ఎంత శాతం?
	రు. కోట్లు	రు. కోట్లు	
1953-54	186.30	415.98	44.79%
1954-55	186.66	456.13	40.92%
1955-56	172.33	504.32	34 15%
1956-57	192.14	589.96	32.57%
1957-58 (సరిచేసిన లెక్కలు)	266.05	724.63	36.70%
1958-59 బడ్జెట్	278.14	768.98	36.17%

రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభించారు గనుక, రక్షణశాఖకు ఎక్కువ ధనం వ్యయంచేయటంతో ప్రణాళికకు కావలసిన డబ్బు తగ్గిపోతుందని మరికొందరు విమర్శించారు. పెట్టుబడి ఖర్చుతో కలిపి భారత ప్రభుత్వం మొత్తం ఖర్చుచేసున్నది ఇది:—

సంవత్సరం	భారత ప్రభుత్వం మొత్తం ఖర్చు	మొత్తం రక్షణ ఖర్చు	ఎంత శాతం?
	రు. కోట్లు	రు. కోట్లు	
1955-56	955	190	19.9%
1956-57	1091	212	19.4%
1957-58 (సరిచేసిన లెక్కలు)	1480	291	19.6%
1958-59 బడ్జెట్	1609	305	18.9%

రాష్ట్రప్రభుత్వాలు ఖర్చుచేసే రు. 1000 నుండి 1100 కోట్లదాకా ధనాన్నికూడా కలుపుకుంటే రక్షణవ్యయం మొత్తం ప్రభుత్వవ్యయంలో నూటికి పదకొండో, పన్నెండో ఉంటుంది. అంతే. దాదాపు 12 లక్షల 67 వేల చ. మైళ్ళు ఉన్న దేశవిస్తీర్ణాన్ని, 9300 మైళ్ళు పొడుగున్న భూభాగాన్ని, 3535 మైళ్ళు పొడుగున్న కోస్తాను లెక్కలోకి తీసుకుంటే ఈ రక్షణ వ్యయం భారీగా ఉందనటానికెక్కడా ఆస్కారం లేదు.

ఇక సరుకులు, ఆయుధ సామగ్రి విషయంలో, ఇదివరకే ప్రారంభించిన కార్యక్రమాలు ఇప్పుడు పూర్తికావస్తున్నాయి గనుక చెల్లింపులక్రింద ఇంతడబ్బూ ఖర్చు కావలసి వస్తోంది. రక్షణ సిబ్బందికి కావలసిన సరుకులను ఇతరదేశాలలోను, భారతదేశంలోను కొనటానికి ఇటీవలి సంవత్సరాలలో ఈవిధంగా ఖర్చయింది:-

	1956-57	1957-58	1958-59 (బడ్జెట్)
భారతదేశంలో	85	45	56
ఇతర దేశాల్లో	45	98	92

ఆయుధసామగ్రి విషయంలో, రక్షణ శాఖ స్వల్పకాలికంగాను, దీర్ఘకాలికంగాను కూడా పథకాలు తయారుచేసుకొని పని చేయవలసి ఉన్నది. తక్షణం ఇప్పటికిప్పుడు కావలసిన సామగ్రిని ఇతరదేశాలనుంచి వెంటనే తెప్పించుకోవటం అవసరమే కాని, దీర్ఘకాలికంగా మనకు కావలసిన సామగ్రిని మనమే తయారు చేసుకోవటానికి కూడా రక్షణ శాఖ ప్రాముఖ్యం ఇస్తోంది. దేశంలోని వస్తుసంపదనే వినియోగించుకుని రక్షణసామగ్రి తయారీని అభివృద్ధి చేసుకునేందుకు చాలా పథకాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

హానిసతనం రాకుండా చేసుకునే ఇన్సూరెన్సు లాంటిది రక్షణవ్యయం. చీకటియుగమనబడే రోజుల్లోకూడా భారతదేశం బాగా భాగ్యవంతంగా ఉండేదని ప్రపంచమంతటా తెలిసిన విషయమే. తగినంత సాయుధబలం లేకుండా ధన ధాన్య సమృద్ధమైన దేశానికి ఎన్నటికైనా పరదేశాలవల్ల ముప్పుతప్పదు. సైనికంగా బలహీనంగా ఉండటంవల్ల ఎంత ప్రమాదమో, మహమద్ గజినీ భారతదేశం మీద చేసిన పదిహేడు దండయాత్రలూ తెలుపుతున్నాయి...ఆగజినీబంధువు లేపదేళ్ల క్రితం కాశ్మీర్ మీద దాడిచేయగా, భారత సైనికబలం వారిని వెనక్కి తరిమి కొట్టింది.

పనీపాటా లేని సోమరులను పోషించటానికి శ్రేయోరాజ్యం పేరిట లక్షలాది ధనం ఖర్చు చేస్తున్నారు. తాత్కాలికమైన పని కోసం ఉద్యోగం లోకి చేర్చుకున్న పని వారిని ఆ పని పూర్తికాగానే తొలగించటానికి కూడా వీలులేక పోతోంది. కాగా, భారత స్వాతంత్ర్య రక్షణకు జీవితాలు అంకితంచేసిన సైనికులను తగ్గించి, అలా మిగిల్చిన డబ్బుతో ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఆ ఇతర కార్యక్రమాల్లో ఒకటేమిటంటే కొత్తగా ప్రవేశపెడుతున్న సాంస్కృతిక వ్యవహారాల శాఖ. సంస్కృతి అంటే ఒకానొక జీవితవిధానం గాని, నాటకాలాడించడం, పాటకచేరీలు, నాట్య ప్రదర్శనాలు, చిత్రకళా ప్రదర్శనాలు జరిపించటం కాదు. సంస్కృతిని అధికార బలంతో ప్రజలకు అంటగటలేరు.

సంస్కృతిని నిర్వచిస్తూ టి. ఎస్. ఇలియట్ ఒక పుస్తకం వ్రాశారు. అందులో ఆయన ఇలా అన్నారు:

“విద్యవలన సంస్కృతి అభివృద్ధి అవుతుందో లేదో తెలియదుగాని, తప్పకుండా సంకరమూ, భ్రష్టమూ అవుతుందని మాత్రం చెప్పగలము. ప్రతివాడినీ విద్యావంతుణ్ణి చేయాలనే తొందరపాటువల్ల, ప్రమాణాలు పడిపోతున్నాయి. సంస్కారము కలగజేసే ప్రధాన విషయాల అధ్యయనం అంతకంతకూ మానివేస్తున్నాము. పూర్వపు సంస్కృతి భవనాలను కూల్చివేసి, రానున్న తరాల అనాగరిక జనం తమ యంత్ర సార్థవాహాలను నిలుపుకునేందుకు జాగా చేసి ఇస్తున్నాము.”

కొన్ని కొన్ని చూస్తేగాని నమ్మలేం. పదేళ్లకిందట న్యూఢిల్లీని చూసినవారు ఆ రోజుల్లో ఎక్కడా సంస్కృతి అనేమాట వినిపించేది కాదనీ, ఆచరణలోనే సంస్కృతి మిళితమై ఉండేదనీ అంటారు. ఈరోజునో! ఎక్కడ చూసినా సంస్కృతి జపమే తప్ప సంస్కృతి లక్షణాల్లో ఒక్కటైనా ఆచరణలో కనిపించదు. న్యూఢిల్లీలో కనిపించే సంస్కృతల్లా భోజనప్రియత్వమే.

* * *

ఈమధ్య మరొక ఢిల్లీ ప్రముఖుడు, రాయ్‌బహదూర్ సోహన్‌లాల్ మరణించారు. ఈయన పంజాబు రాష్ట్ర సివిల్ సర్వీసుకు చెందినవారు. 40 ఏళ్ళ క్రితం నగర మేజిస్ట్రేటుగా ఢిల్లీ వచ్చారు. ఆ రోజుల్లో ఢిల్లీ పురపాలక సంఘ కార్యదర్శి పదవికోసం బోలెడు మంది ఎగబడేవారు. ఐ. సి. ఎస్. లోని బ్రిటిష్ ఉద్యోగులనే ఈపదవికి నియమించేవారు. భారతీయరాష్ట్ర సివిల్ సర్వీసునుంచి ఆ పదవికి నియమింపబడిన మొట్టమొదటి భారతీయుడు శ్రీ సోహన్‌లాలే.

రాజకీయ, మతసంఘర్షణలు అధికంగా ఉండే ఆ రోజుల్లో ఆయన పురపాలక సంఘంలోని అందర్నీ తనతో కూడగట్టుకుని పౌరసౌకర్యాభివృద్ధికి ఎంతో కృషిచేశారు. స్వాతంత్ర్యసిద్ధికి ముందే ఆయన ఉద్యోగం నుంచి విరమించినా పురపాలక సంఘం వ్యవహారాల్లో సాధారణంగా ఆయన సలహాలు తీసుకోవటం ఆచారంగా ఉంటూ వచ్చింది. మొట్టమొదటి ఢిల్లీ కార్పొరేషను ఎన్నికలకు ప్రచారం ముమ్మరంగా సాగుతున్న సమయంలోనే ఆయన మరణించటం చిత్రం. శ్రీ సోహన్‌లాల్ క్రైస్తవుడు. ఆయన ఉదార స్వభావాన్ని ఎరిగినవారందరికీ ఆయన మరణం మానని గాయంలా తగిలింది. ★

జుగుప్స



ఆ మర్నాడు దీపావళి. పండగనాడు ఆ వూళ్లోని పార్థసారధిగుళ్ళో పూజార్చనలు చాలా విశేషంగా జరుగుతాయి. సుమ్మంలో నిల్చుని చూస్తే గుళ్ళో జరిగే కోలాహలమంతా చక్కగా కనిపిస్తుంది. సుమ్మంలో నిలబడి, మర్నాడు గుళ్లో జరగబోయే విశేషాలంకారాలకు జరిగే ఏర్పాట్లు చూస్తోంది సరోజ. అపుడే సత్యంకూడా అక్కడికి వచ్చాడు. సత్యాన్ని చూసి ఓచిరునవ్వు విసిరిందిసరోజ. అందుకు ముగ్ధుడయాడుసత్యం. తమను ఎవరూ గమనించటంలేదని చూసిన సత్యం——

"సరోజా! నీతో కొంచెం మాట్లాడాలి! ఒకసారి మేడమీదకి రా" అన్నాడు.

"అందుకేగా మనవాళ్ళు 144 వ సెక్షన్ విధించారు మనమీద" అంది నవ్వుతూ సరోజ, మెల్లిగానే-

సత్యం యింకేమీ మాట్లాడలేదు. లోపలికి వెళ్లిపోయాడు. కొంతసేపయాక సరోజ కూడా లోపలికి వెళ్లిపోయింది.

సత్యం మద్రాసు వైద్యకళాశాలలో యం. బి. బి. యస్. చదువుతున్నాడు. సరోజ సత్యానికి మేనత్తకూతురు. అతని చదువు పూర్తయాక సరోజను, సత్యానికి వివాహంచేయటానికి నిశ్చయించారు. వాళ్లి పెద్దలు. ఇద్దరూ మేనత్త మేనమామ బిడ్డలే అయినప్పటికి వివాహమయేవరకు ఒకళ్లతో ఒకళ్ళు మాట్లాడుకోకూడదని కట్టడి చేశారు వాళ్ళు.

సరోజ వెనకటిరోజులను జ్ఞాపకానికి తెచ్చుకొంది. ఒకరోజున——

తన మేనమామ కుటుంబమంతా వారింటికి వచ్చింది. భోజనానంతరము అందరూ హాలులో కూర్చొని లోకాభిరామాయణం మాట్లాడుతూన్న సందర్భంలో——

'అమ్మాయికి ఏదైనా మంచి సంబంధం చూడరా!' అంది సరోజతల్లి తన అన్నగారితో——

'ఓ దానికేం! ఏమే ఎల్లాంటి మొగుడు కావాలి నీకు' అన్నాడు మావయ్య నవ్వు వెళాకోళంగా. సరోజ చాలా పెంకిపిల్ల అన్నపేరు యిదివరకే సంపాదించుకొంది. తనను ఉడికించి ఏడిపించటం వాళ్లి మావయ్య కొకవిధమైన ఆనందము——

"అందమైన ముఖము...చక్రాల్లాంటికళ్లూ ... తెలివైన వాడూ ...విద్యావంతుడూ... యీ మాత్రం తెలీదా మావయ్యా. అందరు ఆడవాళ్లు కోరేది అటువంటి వాళ్లనేగా..." తాపీమని సమాధానమిచ్చింది సరోజ.

"ఊ...తర్వాత..."

"తర్వాతా ... నాబొంద... ...' అందికోపంగా. అందరూ గొల్లున నవ్వారు——

'నువ్వుచెప్పిన లక్షణా లన్నీ ఒకడిదగ్గ రున్నాయిలే ...కాని ......' అంటూ ఆగిపోయాడు.

'ఎవరది' అంది అమ్మ.

'ఇంకెవరు! నీ మేనల్లుడే. వాడికి యింకా రెండేళ్లు చదువుంది. నాదగ్గర డబ్బు లేదు. అప్పుగా మీదగ్గర పుచ్చుకొందామనివచ్చాను అసలు" అంటూ, తేల్చాడు అసలు సంగతి——ఎక్కడో ఆరంభించి——సరోజను సత్యానికి వివాహం జరిగితే అంతకంటే కావలసింది ఆ రెండు కుటుంబాలకు మరొకటిలేదు. కాని యిన్నాళ్లు ఎవరు ఎవర్ని ముందు అడగాలో అర్థంకాక ఆ ప్రస్తావనే రాలేదు. సరోజ సత్యాన్ని క్రీగంట చూసింది——అంతవరకు తనని అసలు చూడనట్లు. అందుకు తగిన సమాధానమే యిచ్చాడు సత్యం...

'అప్పూలేదు గిప్పూలేదు ... యిద్దరూ యిష్టపడితే యీ రెండేళ్లి ఖర్చు నేనే భరిస్తాను'... అన్నారు నాన్న.

ఆయన చెప్పిందానికి ఉభయపక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. సిగ్గు తన్నావరించటంవల్ల లోపలికి వెళ్లిపోయింది సరోజ. అపుడే చెప్పారు——పెళ్లియేవరకూ యిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవటానికి కూడా వీల్లేదన్నారు. అందుకు యిద్దరూ ఒప్పుకొన్నారు. ఇదంతా జరిగి సంవత్సరన్నరపైగా అయింది——

"యింకా ఆర్నెల్లేనా పూర్తిగా లేదు గడువు. అప్పుడే తొందరొచ్చేసింది. యీ మగాళ్లంతా యింతే. ఒంటరిగా ఆడది కనిపిస్తే చాలు-కొంచెం మాట్లాడాలి. వస్తావా- అనేస్తారు. మాట్లాడాలిట-మాట్లాడాలి. యిప్పుడు యీయనగారికి ఏం కొంప మునిగిందో!"——

చివరకు సత్యం దగ్గరకు వెళ్లటానికి లేచింది. మేడమీదకు వెళ్ళింది. తన గదిలోకి వెళ్లటానికి ధైర్యం చాలలేదు. తన గదికి ఎదురుగావున్న హాలులో లైటు "ఆన్" చేసింది. లైటు వేసింది ఎవరా అని హాలులోకి వచ్చాడు సత్యం.

సరోజ!

'సరోజా! నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి!'



హైదరాబాదు, ఈవెనింగ్ కాలేజీ తెలుగు సారస్వతసమితి వార్షికోత్సవంలో (మార్చి 1) శివపార్వతీ నృత్యం చేసిన ప్రభావతి, కస్తూరి.

★ జుగుప్స ★

'అందుకేకదూ వచ్చాను' చిఱుకోపాన్ని ప్రదర్శిస్తూ—

'నువ్వు యివాళ మన పక్కింటాయనతో మాట్లాడటం చూశాను నేను.'

'ఓహో'

'ఎవరాయన?'

'మా కాలేజీ లెక్చరర్.'

'ఇంక నువ్వు పరాయిమగాళ్ళతో అల్లా మాట్లాడకూడదు.'

'వాట్!' అంది ఆశ్చర్యంగా.

'అవును. నువ్వు పరాయిమగాళ్ళతో అంత విచ్చలవిడిగా మాట్లాడకూడదు. నేను చాలాసార్లు చూశాను. నీకు తెలియదు. అది మంచిదికాదు.'

'ఎందుకు మంచిదికాదు'

'నీ మంచికి—మన దాంపత్యానికి'

'మన దాంపత్యానికా! భలే!'

'సరోజా! నీకు యింకా ప్రపంచానుభవం కలగలేదు. నువ్వు వయస్సులో వున్నదానివి. అంతేకాకుండా మగవాళ్ళ కళాశాలలో చేర్పించారు మీ నాన్న. నువ్వు యికనుంచైనా జాగ్రత్తగా మసలటం నేర్చుకో!"

'బాగుంది!...ఒక్క మాటలో చెప్పాలంటే నామీద మీకు నమ్మకంలేదు అసలు. అసలు మీతో మాట్లాడకూడదని అమ్మా నాన్నా చెప్పినపుడు, వాళ్ళకీ తెలియకుండా యిల్లా వచ్చానే మీరు పిల్చినంత మాత్రాన. నా మీద మీకు నమ్మకం ఎల్లా వుంటుంది?" అని కోపంగా అనేసి వెళ్ళిపోబోయింది. దారికడ్డంగా నిలబడ్డాడు సత్యం—

'కోపగించుకోకు సరోజా! నువ్వు నాతో మాట్లాడటానికి రావటంలో తప్పేమి లేదు. రేపు నీ సుఖదుఃఖాల్లో భాగం పంచుకొని నీ జీవిత సౌఖ్యాన్ని చూడవలసిన బాధ్యత నాకు లేదా? నాతో నువ్వు మాట్లాడచ్చు. కాని పరాయి మగాళ్ళతో అంత విచ్చలవిడిగా మాట్లాడటం మంచిదికాదు. నేను చెప్పగలిగినది యింతే' అన్నాడు సత్యం అతని స్వరంలో గంభీరత, అధికారంకూడా వుంది.

"నేను వెళ్ళాలి! నాకు దారి వదలండి— మీ మనస్సు ఒక స్థితిలో లేదు. కాని ఒకటి మాత్రం చెప్పదలచుకొన్నాను. ఈ విధంగా సందేహ పడుతూ—స్త్రీ భర్తను తప్ప మరొకరిని కన్నెత్తి చూడరాదని కళ్ళల్లో వత్తులు పెట్టుకూర్చొంటే దాంపత్యం తియ్యగా వుండదు...చేదుగా వుంటుంది... మీరు డాక్టరు కాబోతున్నారు...మీరు ఆడవాళ్ళకు వైద్యం చేయకూడదని నేనంటే మీ మనస్సెంత బాధపడుతుందో ఆలోచించండి" అని కోపంగా అనేసి గబగబా కిందకు దిగి వచ్చేసింది సరోజ.

సత్యం యీ మాటలు విని స్తంభించిపోయాడు. ఆమె యింత పెంకితనంగా తనకు ఎదురు సమాధానం చెబుతుందని ఎన్నడూ అనుకోలేదు. ఇంతవరకు సరోజ తనకు అగ్నిసాక్షిగా భార్య కాకపోయినా 'తన భార్య'అనే పద్ధతిలోనే సంచరించాడు సత్యం. ఈ మాటలు తనని తలక్రిందు చేశాయి. "ఆడదానికి యింత అహంకారమా?" అనుకొన్నాడు. అదే సమయంలో ఆమెకొక గుణపాఠంకూడా నేర్పాలని తీర్మానించుకొన్నాడు సత్యం.

సత్యం దగ్గిరనుంచి రాగానే ఏడుస్తూ తండ్రితో జరిగిందంతా చెప్పి "నాన్నా. అమ్మకు మేనల్లుడంటే పంచప్రాణాలు నేను చెప్పేది కూడ వినిపించుకోదు. ఇటువంటి సందేహప్రాణితో నేను సుఖంగా ఎల్లా వుండగలను నాన్నా? ఏమైనా సరే యీ సంబంధం నాకక్కర్లేదు" అంది సరోజ.

ఆమెను ఓదార్చి "నేనంతా కనుక్కొంటానమ్మా. ఆలోచించి మరీచేస్తాను. నువ్వు అనవసరంగా బెంగపెట్టుకోకు" అన్నారు.

రోజులు గడచిపోయాయి. సరోజ ఇంటర్మీడియేట్ ప్యాసయింది. సత్యం డాక్టరయాడు. వారిద్దరి వివాహానికి ముహూర్తము నిశ్చయమయింది.

"నాన్నా నేను చెప్పినది అవాశే మర్చిపోయారా?" అంది సరోజ.

"ఈ స్వల్పవిషయానికి యింతబాధపడతావెందుకు తల్లీ! అప్పట్లో మీ వివాహం అయేవరకు మీరు మాట్లాడుకోకూడదని అడ్డుపెట్టాము. తనే, తన భార్యతో మాట్లాడటానికి వీలులేనప్పుడు మరొకరు మాట్లాడుతూండటం చూడటంవల్ల కలిగిన జుగుప్స అతనిని అల్లా మాట్లాడించింది. అంతేకాని అతనికి నీమీద ఏవిధమైన సందేహమూ లేదు. మీరిద్దరూ సుఖంగా వుంటారు. అప్పుడు ఈ నాన్నను తల్చుకొంటావు" అన్నారు సరోజ తండ్రి.

సరోజ ఇంక మాట్లాడలేదు. కాని తండ్రి చెప్పినది కూడా కొంతవరకూ నిజమేనని

గ్రహించింది. రెండు సందిగ్ధభావాల మధ్య బరువైన మనస్సుతో పెండ్లి పీటలమీద కూర్చొంది సరోజ. వివాహమయింది. సరోజ సత్యం భార్య అనే "అఫీషియల్" ముద్ర పడిపోయింది—

ఆరాత్రి—

ఇదివరలో సత్యంలో చెలరేగిన అగ్నిజ్వాల అణగలేదు! నానాటికీ పెరుగుతూ వచ్చింది—ఆమె అహంభావాన్ని అణగగొట్టితీరాలనే పట్టుదల అతనిలో తీవ్రరూపం దాల్చింది!

నూతన శోభలతో, గాజుల గలగలలతో గదిలో కాలుపెట్టింది సరోజ. చూసి మాట్లాడకూరుకున్నాడు సత్యం.

కొంచెంసేపయాక—

'ఎందుకొచ్చావ్' అన్నాడు సత్యం.

'అడ్డు తీరిపోయిందిగా' అంది సరోజ.

'అయితే'

'పెళ్లంటూ అయాక భార్య భర్తదగ్గరకు వెళ్ళటం సహజమేగా...!' సౌమ్యంగానే జవాబిచ్చింది సరోజ

'అదే ఎందుకని...?'

'సంతోషంగా గడపటానికి ...కబుర్లు చెప్పుకోటానికి..."

'చేదు జీవితసఖుడితో నీకేం కబుర్లు?'

'ఎవరలా అన్నారు?'

'మీ నాన్నగారిదగ్గర మొరపెట్టుకొన్నావా ల్లైవరా!'

'.........'

సరోజ యింక భరించలేకపోయింది. కోపం వచ్చింది. వెనకటి సంగతులు యింకా అతను మర్చిపోలేదని గ్రహించింది. అంతే యింక మాట్లాడలేదు. సత్యం అసలే కలగచేసుకోలేదు ... తనంతట తను వచ్చి పలకరించేవరకు మాట్లాడకూడదని నిశ్చయించుకొంది సరోజ మూడురాత్రిళ్లూ మౌనంగానే గడిచిపోయాయి.

సత్యం వూరికి వెళ్లిపోయాడు. కాని సరోజను తీసికెళ్లలేదు. సతీపతుల మధ్య అన్యోన్యత చెడిందని తెలియటానికి పెద్దలకి ఎంతోసేపు పట్టలేదు. రెండు కుటుంబాలలోనూ శాంతి నశించింది. ఎంతో సంతోషంతో, ఎన్నో ఆశలతో యీ వివాహాన్ని చేశారు. కాని వారి ఆశలన్నీ నేలకూలిపోయాయి. అందరికి సరోజమీదే కోపం వచ్చింది. రెండు కుటుంబాలలోను రవరవలు బయలుదేరాయి. చివరకి మిగిలింది—వారిద్దరి మనస్సులలోనూ పట్టుదలమాత్రమే.

ఉగాది పండుగ వచ్చింది. పండక్కి తను అత్తవారింటికి రావనీ, పండగమర్యాదలేమీ తనకుఅక్కర్లేదని ఖచ్చితంగా చెప్పాడు సత్యం. తల్లిదండ్రులువచ్చి చెప్పిచూశారు కాని తను పట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్నట్లు తన అభిప్రాయం మార్చుకోలేదు సత్యం.

కాలక్రమేణా పరిస్థితులు సర్దుకొంటాయని ఆశించిన సరోజ యీవార్తతో మరింత క్రుంగిపోయింది.

"సరే ఏం చేస్తాం! అతను రాకపోతే దీన్నే అక్కడికి తీసుకెళ్ళు" అంది సరోజ తల్లి, యీ మాటచెప్పి పోవటానికి వచ్చిన అన్నగారితో.

"ఎందుకమ్మా యీ రాయబారాలు? ఆయన ఏవిధంగా సగసాధించదల్చుకొన్నాడో సాధించనీ! నేను అక్కడికి వెళ్ళనక్కర్లేదు. ప్రపంచం రేపు తెలుకోబోయేది యివాళే తెలుసుకొంటుంది" అంది కోపంగా సరోజ.

"అలా అనకూడదమ్మా సరోజా! ఆడదంటే కుటుంబానికి ఒక జ్యోతిలాంటిది. కుటుంబానికి గౌరవ మర్యాదలు తెచ్చేది ఆడది. నువ్వు యీ విధంగా పెంకితనంగా మాట్లాడటం ఏం బాగా లేదు. మన కుటుంబంయొక్క గౌరవ మర్యాదలు కాపాడటం నీ విధి నువ్వు అక్కడికి వెళ్ళక తప్పదు. స్త్రీకి వివాహమయిన తరువాత భర్తే సర్వస్వము. నువ్వు చదువుకొన్నదానివి. ఆలోచించకూడదు' అని నచ్చచెప్పింది తల్లి.

తల్లి మాటలలోని అంతరార్థము ఆమెకు అర్థంకాలేదు. శిలా విగ్రహంలా అల్లాగే కూర్చొంది సరోజ.

'యీ పెంకితనం కూడదమ్మా నీకు: నీ యీడు పిల్లలందరూ సుఖంగా కాపరాలు చేసుకోవటం లేదా? నువ్వు మాత్రము అన్నారు తండ్రి.

'అవును నాన్నా! అందుకని...' గబుక్కున తండ్రికన్నీళ్లు చూసి యింక మాట్లాడలేకపోయింది సరోజ.

కొన్ని క్షణాలతరువాత - ఒక నిశ్చయానికి వచ్చినట్లు లేచి నిల్చుని—

"మామయ్యా! ప్రయాణమవండి నేను వస్తాను. ఎల్లా అయినా అక్కడ వుండవలసినదానినే కదూ? అందుకు ఆయన నన్ను అక్కుపెటలేరు...' ఇంక మాట్లాడలేక లోపలికి వెళ్ళిపోయింది సరోజ—

పెదల ఆశారేఖలు చిగిరించాయి. అంతా ఆ రోజే బయలుదేరారు. ఉగాది యింకా మూడురోజు లుండగానే అందరు సరోజ అత్తవారిపూరు చేరారు సత్యం అందరితోనూ చాలా సహజంగానే మాట్లాడాడు. కాని సరోజవైపు కన్నెత్తికూడా చూడలేదు! తనభార్య అక్కడ లేనట్లే సంచరించాడు.

ఆ మర్నాడు ఉగాది. ఆ సాయంత్రం తన కేసో అర్జంటు కేసుందని వెళ్లిపోయాడు సత్యం. డాక్టరు ఉద్యోగమే యింత అని ఎవళ్ళూ ఏమీ అనలేకపోయారు. నిజంగానే ఒక కేసు పరీక్షించటానికి వెళ్ళాలి సత్యం. కాని అందుకు ఇంకా చాలా వ్యవధి వుంది. ఇంట్లో వుండటానికి మనస్కరించక దారిలో తన స్నేహితుడింటికి వెళ్లి కొంచెం కాలక్షేపంచేసి కేసు చూడటానికి వెళ్ళాలనుకొన్నాడు. అప్పటికి సుమారు రాత్రి 8 గంటలు దాటింది. స్నేహితుడింటికి వెళ్లి తలుపుతట్టాడు సత్యం. స్నేహితుడు మురళి తలుపుతీసి, సత్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇదేమిట్రా. ఈ వేళప్పుడొచ్చావ్."

"ఆ!...ఏం లేదు. సుబ్బారావుగారి భార్యకు ఇంజక్షన్ ఇచ్చిపోదామని."

"ఈ సమయంలోనా?"

"అంటే"

"ఏం లేదు. ఆమె భర్త చాలా అనుమానం మనిషి."


"అందుకని ఆమెని చంపేయటమేనా?"

"నీకు తెలీదు సత్యం. ఆమెభర్త తనని పెట్టే బాధలకి ఆమె చావునే కోరుకొంటోంది."

"భలే సైకాలజిస్టువిరా నువ్వు!" అంటూ హేళనగా నవ్వాడు సత్యం.

"సత్యం! తొందరపడుతున్నావ్! భర్త భార్యను తిట్టినా కొట్టినా కూడా అంత బాధపడదు. కాని భర్త తనని అనుమానిస్తున్నాడని తెలిసినప్పుడు—తను ఎంత బాధపడుతుందో చెప్పలేం. నువ్వు డాక్టరువి. చిన్న, పెద్దా, స్త్రీ, పురుషులు—అందరికీ వైద్యం చేయటం నీ విధ్యుక్తధర్మం. కాని వయస్సులోవున్న స్త్రీలకు చికిత్స చేయటానికి వెళ్ళేటప్పుడూ, వయస్సులో వున్న స్త్రీలు వున్న యిళ్ళకి వెళ్ళేటప్పుడూ కొంచెం ముందు వెనుకలు ఆలోచించికొని, మరీ వెళ్ళు. ఆపదలో చిక్కుకుంటావు. ఇంతకన్నా, నీ శ్రేయస్సుకోరే నీ యీ స్నేహితుడు చెప్పవలసింది ఏమీ లేదు'

(48-వ పేజీ చూడండి)



19

నీలికి కూతురు పుట్టింది. కొడుకు పుట్టినప్పుడు ఉన్నంత వుత్సాహంగాని, పరిస్థితులుగాని ఇప్పుడు లేవు. "పిల్ల చక్కగా వుంటాదని" అందరూ అంటున్నారు. పుల్లయ్య కూతుర్ని ఒక్కసారే సరిగ్గా చూశాడు. "దీనికి మంచి మొగుడిని సూడాల" అనుకున్నాడు, ముసలమ్మ ఆనందం యింతా అంతా కాదు. "ఇంటికి పేరు తెచ్చినా కీడు తెచ్చినా ఆడపిల్లే తెస్తాది. ఫలానోల బొట్టె బీదా బిక్కీకి ఒక కంట చూస్తుందంటే ఆతల్లీ తండ్రికీ యింకేం కావాల?" అని ఆమె వుద్దేశ్యం. వచ్చినవాళ్లెవరైనా "పిల్లని తీసుక పోతాంరా!" అని అంటే మల్లు కర్రపట్టుకొని గుమ్మం దగ్గర కాసున్నాడు.

ఇంకా కోతలు పట్టలేదు. వూర్లో పరిస్థితులు చాలా అధ్వానం అయిపోతున్నాయ్. దొంగతనాలు హెచ్చవుతున్నాయని పెద్దవాళ్ళంతా అంటున్నారు. కానీ దొంగలు దొరకలేదు. సరుగుడు తోటల్లో చెట్లకు చెట్లే రాత్రుల్లు మాయమౌతున్నాయి. ఒకయింట్లో అన్నంవండిన కుండతో సహా మాయమయిపోయింది. ఇంకో యింట్లో వాకిటవేసిన కట్టకట్టలాగుండే, లోన సగం పెసలు ఖాళీ అయిపోయాయి. కోడిపెట్టలు, పుంజులు లెక్కలేనన్ని అగుపించలేదు. నాయుడు సరియైన కట్టుబాట్లేవీ చెయ్యాలేదని అనకులసినవాళ్ళు అన్నారు. వున్న ముగ్గురు తలారులనూ వూర్లో రాత్రులు తిరగాలని నాయుడు పెళ్లాం ఆర్డరు వేసింది. యిద్దరు తలవూపారు. మూడోవాడు మాల రామిగాడు కాదన్నాడు. పొడుగ్గా భారీగా వుంటాడు. పిల్లలు తిండి తినకపోతే వీడిపేరు చెప్తే సరి తిండి కడుపులోకి పోతోంది. యేమైనా యదార్థంగా యెదురుగుండానే అనేస్తాడు—అది తహశీల్దార్ అవ్వనీ—నాయుడు పెళ్లమవ్వనీ తనకేం ఖాతరు లేదు. వూరి యీ చివర కేక వేశాడంటే ఆ చివరకు వినబడవలసిందే! తన కొడుకు వ్యవసాయం చూసుకుంటున్నాడు. మనమడు వుద్యోగం చెయ్యడానికి చదువుకుంటున్నాడు. రామిగాడు ఒకరి నొక దమ్మిడీ అడగడు. తనదగ్గర యేమున్నా యెవరడిగినా లేదనడు. దీనివల్ల పెళ్ళాం కొడుకూ యేకమైపోయారు. పెళ్లాం మొటికాయలు పెట్టినట్లు మాట్లాడినా ఆ పెద్ద నోరుతో పకపకనవ్వుతాడు.

"దొంగను పట్టి యేం సేయమంటావు తల్లీ?" అని అడిగాడు ఆమెను.

"ఈడ్చుకురా—పంచాయితీ పెట్టించి.."

"పెట్టించి కొరడా దెబ్బలు కొట్టిస్తావమ్మా? రాయమ్మా యీ కడుపు కాలనంత సేపూ అంతా నీతే—కాలితే తెలుస్తాది. గెంజి తాగి బతకడానికి యెవరు దొంగతనం చేసినా ఆడిమీద యీగ వాలడానికి వీల్లేద"ని ఖచ్చితంగా చెప్పాడు. యిలా చెప్పినా తను రాత్రుళ్ళు తిరగడం మానలేదు. మిగతా యిద్దరూ ఒకప్పుడు యెవరినైనా పట్టితే విడిపించడానికి.

వారంరోజులు తిరిగారు. దొంగతనాలు వూర్లో తగాయి కాని తోటలో జరుగుతున్నాయ్. ఇద్దరు కాయలేని నాకర్లు రాను రాను యింట్లోనే కాపలా కాశారు. అలా నెలరోజులు గడచిపోయాయి. యెప్పుడు కోతలు మొదలుపెట్తారా అని వ్యవసాయపు కూలీ జనం యెదురుచూస్తున్నారు. వెంకన్న గన్నెమ్మలవంటి అనాథుల పరిస్థితి చాలా విషమంగా వుంది. నీలిదగ్గరకు వెంకన్నకు వెళ్ళడానికి మనసు పుట్టలేదు. అమ్మా అని వెళ్ళే ఆమె కుంచుకోకుండానే వున్నది పోసేస్తుంది. పోసి, నోటినిండుగా అభిమానంగా మాటాడుతుంది. అది బుక్కెడు గంజైనా కడుపు నిండిపోయిపోయిగా వుంటుంది. గన్నమ్మమాత్రం మొగమాట పడలేదు నీలి ఒక్కసారీ విసుక్కోలేదు. రాజిగాడు పెళ్లింకూడా నలుగురి బీదా బిక్కీకి లేదనకుండా ఒకకంట చూస్తాడని విన్నాడు. కాని వెంకన్నకు ఆ గుమ్మంలో దేహీ అని వెళ్ళడం యిష్టంలేదు. అక్కడ వెళ్తే తనకు జరిగిందంతా తలపుకువస్తుంది. తను గుడ్డివాడైనా అంతా కనిపిస్తుంది. ఒళ్ళంతా దుఃఖంపారావంతో ముడుచుకుపోతోంది.

ఒకనాడు అప్పుడే చీకటి పడుతోంది. ఆకలితో వెంకన్న, గన్నెమ్మ బాధపడూ నీలమ్మగుడిదగ్గర పలకరాయిమీద కూర్చున్నారు. ఇంతలో దాసుడువచ్చి గుడిలో దీపం వెలిగించాడు. శివాలు వెయ్యక మానంగా కళ్ళుమూసి తల్లి యెదురుగా

★ దగాపడిన తమ్ముడు ★

చూస్తున్నాడు. తిరిగి వెళ్ళిపోయేటప్పుడు ఇద్దర్నీ పలుకరించాడు. "ఈ కరువు యెప్పుడు పోతాది?" అని అడిగింది, దానుడ్ని. "లోకం రాత బాగు నేదే! అంచేత మంచో లకే సెడ్డబుద్ధులే పుడ్తన్నాయ్! ఆనాడు యెంత బతుకు బతికావు? నీరాత తిన్నగా లేకకదా అనుక్కుంటున్నావు" అంటూ కదిలాడు.

గన్నెమ్మ ఒకప్పుడు గొప్ప బతుకే బ్రతికింది. యెంతో భాగ్యభోగ్యాలతో తుల తూగింది. గొడ్డు సంసారం. మొగుడు పిసినారి. అంతకంటే కటింపు తను. మెడ నిండా బంగారం, కొట్టునిండా ధాన్యం. యెంగిలిచేతితో కాకిని కొట్టలేదు. చుట్టాలెవరూ వారింటికివచ్చిన పాపాన పోలేదు. అథవావచ్చినా, భోజనం వేళవరకు వుండనూ లేదు. డబ్బుకూ ఆమెకూ లంకె. ఆ డబ్బునే వరించింది. ఈలావుండగా మొగుడుకి జబ్బు చేసింది. అదే పోతుందని వూరుకుంటే మోపుచేసింది; కషాయాలు గిషాయాలతో తనకు తెలిసిన వైద్యం చేసింది. మంచం పట్టాడు. పొరుగూరి నేటివ్ వైద్యుడు డబ్బుగుంజడానికి ప్రయత్నించాడని వాడ్ని వదిలించి, బేరాగి చిటకాలతో జబ్బు నయం చేయబోయింది. రోజురోజూ పరిసితి విషమించింది. యెవరో నాటు వైద్యుణ్ణి పెట్టింది. నలుగురూ పట్నంనుంచి పెద్ద వైద్యుణ్ణితెస్తే జబ్బు నయం అవుతుందని చెప్పారు. కానీ యెవరిమాటా లక్ష్యపెట లేదు. మొగుడు చివరికి వచ్చేమాటా, రాని మాటతో "నలుగురూ అంటున్నారు. ఆపట్నం వైదిగుడ్ని తీసుకరమ్మంటే,? "ఈలంతా నీవు బతకాలని మూస్తన్నారా" నీసేత వూరకే డబ్బు గంగలో కల్పించాలని మూస్తన్నారని" మొగుడుకి చెప్పింది. నలుగురూనాలుగువిధాలంటుంటేవచ్చినోలువచ్చి నట్టుండండి మీరంతావైదుగులా, యిప్పుడు మందిచ్చినోడు వైదిగుడా? ఆడికి నాకూ దైర్యంవున్నాది. మీ కెందుకర్రా?" అని అరిచింది. నాటువైద్యుడు వారం రోజులకి జబ్బె యెగిరిపోతాదని చెప్పాడు. వారం రోజులకి మనిషే యెగిరి పోయాడు!

వూరంతా ఒకేకంఠంతో యీ ముండను తిట్టిపోసే యేడుస్తునే "నన్నెందుకర్రా అంటారు! మీకూ ఆరోజు వసే మీరూ వుండి పోరంది. దాని నోట్లో నోరెందుకు పెటడం దానికే తెలిసొస్తాదని వూరుకున్నారు. బంగారం కొనుకులు కూడ పెట్టింది. ఆశ అంతస్థుల్లా పెరిగిపోతోంది. ఎవడో దూరపు చుట్టం దాపరించాడు. ఆ ఆశను మరింత వృద్ధిచేశాడు. ఆ మాటల చమత్కారంతో నమ్మించాడు - పొంగించాడు. చాలా ఘరానాగా వ్యవహరించాడు. వ్యాపారం గురించి, ఆ లాభాలు గురించి చెప్పుకొచ్చాడు. ఆశ పుట్టింది. ముందు వంద రూపాయలే తన వాటాగా వ్యాపారంలో పెట్టమని యిచ్చింది. నెల రోజుల్లో నూటయాభై తెచ్చియిచ్చాడు. నెలకు వందకులాభం యేభయి రూపాయలే! కళ్ళు జిగేల్ మన్నాయ్! అడక్కుండానే ఐదువంద లిచ్చింది. దానికి లాభమొచ్చిం ఆ చుట్టం దేముడులా అగుపించాడు. వ్యాపారం రానురాను పెద్దదైపోయింది. పటణాలలోకి కూడా వాళ్ళ సరుకులు వెళ్తున్నాయి. నలుగురూ చెప్పుకుంటున్నారు. ఆ చుట్టం చుట్టంలాలేదు. ఇంటి మనిషికంటే యెక్కువ - అలాంటి వాడ్ని పూర్తిగా నమ్మింది. నీ పేరను లారీ కొంటాను లాభం నూటికి నూరూ వుంటాదన్నాడు. ఒప్పుకున్నాది. ఇంట్లోనూ ఒంటిమీదా వున్న బంగారం అమ్మింది. వున్న ధాన్యం అమ్మింది, ఇంకా చాలకపోతే భూమి తాకటు పెట్టింది. ఆ తాకట్టుపె పూర్తించి తనే కుదిర్చాడు. ఒక కాగితం లారీ తెచ్చి చూపించాడు. భద్రంగా ఆ కాగితం యెవరికీ చూపించకుండా దాచింది. లారీమీద కూర్చోని పట్నంకూడా వెళ్ళింది. సినిమాకి, కాఫీహోటళ్ళకి తీసుకవెళ్ళాడు. ఆ రోజుల్లో యివన్నీ జమీందారులకే చెల్లుతాయి! యెంతో మెచ్చుకుంది చుట్టాన్ని. లాభాలు వస్తున్నాయి. అప్పుడప్పుడు వ్యాపారం ఓడవ్యాపారమంత కాబోతోందని తెలిసి భూములు అమ్మింది. ఆ డబ్బు తిరిగి రాలేదు. ఏదని అడిగితే లారీమీద తీసుకువెళ్ళి గోదాంలోని సరుకులు చూపించాగు. కావాలంటే ఇక్కడే ఇల్లుకట్టిసాను వుండిపో అన్నాడు. అంత నమ్మకం వుండగా తనెందుకు వూరువదలాలి?

ఒకనాటి వుదయం.. మంచిరోజున చిప్ప చేతికిచ్చాడు. గొల్లుమన్నాది! కాగితాలన్నీ అందరికీ చూపించింది. నోటికిరాని తిట్లు తిట్టింది. తలబాదుకున్నాది నూతిలో గెంతడానికి పరుగెత్తింది. వూరంతా ఓదార్చారు. తలోలా అనుకున్నారు. గొడ్డు కసాయివాణ్ణే నమ్ముతుందన్నారు కొందరు. చేతులారా మొగుడ్ని చంపేసింది. అలాంటి ముండకు ఇంతకంటే మంచిగతేం వస్తుందన్నారు.

ఉన్నయిలు కొన్నాళ్లకి కూర్చోనితినగా అప్పులకింద పోయింది. వయసుమళ్లిన కాలంలో ఎవరూ దగిరికి చేరనివ్వలేదు. ఒకరికి పెట్టివుంటే ఆ ఒకరు ఇప్పుడు కనికరించేవారు. ఈరోజుకి నడ్డి వంగినా, మమకారం పోదు. లేనిపోని ఆశలుపెట్టుకొని వీళ్ళని దూషిస్తూ వాళ్ళని దూషిస్తూ బతుక్కొని వస్తాంది.

* * *

కోతలు మొదలుపెట్టారు; చేను కళ్లాలకు వచ్చింది. కొట్లో వేయకుండానే ఈరిసా పుల్లయ్య బుగత అంబారం కొలిచేసాడు. అటునుంచి వచ్చిన దగ్గర నుంచి మనసు మనసులా లేగు. మల్లు గరిడీకని చెయ్యి లాగుకొని వెళ్ళినా వెళ్ళలేగు. రాజిగాడు దగ్గర తెచ్చిన డబ్బుకు వడ్డీధాన్యంయిస్తే,

నెలరోజులకు తప్పించి గ్రాసం వుండదు. అంచేత నీలి వడ్డీరూపాయలలో కట్టుకోమని బ్రతిమలాడింది. ఈ ధరల్లో ధాన్యం కట్టడానికి ఒప్పుకోలేదు. ఇప్పుడు గరిసె బ్లాకులో వెయ్యివున్నా ముందు ముందు పదిహేను వందలు కాకూడదా అని ప్రశ్నించాడు. నీలి బ్రతిమాలింది. ఈమాత్రం ఉపకారం చెయ్యకపోతే పిల్లలు తిండిలేక మాడిపోతారని ప్రాధేయపడింది. చివరకు భూమిస్వాధీనం తనఖా వ్రాస్తే ఒప్పుకుంటానన్నాడు. అంతేకాకుండా ధరలు హెచ్చుగా వున్నాయి కాబట్టి, వడ్డీ వందకి రెండు పుట్లనుంచి కొద్దిగా తగ్గించి మిగతా ధాన్యం వచ్చే యేటినుంచి నేనే మీకిస్తానన్నాడు. ఆ భూమిమీద పైరుపంటలు మీరే పండించుకోండన్నాడు. నీలికి చాలా సబబనిపించింది. ఒప్పుకున్నాది. పుల్లయ్యకు నచ్చలేదు. యెలాగో ఓలాగ యీ మాగాణి దక్కించుకోవాలని వాడు చూస్తున్నాడనీ, ఇంకా యేడాదిలో తనకే అయిపోతాదని అన్నాడు. నీలి బలవంతంమీద రిజిష్ట్రేషను అయిపోయింది.

వేసవి వచ్చింది. ఒకనాటి సాయంత్రం మల్లు తన యీడూ జోడూ పిలల్ని ప్రోగుచేసి వాళ్ళకి గరిడీ నేర్పుతున్నాడు. "చినక్ చినక్ సో......"అంటూ అడుగులు సరిగ్గా వేస్తుంటే అంత దూరంనుంచి చూస్తున్న పుల్లయ్యకు యెక్కడలేని గర్వం వచ్చింది. పులిపంజా ఆడిస్తున్నట్లు ఆడిస్తున్నాడు అరచేతిని. అడుగులు సరిగ్గా పడుతున్నాయ్! పుష్టిగా వున్న శరీరంలో యేకీలు కాకీలు వొంగుతోంది. డప్పులుంటే ఎంత బాగుండే దనిపించింది పుల్లయ్యకి. అలాగే పెళ్ళి పిల్లి మొగ్గ వేస్తే......కొడుకు యెగ్రాకి పాదాలమీద నిల్చోని! దిగవాడి కొడుకే మీదోడు! మళ్ళీ ఆరోజు జ్ఞాపకం వచ్చింది. ఆ ముసలాడిగా లేని ముసలాడు......వయసులో ముసలాడు-ఉత్సాహంలో కుర్రాడు...బోక్కిపళ్ళ నవ్వుతో మురిసిపోయాడు ఆ నవ్వుతో ఆ రెండే మాటలతో...తనను పెళ్ళికొడుకు చేశాడు......మా అయ్యని పుట్టుకు రప్పించాడు...నాకు మల్లునిచ్చాడు...ఆ ముసలాడు యెక్కడున్నాడో...యేమయ్యాడో?

'వాను మొగ్గేస్తే' అనుకున్నాడు పుల్లయ్య. కొడుకు యెక్కమంటే యెక్కుతాడు. తను కాసుకోగలడా? నే నేమో నన్న పిరికి తనం వేసింది. వేసుకోలేకపోతే...... నా కొడుకు అంత మీదనుంచి పడితే...కాలు గానీ చెయ్యి గానీ విరిగితే......అమ్మో అంత పని చెయ్యవనుకున్నాడు. మెల్లగా కొడుకును సమీపించాడే గాని, మల్లు ఆటలో మునిగిపోయివున్నాడు. తన లాగే నలుగురూ దిద్దిన పోయే వాళ్ళు ముచ్చటగా చూసి మురిసిపోతున్నారు. ఒకమ్మ యేటినుంచి నీళ్ళకడవ నెత్తిని పెట్టుకొని వస్తూ "అలాంటోడు ఒక్కడైతేం!" అంది. పుల్లయ్య ఒళ్ళంతా పులకరించింది. కొడుకు తండ్రినిచూచి పరుగెత్తుకొచ్చి మీదకెక్కాడు. ఇంటివేపు వస్తుంటే "అయ్యా మామ్మకి జొరం—సచ్చిపోతాదా?"

ఇంత సంతోషం ఒక్కసారి మాయమై ఆలోచనలో పడిపోయాడు పుల్లయ్య.

"శివ్వుడమ్మ సెప్పిందట—యెవడో యెనుపోతుమీదవచ్చి......పేణాలు తీసుకపోతాడట! యెప్పుడొస్తాడయ్యా? కర్రపట్టుకొని కూకుంటాను మామ్మదగ్గర?" అన్నాడు.

చిన్న నవ్వు నవ్వాడు "యేదయ్యా—ఆడునిజంగా సెప్ప నేదు"

మల్లు వెను వెంటనే తండ్రి ముఖంవేపు చూస్తూ అయ్య సెప్పింది అయ్యాకే "నిజం సెప్ప నేదు...శివ్వుడు కళ్ళు పోతాయి" అని అప్పజెప్పాడు.

ప్లీడరు సీతారామస్వామి గారు ముందు చూపు మళ్ళీ కొడుకు పెళ్లి తర్వాత యీ నాటికి చూశారు. తాను అలా చూడటానికి పరిస్థితులు యేమంటే ముందుకి ఎలక్షనులు వస్తున్నాయ్. అప్పుడే వివిధ పక్షాలు కొద్దో గొప్పో ప్రచారం చేసుకుంటున్నాయ్. హెచ్చు వోట్లు పల్లెల్లో నేవున్నాయి కాబట్టి పల్లీయులను ఆకర్షించే విధానాలలో ప్రచారం చేయాలి. అంచేత దున్నేవాడిదే భూమనే నినాదం లేవదీశారు. యేదో విధంగా అన్ని పక్షాలూ యీవాదం సబబనే అంటున్నాయ్ ఈవాదం ద్వారా స్వలక్షాలను—అంటే పార్టీలకు ఎలక్షనులో గెలవటం; పెట్టుబడిదారు యీ సమ్మంధమైన సినిమాతీసి చిత్తుగా డబ్బు ఆర్జించుకోవడం, ఈ యితివృత్తంతో లేనిపోని సంఘటనలు కల్పించి నాటకం ఆడి భూకామందులపై లేని ఈర్ష్యను అమాయక ప్రజలలో పృష్టించి, వాళ్ళమీద తిరుగుబాటు చెయ్యంచ పూనటం-తద్వారా నాటకం గిట్టుబాటైందని అనిపించుకోవటం-ఇలా ఆ లక్ష్యాలను యేదో ఒకస్థాయిలో సాధించుకుంటున్నారని చెప్పాలి. ఈ పరిస్థితులు చాలామంది, భూకామందులకు తమ ఆస్తిపాస్తులు కాపాడుకొనే అవసరం వచ్చిందని కట్టుదిట్టాలు చేసుకోనిచ్చింది.



హాసరేఖలు
చిత్రం: వీరిశెట్టి అచ్యుతరావు —పుల్లేటికుర్రు,



రుమేనియా ప్రధాని చివూస్టాయికి గౌరవార్థం మద్రాసు గవర్నరు మార్చి 17న విందు చేశారు. ఆ సందర్భంలో నృత్యం చేసిన పద్మిని, రాగిణి బృందాన్ని అభినందిస్తూ గవర్నరు శ్రీ మేధీ పుష్పగుచ్ఛాలు బహూకరించారు.

దగాపడిన తమ్ముడు

రైతులను తొలంగించి కొందరు స్వంతసేరీ పెట్టుకున్నారు. ఆ రైతులు అడుగంటి పోయారు. ఆకలితో అటమటించి కొందరు బ్రతుకుమీద ఆశతో ఆత్మహత్య చేసుకోలేక, అడుక్కునీ పొట్ట పోషించుకొంటున్నారు. ఈ విపరీతమైన ధాన్యం ధరలవల్ల కొల్లలుగా డబ్బు కూడబెట్టి యెలాగ వినియోగించాలో తోచని పెద్ద రైతులు ఈ పైవూళ్ళలో వున్న భూకామందుల భూములకు పోటీలపై ధరలు పెంచుకొంటున్నారు. కొన్నాక సొంత సేరీచేసుకోడం వల్ల మొదట ఆభూమి అంబారానికి దున్నుతున్న చిన్నరైతు కూలిపోతున్నాడు. ఇలా లెక్కలేనన్ని సంఘటనలవల్ల అక్కడక్కడ రక్తపాతం జరుగులోంది. వూళ్ళలో కొనేవాడిపార్టీ, దున్నేవాడి పార్టీలు లేచిపోతున్నాయ్. డబ్బుగలవాడిదే, జయం. ఆ పార్టీబలం యెక్కువ!

సీతారామస్వామి ఈ పరిస్థితిని యేనాడో వూహించాడు. కానీ పుల్లయ్య నమ్మకంగా ధాన్యం తెచ్చిఇస్తున్నాడని భార్యకూడా అమ్మడానికి ఒప్పుకోలేదని వూరుకున్నాడు. సంవత్సరం పోయాక అయ్యో యెలక్షనలకు ఇప్పుడే హడావుడి మొదలైంది. ఆపరిస్థితులు చూస్తుంటే వచ్చే ప్రభుత్వం అక్షరాల దున్నేవాడిదే భూమి చేస్తుందని తనునిర్ధారణ చేసుకున్నాడు. అదీకాకుండా పట్నంలోనే యేదో కొంపకొని అద్దెలకు యిచ్చుకుంటే భద్రత రాబడి అధికం కూడా అవుతుందని భార్యకు ఒకరోజంతా నచ్చచెప్పాడు. ప్రపంచమంతటా ఇంత పెద్ద జిల్లా లేదు. వచ్చేప్రభుత్వం దీన్ని ఎలాగూ ముక్కలు చేస్తుంది. చేస్తే జిల్లాకేంద్రం ఈ పటణంలోనే వుంటుంది. అప్పుడు యింటి అద్దెలు రెట్టింపవుతాయి. ఇదంతా విని ప్లీడరు భార్యా పుల్లయ్య దున్నుతున్న రెండెకరాల పల్లపుపొలం అమ్మడానికి ఒప్పుకుంది. ఆ అమ్మే డబ్బుతో ఒక ఇల్లు ఏర్పడుతుంది.

ఈ రెండెకరాల పొలంలో ఒక యెకరం రాజిగాడు; ఇంకో యెకరం ఇంకో పెద్ద రైతూ కొనడానికి నిర్ధారణ అయిపోయింది. పుల్లయ్యను ప్లీడరు పిలిపించాడు. డబ్బు అవసరంవచ్చింది. ఈ భూమి అమ్మితేగాని వీల్లేదని చెప్పాడు. పుల్లయ్య "మా తాతల కాలంనుంచీ దున్నుతున్నాం బాబూ! ఏనాడూ పందుం ధాన్యం వుంచుకున్నామా? పైరుపంటలు కూడా మీపాలు తెచ్చియిచ్చేవాడ్ని. మీ ఆవులకి గడ్డిమేట్లు తెచ్చియేసాను. మా తాతల కాలంనుంచీ యిలా జరిగిపోతున్నది కదా. మీ రిలాగ అంటే ఏగంగలో పడిపోమంటారు?"

ఈ మాటలు శాంతంగా ప్రాధేయపడుతునే అన్నాడు. ప్లీడరుగారు అప్పుడే కొంత డబ్బు కొనవలసినవారి దగ్గర పుచ్చుకొని అమ్మితీరాలని నిశ్చయానికి వచ్చారు కొబట్టి పుల్లయ్య యెంత బ్రతిమాలినా లాభంలేకపోయింది ప్లీడరు ప్రాధేయపడుతున్న పుల్లయ్యకు ఏదో కొంత మట చెప్తానన్నాడు. "ఆ అంబారం పొలం కొనేవాళ్ళకు కౌలుస్తాను అలాగ ఏర్పాటు చేయించండి" న్నాడు

(46-వ పేజీ చూడండి)

పేచీ తెచ్చిన వాచీ

స్కూలు మేష్టరుగా పని చేస్తున్న కేశవరావుకు ఒకే ఒక తమ్ముడు. అతని పేరు మాధవరావు. ఇద్దరిది ఒకే ఆలోచన, ఒకే పని, ఒకే చోటవుంటూ ఒకే స్కూల్లో విద్యాభ్యాసం కూడా చేశారు. ఎక్కడికి వెళ్లినా యిద్దరూ కలిసే వెళ్ళేవారు. యుద్ధ సమయంలో యిద్దరూ కలిసి ఒక్కమారుగా సైన్యంలో ప్రవేశించారు. అందులో సమానమైన పేరుప్రఖ్యాతులు సంపాదించారు. యుద్ధానంతరము తిరిగి యింటికి చేరుకున్న వీరిని చూచి ఆవూరి వారంతా వారి కండలు తిరిగిన దండలకు జవసత్వాలకు మురిసిపోతూ ఘనంగా చెప్పుకుంటూ వుండేవారు.

ఇంటికి వచ్చిన కొలది కాలానికే తండ్రి చనిపోయాడు. తండ్రి చాలా ఆస్తి సేకరించాడు కాని అది సమానంగా పంచుకోడానికి తగినట్లు లేదు. ఆ కారణం చేత సమానంగా విభజించుకునేపట్ల రాబోయే కలహాలు వూహించుకొని అట్లా రాకుండా వుండేటట్లు ఇద్దరూ ఒక ఆలోచన చేశారు.

ఆస్తి అంతా వేలం వెయ్యడానికి, ఎవరికి ఏది అవసరమైతే అది వేలంలో కొనుక్కోడానికి వేలంలో వచ్చిన సొమ్ము ఇరువురు సమానంగా పంచుకోడానికి నిశ్చయించుకున్నారు. ఆ ప్రకారంగానే జరిగింది కూడాను. అయినా తగూ మాత్రం రాకుండాపోలేదు. తండ్రి ఒక అమూల్యమైన బంగారపు వాచి సంపాదించాడు. దాని ఆకారానికి, పనితనానికి చాలా ఘనంగా ఆ వూరివారంతా చెప్పుకునేవారు. అటువంటి వాచి అప్పట్లో ఆ చుట్టుపట్ల ఎవరివద్దా లేదు. ఈ వాచీ వేలం వెయ్యబోయేసరికి చాలామంది ధనవంతులు తయారయ్యారు కొనడానికి. కాని ఎప్పుడైతే అన్నదమ్ములే దానిని కొనడానికి నిశ్చయించుకొని మరొకరికి అవకాశం లేకుండా పాట పెంచడం ప్రారంభించారో వేలం నుంచి ఒక్కొక్కరే జారిపోయారు లాభం లేదని.

నేను చిన్నవాణ్ని గనుక నాయందు కనికరించి నాకే వదిలేస్తాడని చిన్నవాడు, నేను పెద్దవాణ్ని గనుక నన్ను గౌరవించి నాకే వదిలేస్తాడని పెద్దవాడు లోలోపల అనుకుంటూ పాటమట్టుకు తాపీగానే పెంచుతూ వచ్చారు. పాట పెంచుకోడంలో కలతలు రేగాయి. ముఖాలు కుమ్ములోనుక్కి తీసిన వంకాయల్లాగ కమిలిపోయాయి. ఒకరిపై మరొకరికి వుండే మంచి భావాలు మరుగుపడిపోయాయి. ఒకరిమీద ఒకరికి అసూయ, అసహ్యం పెరిగాయి. దాని పర్యవసానంగా ఆగ్రహము వీరికి వురిలో రూపందాల్చింది. నీ ముఖం మరి నేను చూడనని, నీ యిల్లు మరి నేను తొక్కనని, నీకూ నాకూ ఈ వాచీ మూలంగా ఆఖరు ఘడియలు వచ్చాయని, మనస్సు నొచ్చే అనేక పరుష వాక్యాలు అనుకున్నారు. దీనికంతటికీ కారణం ఆ వాచీపైన యిరువురికి గల సమాన వ్యామోహం తప్ప మరేం లేదు. అన్న పాట 500 రూపాయలవరకు పెంచి యితరులెవరికి అవకాశం లేకుండా చెయ్యాలని పట్టుబట్టాడు. అంతకుపైగా పాడ్డానికి యితరులకెవరికి అంగీకారం కూడా అయిందికాదు. 'ఆఖరుపాట నాది. 500 రూపాయలు' అంటూ వెళ్ళిపోబోతూవుంటే తమ్ముడు చెయ్యిపట్టుకొని 'తీసికో—ఇదినీదే' అనేసి మరి పాట పెంచకుండా వదిలేశాడు. ఈ ఒక్క వాచీ విషయంలోనే మనస్సులు చెడాయిగాని లేకపోతే అన్నదమ్ములకి ఉండవలసిన సహజ ప్రేమాభిమానాలు నూటికి నూరుపాళ్ళు యిద్దరిలోను ఉండకపోలేదు.

"ఇదిగో! వాచీ తీసుకో. నీ అడుగు జాడలలో మెసిలే రోజులు మరి నాకు లేవు. నీకు నాకు ఋణం తీరిపోయింది. నా హృదయం ఎంత కలవరపడి కలత చెందిందో నీ యిల్లు కూడా అంత క్షోభపడుతుందిలే" అని అంటూ మాధవరావు వెళ్ళిపోయాడు. ఆ ఘడియలగాయితు తండ్రియింట్లో యీ అన్నదమ్ముల ముఖాలు మరి కనిపించాయి కావు.

కొంతకాలానికి మాధవరావు ఒక బీద యింటి అమ్మాయిని వివాహం చేసుకొన్నాడు. కాని ఆ పెళ్ళికి అన్న అయిన కేశవరావును ఆహ్వానించలేదు. కేశవరావు అయినా మనస్సు మార్చుకొని పెళ్ళికి వెళ్ళలేదు. వివాహం జరిగిన మొదటి సంవత్సరములోనే ఏమి దురదృష్టమోగాని తమ్ముడి దగ్గర చిక్కని పాలు యిచ్చే చక్కని ఆవు చనిపోయింది. ఇంటికి ఉత్తరంవైపువున్న సాలలో తెల్లవారేసరికి అది చచ్చిపడివుంది. కారణం ఏమిటో ఎవరికి తెలియదు. ఇట్లాగే ఎన్నో నష్టాలు, కష్టాలు, ఒకటి తర్వాత ఒకటి తటస్థపడ్డాయి. వీటితో మరీ క్రుంగి కృశించిపోయాడు మాధవరావు అన్నిటికితోడు ఇది జరిగిన కొద్ది రోజులకే నడిశీతాకాలంలో అకారణంగా ఆవుకోసమని కొనివుంచిన గడ్డికుప్ప కాలిపోయింది. దీనంతటికీ కారణం తనకు చెడురోజులు వచ్చాయని, ఎవరో దుర్మార్గులు తనకు కీడు తలపెట్టి యిట్లాంటి పనులు చేస్తున్నారని మాధవరావు భావించాడు. ఆ రాత్రంతా ఎంతో విలపించాడు. అసలే బీదవాడు. దానికితోడు పాడిపంట రెండుకూడా కంటిముందే నాశనమైపోవడంవల్ల మరీ ఫకీరు అయిపోయాడు. ఏ పని చెయ్యడానికి కూడా మనస్సు అంగీకరించకుండా పోయింది.

గడ్డికుప్ప కాలిపోయిన ఆ సాయంత్రం తమ్ముడింటికి అన్న వచ్చాడు. ఏదో ఆలోచిస్తూ పడుకున్న మాధవరావు అన్నరాక చూస్తూనే చివాలున లేచి యిట్లా అన్నాడు.

'ఇక్కడ నీకు ఏమిపనుంది?' అని కోపంగా చూచాడు, అన్నవైపు.

జవాబిచ్చేముందు కొంచెంసేపు కేశవరావు ఆగాడు. తర్వాత చాలా శాంతంగా తమ్ముడితో "నీవు చాలా కష్టదశలో వున్నావు. నీకు సహాయం చేద్దామని వచ్చాను" అన్నాడు.

"ఇప్పటికి నీవు చేసిన సహాయం చాలు. మరేం వద్దు. నేను ఏమైపోవాలని నీవు కోరావో అంతకంటె తక్కువ నేనేమీ కాలేదు. నీకోరిక నెరవేరిందిగదా! ఇక దయచెయ్యి యిక్కడనుంచి. నీవు యింకా నాముందు నిలబడితే నేను ఏమి చేస్తానో నాకే తెలియదు. నా మనస్సు, యింద్రియాలు నా అధీనం తప్పిపోతాయి. నీముఖం చూపెట్టకుండా యిక్కడనుంచి తక్షణం వెళ్ళిపోవడం యిరువురికి మంచిది" అన్నాడు తమ్ముడు.

పేచీ తెచ్చిన వాచీ

"నీవు చాలా పొరపడుతున్నావు తమ్ముడూ! నామీద నీకుకలిగిన దురభిప్రాయానికి నేను చాలా విచారిస్తున్నాను" అన్నాడు అన్న.

"ముందు ఇక్కడనుంచి వెళ్లిపో. మనిద్దరికి సహాయపడేవాడు భగవంతుడే వున్నాడు. నన్ను రెచ్చకొట్టకుండా వెంటనే వెళ్ళిపోవడం నీకు మంచిది" అన్నాడుతమ్ముడు.

"వాచీ తనకు దక్కనీయకుండా నేను తీసుకున్నాననేకోపం, ఇంట్లోవున్న ఆవు చచ్చిపోవడం, గడ్డికుప్ప కాలిపోవడం, వీటన్నిటితో మనస్సు చెడి మధనపడుతు ఏవేవో అనరాని మాటలు అంటున్నాడు. ఆపరిస్థితిలో ఎవరైనా అట్లాగే వుంటారు. వాడంటున్న మాటలకు నేను కూడా కోపం తెచ్చుకొని వెళ్ళిపోతే వాడికి మరి దిక్కు ఎవ్వరూ లేరు. వాడు నన్ను అనకూడని మాటలు అంటున్నప్పటికి వాడు నాతమ్ముడే గదా! వాడి బాగు చూచి నేను ఓర్వలేక పోతున్నానని, తాను చెడిపోవడమే నేను వాంఛిస్తున్నానని దురభిప్రాయపడుతున్నాడు. దాన్ని తొలగిస్తేగాని నాకు శాంతి వుండదు," అని అనుకుంటూ పైకి "ఆవాచీ కావాలిస్తే నీవు తీసుకోవచ్చు. నీకు యివ్వడానికి నాకు ఎటి అభ్యంతరము లేదు" అన్నాడు చాలా కనికరంగా కేశవరావు.

"వాచీ కోసం నేను ఏడ్వడం లేదు. నన్ను నీవు ఏమీ ఓదార్చనక్కరలేదు. నాచావు నన్ను చావనిసే అంతేచాలు, పో యిక్కడనుండి" అని గట్టిగా అరిచాడు, పిచ్చివాడిలాగ. ఎంత శాంతపరచబోయినా కోపం రెట్టింపు కావడంచేత అన్నకు ఏమితోచిందిగాదు. నిస్సబతతో, నిర్విణ్ణుడై, నిష్ప్రహతో అట్లాగే నిలబడి పోయాడు గుమ్మంలో. కాని తమ్ముడే ఆ సమీపంనుంచి తొలగిపోయాడు చిరాకుతో. చేసేది ఏమీ లేక తర్వాత తానుకూడా వెళ్ళిపోయాడు అన్న. కాని తమ్ముడి యొక్క కష్టపరంపరలు ఎప్పటికప్పుడు తెలుస్తూనే వున్నాయి. అనేక దఫాలు తమ్ముడికి తనపట్ల మంచి అభిప్రాయం కలగాలని, తమ్ముడి కష్టాలు అన్నీతొలగి పోవాలని దేవాలయంలో ప్రార్థిస్తూ వుండేవాడు. ఏ రూపంగానైనా సహాయం చేద్దామని నిశ్చయించుకొని తీరా యింటికి వెళ్ళేసరికి యింట్లోనుంచి పైకి వచ్చేవారో, లోపలికి వెళ్లేవారో, తమ్ముడితో మాట్లాడుతూవుండే వారో ఎవరో ఒకరు కనిపిస్తు వుండడంవల్ల అనుకున్న సహాయం కూడా చేయలేకపోతూ వుండేవాడు.

కాని ఒకసోమవారం చాలా ఆలస్యంగా దేవాలయానికి కేశవరావు వెళ్లాడు. అక్కడ తమ్ముడు అనుకోకుండా కనిపించాడు. జీర్ణవస్త్రాలు, వాడిన మోము, రేగిన జుత్తు, కృశించిన ఆశరీరము చూచేసరికి అన్నగుండె తరుక్కుపోయింది. గుడనిండా నీళ్లు గిర్రున తిరిగాయి. తనకు తన తమ్ముడికి చిన్నప్పుడు ఎంతప్రేమ, అభిమానం వుండేవో, ఎట్లా ఒకరినొకరు విడువకుండా సంచరిస్తూ వుండే వారో అవన్నీ స్మృతిపథానికి వచ్చాయి. 'అంతమంచివాడు యింత కఠినుడుగా ఎట్లా మారి పోయాడోగదా! ఆపాపిష్టివాచి ఎంత పనిచేసింది! మాయిద్దరి మధ్య మనస్పర్థలు రేకెత్తించి, మాలోమాకు ఆరని మంటలను ప్రజ్వరిల్ల చేయించి, అన్నదమ్ములముగా వుండడానికి వీలులేని పరిస్థితికి కారకుడైన మాతండ్రిని నేను దూషించాలో, భూషించాలో తెలియడంలేదు. సరే ఏమైనే అయింది. నేనే దగ్గరకు వెళ్ళి నా బాధను చెప్పుకుంటాను. నన్ను వాడు చిన్నతనంచేత దూషిస్తూ దూరంచేసినా, వాడిని దగ్గరకు చేర్చుకొని ఆదరించవలసిన బాధ్యత నాది. నన్ను కోపంచేత తిట్టినాసరే, కొట్టినాసరే, నేనేవెళ్ళి పలకరించి అంతా మరిచిపొమ్మని బ్రతిమాలుకుంటాను' అని మనస్సు కూడ బెట్టుకొని దగ్గరకు చేరబోయే వేళకు చుట్టూ ఎవరో వుంటూవుండడంవల్ల వీలుకాలేదు. తమ్ముడు తలఎత్తిచూస్తాడేమో పలకరిద్దామని ఆశించాడు. తమ్ముడి చెంత అతని భార్యకూడా వుంది. కాని ఆవిడతో తనకు పరిచయం బొత్తిగాలేదు. ఆకారణంచేత పోనీ యింటికేవెళ్ళి పలకరిద్దామని నిశ్చయించుకుంటూ తనయింటికి వెళ్ళిపోయాడు.

అనుకున్న ప్రకారం ఆమర్నాడు బయలుదేరి తిన్నగా తమ్ముడి యింటిగుమ్మందగ్గిరకు వచ్చాడు. అక్కడ తన తమ్ముడిభార్య "మిమ్మల్ని కలుసుకోవాలని గాబోలు మీ అన్నగారు దేవాలయంలో ఉదయం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. మీమీద ఆయనకు ఎంత మమకారమోగదా!" అని యింకేమేమిటో అంటున్నట్లు విన్నాడు.

"ఊహుం. వాడు నన్ను ఎప్పుడూ తలచడు. తలచడానికి మరి వీలు లేదు. నాకు బాగా తెలుసు. వాడికి నేను అవసరం లేదు" అంటున్నాడు తమ్ముడు.

చాలాసేపువరకు మరేమీ మాటలు వినిపించలేదు. చలివేస్తున్నా బైటే కొంచెం సేపు నిలబడ్డాడు. తమ్ముడి భార్య నిప్పుచేసి కుంపటిమీద నీళ్ళు మరిగిస్తోంది. ఆ నీళ్ళు మరుగుతున్న శబ్దంకూడా వినిపిస్తోంది. ఒక చంటిపిల్ల అప్పుడప్పుడు కీచుగొంతుకతో ఏడుస్తోంది. తమ్ముడు ఉయ్యాల లాగుతున్న ధ్వనికూడా వినిపిస్తోంది. మరి కొంతసేపటికి తమ్ముడి భార్య యిట్లా అన్నది:

"మీరు నాముందు ఒప్పుకోకపోయినా మీకుమాత్రం మీ అన్నగారిని కలుసుకొని మీ ఆవేదన చెప్పుకోవాలని లేదా? మీ యిద్దరికి కూడా అట్లాగే వుంటుందని నాకు తెలుసు."

"తెలుస్తే సరే. మరి ఆ మాటలు మానేసి యింకేమైనా చెప్పాలని వుంటే చెప్పు. ఆ ప్రసంగంమాత్రం ఎత్తకు," అన్నాడు. మరి కొంచెం సేపటికి లేచి పైకి వెళ్లిపోయాడు తమ్ముడు. తమ్ముడి రాక కనిపెట్టి అన్న పక్కనేవున్న కర్రలకొట్టులో దాక్కుబోయాడు. కాని తమ్ముడుకూడా అదే సమయంలో అక్కడికే వచ్చాడు కర్రలకోసమని గాబోలు! తమ్ముడికి కనిపిం

చకుండా ఒకమూల తలుపువెనక పొంచి నిలబడ్డాడు. తమ్ముడు తాను మోయగలిగినన్ని కర్రలు తీసి భుజంమీద వేసుకోబోయి తూలిపోయాడు నిస్సత్తువ చేత. తిరిగి లేస్తూ "నా శరీరస్థితి యింతవరకు వచ్చింది. ఎందుకు ఇంకా బ్రతికిస్తున్నావు భగవంతుడా?" అని అనుకుంటున్న మాటలు అన్న చెవిని బడ్డాయి. ఆ మాటల తాలూకు భావం పూరిగా అర్థం చేసుకో గల అన్న వెంటనే వెళ్ళి తమ్ముడ్ని కౌగలించుకొని తన మనో వేదనను వెడల గ్రక్కుదామనుకున్నాడు. తమ్ముడికి కొత్తగా దగు కూడా ఒకటి ఏర్పడింది. కొంతసేపు వరకు దగ్గుతూనే నిలబడ్డాడు గోడను ఆనుకొని. తర్వాత మెల్లిగా కోలుకొని అన్నను గమనించకుండానే పక్కనుంచి వెళ్ళిపోయాడు. అన్న చాలాసేపు ఆచలిలో నిలబడ్డాడే గాని లోపలికి వెళ్ళి మాట్లాడ్డానికి ధైర్యంచాలింది కాదు.

"ఈ వాచీమూలంగానే గదా మా యిద్దరి మధ్య యీ కలత చెలరేగింది. దీనిని ఇక్కడ వదిలేస్తే మరే బాధవుండ"దనుకుంటూ తన తమ్ముడు టార్చిలైటు నిత్యం ఎక్కడ పెడుతూవుంటాడో ఆపక్కనే వాచి పెటేసి ఎంతో భారం వదిలిపోయినట్లు తేలుసూ ఒక్క వూపున గబగబ యింటికి వెళ్ళిపోయాడు కేశవరావు.

మర్నాడు ఉదయం తాను వాచి వుంచిన స్థలానికి సమీపంలోనే వున్న కర్రల కొట్టు కాలిపోయినట్లు తెలిసింది. కారణం తెలుసుకోలేకపోయాడు. చీకటి పడ్డతర్వాత తిరిగి కేశవరావు బయలుదేరాడు. ఆకాశం వెన్నెల వెదజల్లుతోంది. తాను వాచివుంచిన ఆ కాలిపోయిన స్థలం సమీపించాడు. వాచీకి బదులుగా ఒక బంగారపు ముద్ద కనిపించింది. బంగారపు వాచి కరిగి యీ రూపం దాల్చిందిగదా అనుకుని ఆముద్ద పట్టుకొని వెళ్ళిపోయాడు.

అన్నదమ్ము లిద్దరికీ బద్ధవిరోధం వున్నట్లు, తమ్ముడికి కలుగుతున్న బాధలన్నిటికీ అన్నే బాధ్యుడైనట్లు భావిస్తున్న యిరుగుపొరుగు వారంతా పోలీసు సేషనులో రిపోరుయిచ్చారు వాళ్ళను రాజీ చేయించవలసిందంటూ. ఆ తర్వాత మరి నాలుగురోజులకు కోర్టునుంచి యిద్దరికీ సమన్లువచ్చాయి. మంచి దుస్తులు వేసుకుని కేశవరావు, చిరిగిపోయిన గుడ్డలుధరించి మాధవరావు యిద్దరు కోర్టుకు వెళ్ళారు. అక్కడ ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారేగాని మాట్లాడుకోలేదు. కోరువారు మాధవరావును పిలిచి, 'మీ అన్నగారిపైన మీకు ఎటువంటి అనుమానమైనా వుందా?' అని ప్రశ్నిస్తే లేదని జవాబిచ్చాడు. నిజంగా అనుమానంవుంటే ఆ కారణాలు తెలుసుకొని కేశవరావుకు శిక్షవిధించే వారే. ఇప్పుడు ఏంచెయ్యడానికి వీలులేక "మీ రిద్దరూ సోదరులు అనే విషయం మరిచిపోకండి. ఒక్క తమ్ముడుగాని, ఒక్క అన్నగాని లేకపోయాడే నాకని విలపించే అన్నదమ్ములు ఎంతోమంది వున్నారు. ఆ దురదృష్టం మీకు పటనందుకు, ఏకోదరులుగా జన్మించినందుకు, సంతోషించండి. దీర్ఘకాలం పగసాధించే పట్టుదల యెంత మాత్రం కూడదు. మంచిని సాధించడానికి పట్టుదల అవసరం కాని, చెడు తలపెట్టడానికయినా పట్టుదల పనికిరాదు. ఇద్దరు కలిసి ఐకమత్యంగా వుండండి" అంటూ జడ్జీ బల్లదిగి వెళ్ళిపోయాడు.


ఎవరిదారిని వారు—యీ అన్నదమ్ములు కూడా వెళ్ళిపోయారు తమ ఇళ్లకు. తర్వాత కొద్దిరోజులకే ఒకనాడు రాత్రి కేశవరావు యింటికి ఒక బీదస్త్రీ వచ్చి తనయింటికి ఒక దఫా రావలసిందిగా కోరింది. కేశవరావు ఆవిడను బాగా గుర్తించాడు. తన తమ్ముడి భార్య అని తెలుసుకున్నాడు. కాగావచ్చిన కారణం కూడా వెంటనే పోల్చుకున్నాడు. మారు చెప్పకుండా ఆవిడ వెనుక బయలుదేరి వెళ్ళాడు. దూరంనుంచే తమ్ముడి యింట్లో నుండి ఒకదీపం మినుకు మినుకుమంటూ కన్పిస్తోంది. ఆ వాతావరణం అంతా శూన్యముగా గోచరిస్తోంది. భరించ శక్యముగాని వేదన, మంట హృదయములో ప్రవేశించింది. ఈ మంట మరేరకపుమంటకు కారణం కాబోతుందో అని మనస్సులో పరిపరి విధాల చింతిస్తూ ఆ కుటీరం సమీపించాడు. ఇంటిముందు దుర్గంధం కొడుతోంది. ఆ వాసన భరించలేకపోతున్నాడు. అయినా వెళ్ళక తప్పదు గనుక తమ్ముడి భార్య ముందు నడుస్తూవుంటే తాను ఆ వెనుకే లోపల ప్రవేశించాడు. ఒక చంటిపిల్ల పొయ్యిదగ్గర కూర్చుని బొగ్గులు నములుతోంది. వళ్ళంతా మసి. చూడ్డానికి ఎంతో అసహ్యంగా వుంది. కాని ఆ నల్లని ముఖం నుండి తెల్లని పళ్ళు నవ్వు ప్రదర్శిస్తున్నాయి. ఆ అమాయకపు పిల్లకు యిదంతా ఏం తెలుసుంది!

పక్కనులకమంచంమీద, అన్నిరకాల చిరిగిన చెత్తగుడ్డలమధ్య మాధవరావు వెల్లకిలా పడుకునివున్నాడు. శరీరం పూర్తిగా కృశించిపోయింది. కళ్ళులోపలికి పోయాయి. ఎముకలుతప్ప మరేం కనిపించడం లేదు. అన్నరాక చూస్తూనే లేవబోయాడు కాని తిరిగిమంచంమీదే పడిపోయాగు. తమ్ముడి ఆ పరిస్థితి చూడగానే కేశవరావుకు పటజాలని దుఃఖం వచ్చింది. అప్రయత్నంగా చెక్కిళ్ళ మీంచి నీళ్ళుబొట్లురాలాయి. మంచంచివర కూర్చుని, అపుకోజాలని ఆవేదనలో ఏమీ కూడా మాట్లాడలేక కొన్ని నిముషాలువుండి పోయాడు. తమ్ముడు అన్నవైపు రెప్పవేయకుండా, దైన్యంగా చూస్తూ భార్యను అవతలికి పొమన్నాడు బహుశా అన్నతో ఆఖరి మాటలుగా ఏవో చెప్పాలని గాబోలు! కాని ఆవిడ వెళ్ళిపోవడానికి కేశవరావు అంగీకరించాడుగాదు.

ఇద్దరు అన్నదమ్ములు వాచీ వేలం అయిన రోజు లగాయితు ఆక్షణం వరకు జరిగిన విషయాలు, ఇద్దరూ పొందుతున్న వేదన, అన్నీ చెప్పుకున్నారు. వాచీ తన వద్దకు చేరినది లగాయతు, చివరకు కరిగి ముద్దయి పోయే ఘడియ వరకు తన ప్రాణానికి హాయి లేక పోయిందని అన్న అంటూ ఆ బంగారపు ముద్ద చూపెట్టి తమ్ముడిపక్కలో వుంచేశాడు. అది చూచి తమ్ముడు సంతోషించలేదుసరిగదా ముటనైనా ముటలేదు. అన్ని ఆశలు అంతరించాయి. 'ఆఖరు గడియలు సమీపించాయి' అని అంటున్న తమ్ముణ్ని వదిలి వెళ్ళలేక దగ్గరే వుండి చేయదగ్గ సహాయం, సపర్యలు చేస్తూ వచ్చాడు.

మరునాడు ఉదయం లేస్తూనే అన్నతో "నాకు మరేం భయంలేదు. నన్ను గూర్చి ఎవరూ బెంగపడవద్దు. నా వంట్లో యిప్పుడు చాలాబాగుంది. ఈ క్షణం లగాయితు మనమిద్దరం తండ్రి బ్రతికివున్నప్పుడు ఎట్లా కలిసి మెలసి అన్యోన్యంగా ప్రేమతో వుండేవాళ్ళమో అట్లాగేవుందాము. నన్ను విడిచి వెళ్లకు. నిన్ను విడిచి నేనువుండలేను. నాకుటుంబం నీకుటుంబంతో కలిసిపోవాలి. ఇద్దరం కలిసేవుందాం" అన్నాడు. అంతే. అవే ఆఖరుమాటలు. అవే ఆఖరు చూపులు. అదే ఆఖరు కలయిక. అంతే. మరి తమ్ముడు లేడు యీ ప్రపంచములో.

కేశవరావు తమ్ముడుకుటుంబాన్ని తాను చేరదీయక తప్పిందిగాదు. అసూయ, ఈర్ష్య వల్ల తనతమ్ముడికీ తనకు కలిగిన శారీరక, మానసిక పరిణామాలు అనుక్షణం మననంచేస్తూ, ఉపాధ్యాయుడుగా తనశిష్యులను ఇటువంటి యీర్ష్య, అసూయలనుండి దూరంగావుండమని, ప్రేమలేనిజీవనం వృథాఅని, సోదర ప్రేమ అమోఘమైనదని బోధిస్తూ, తమ్ముడి కుటుంబాన్ని ఆదరిస్తూ, తమ్ముణ్ణి స్మరిస్తూ జీవితం గడిపాడు. ★



[ఉద్యోగపర్వంనుండి]

క. నీవు సమస్తము నెఱుఁగుదు, గావున నీ కూరకుండఁ గాఁ దగదు ధరి
శ్రీవల్లభుఁ డడిగినపని, యీవిధ మని తెలియఁబలుకు మేము వినంగన్.

వ. అనినఁ బ్రసాదం బని సంజయుండు ధృతరాష్ట్రున కిట్లనియె

క. ఆ సేనకు నీసేనకు, వాసి యడిగె దీవు నన్ను వసుదేవసుతుం
డా సేనఁ గలఁడు తత్సము, నీసేనం జూపుమా నరేశ్వర నాకున్.

వ. వాసుదేవుం డెట్టివాఁ డని యడిగెదేనిం జెప్పెద.

చ. జగముల నన్నిటిం దనవశంబుగఁ జేసినవీరు భంగముల్
బగయు లలాటలోచనుఁడు వాపఁగఁ జేర్చినయట్టి బాణు నొ
క్కగడియలోన గర్వ మడఁగం బఱిమార్చె సురేంద్రకల్పకం
బు గరములీలఁ దెచ్చె హరి భూరిపరాక్రమ మప్రసిద్ధమే.

ఆ. అధికదుష్కరంబు లైన కార్యంబులు, క్రీడవోలెఁ జేయుఁ గేశవుండు
విను మతండు పార్థు నెనసి యేకార్థుఁడై, యుండుఁ బూర్వభవసఖుండు గాన.

వ. అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయాబలంబునఁ బాండవుల సర్వసమరసాధనంబులయందును సూక్ష్మరూపవ్యాపియై నిలిచి వారికి విజయం బొసంగుచుండు నని చెప్పి మఱియు ని ట్లనియె.

క. పలుమఱుఁ బాండుతనూజుల, కొలఁది వితర్కించెదవు నిగూఢం బది యుం
దెలియం బలికెద వారికి, బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా

వ. హరిమహత్త్వంబు విన్నవించెద నవధరింపుము.

క. ఒకతల సమస్తజగములు, నొకఁడ జనార్దనుఁడు నిలిచి యొకతలనైనన్
సకలము నసార మాతం, డొకరుని సారంబ చాల నుత్కృష్ట మగున్.

క. తలఁపునన వాసుదేవుఁడు, గలిగింపను నిలుప నడపఁగాఁ నోపు జగం
బుల మఱియును గ్రీడార్థము, పలువోకలఁ బుచ్చుచుండుఁ బౌరవనాథా

క. ఎక్కడ నడచును సత్యం బెక్కడ ధర్మంబు వరఁగు నెక్కడ గలుగుం
జక్కటి నిలుచుం గృష్ణుం, డక్కడ నతఁ డున్న కడన యగు జయ మధిపా.

సీ. పురుషోత్తముం డెల్లభువనంబులును దాన యఖిలభూతాత్మకుండై విహార
లీల విచేష్టించు నీలోకముల మాయ దొట్టి యొక్కొకమరి పుట్టి పెరిఁగి
కర్మానుచరణముల్ గైకొని వర్తించు శిష్టరక్షణమును దుష్టనిగ్ర
హంబును దనపను లగుటఁ బాండవుల నెపం బిడుకొని ధర్మబాహ్యులైన

తే. నీ తనూజుల నిక్కమ నిగ్రహింపఁ, దలచినాఁ డమ్మహాత్ముండు దథ్య మతని
నిట్టి చందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ, రాశ్రయింతురు బ్రదుకుదు రట్టివారు.

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు వి, ష్ణుని నే నెఱుఁగని విధంబునుం దెలియఁగ నీ
కని యున్న తెఱఁగుఁ జెప్పుమ, యనుటయు సూతసుతుఁ డిట్లు లను నాతనితోన్.

వ. విద్యయు నవిద్యయు ననఁగా రెండు గల వవిద్యాదూషితుండై తమోగ్రస్తుండైనవాఁడు విష్ణు నెఱుంగఁడు విద్యాసంపన్నుం డెఱుంగు ననిన విద్య యనునది యెట్టిది యెద్దాన నీ వా సర్వేశ్వరు నెఱింగితి దాని నవిద్య యెట్టిది దానిని జెప్పు మనుటయు నాంబికేయునకు సంజయుం డిట్లనియె సాత్త్విక రాజసతామస వికారంబుల త్రిప్పులం బడక ధర్మం బాచరించుచు భావశుద్ధి గలిగియుండుదు దీన నే నచ్యుతు నెఱుంగుదు విద్య యిట్టిది నీకునుం దక్కెవ్వరి కైన ననతని నెఱుంగుటకు విదియ తెరు విట్టిది గాని విధం బవిద్య యని చెప్పిన నతండు నిజనందనున కిట్లనియె.

క. మన కాప్తుఁడు సంజయుఁ డీ,తని యుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింప వయ్యా య,తనిఁ జొచ్చిన బ్రదుకు దీవుఁ దమ్ములు సుతులున్.

చ. అనిన సుయోధనుండు దమయయ్యకు ని ట్లను నిజ్జగంబు ల
న్నిని నొకపెట్ట మ్రింగినను నెట్టన సర్వము గాచె నేనియు
న్వినుము ముకుందుఁ డర్జునుని నెచ్చెలి నాఁ జెవులార వించు నిం
క నతని నొక్కబామునకుఁ గా ధృతి పెం పఱ నాశ్రయింతు నే.

తే. అనిన గాంధారి కిట్లను జనవిభుండు, నీ తనూజుండు దుర్మాని నీతిబాహ్యుఁ
డుద్ధతుం డీసు మాని నాబుద్ధి వినఁడు, వీఁడు సెడఁగాని బ్రదుకంగ లేఁడు సుమ్ము.

ఉ. నావుడుఁ దల్లి యిట్టులను నందనుతో నిది యేల యాయువున్
శ్రీవిభవంబులున్ మము నశేషసుహృజ్జనులం దొఱంగఁగా
నీవు గడంగె దిట్టి యవినీతులునుం గలరే వృకోదరుం
డై విధి సంపఁగా నొరుల కాఁగఁగవచ్చునె యింకఁ బుత్రకా.

వ అనియె నట్టియెడం గృష్ణద్వైపాయనుండు ధృతరాష్ట్రున కిట్లనుఁ గృష్ణుండు నీకుం గూర్చు నీవుం బరమాప్తుండైన సంజయు నతనిపాలికిం బుచ్చి తది లెస్స కార్యం బయ్యె వీఁడును నమ్మహానుభావు మహనీయ ప్రభావం బున్నరూ పెఱుంగు వీనిబుద్ధి విని యద్దేవు నాశ్రయింపు మతం డేకాగ్రచిత్తులై యారాధించిన వారికిఁ జేరువ యగుఁ గామక్రోధోపహతులై తమతమ ధనంబులం దృప్తులుగాక యన్యాయంబున వర్తించువారలకు దూరంబై యుండు నెల్లభంగుల నాతనిం జొచ్చి బ్రదుకు మనినం బ్రసాదం బట్లచేయుదు నని విచిత్రవీర్య నందనుండు సూతనందనునితో నవ్వాసుదేవు నామనిర్వచనంబు నాకుఁ దేటపడం దెలిపి యతనిం బొందు నుపాయం బుపదేశింపవే యని యడిగిన.

తే. ఎల్లయందును దా వసించు నెల్ల, యదియుఁ దనయందు వసియించు టంద్రు వాసు
దేవుఁ డనుపేరి కర్థంబు దెల్ల మింత, యెఱుఁగు జనులందుఁ దగ వసియించు శుభము.

తే. అతనిఁ బొందు నుపాయంబు నంతరంగ, నిగ్రహము కాఁగ నార్యు లనుగ్రహింతు
రోపి చిత్తవికారంబు లుడిపి యేక, బుద్ధిఁ గొలువఁ బ్రసన్నతఁ బొందు నతఁడు.

వ. నీవును బలుబుద్ధు లుడిగి గోవిందు నాశ్రయింపు మనినం బ్రజ్ఞాచక్షుం డిట్లనియె.

క. నాకు నయనేంద్రియము గతి, లేకుండుట కంతవగపు లే దఖిలమనో
జ్ఞాకారుఁడైన హరి నాలోకింపం గానమికిఁ గలుగు వగ పెపుడున్.

ఉ. ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండు వా
రేతప మాచరించిరో యుపేంద్రుని నాశ్రితవత్సలున్ విని
ర్ధూతకలంకు ధర్మనిరతుం గరుణాకరు సర్వలోక వి
ఖ్యాతుఁ బవిత్రమూర్తి శరణాగతరక్షకు నాశ్రయించెదన్.

వ. అనిపలికి పరమశాంతుండై పారాశర్యు నుద్దేశించి దేవా యేను వాసుదేవుని శరణు సొచ్చి బ్రతుకువాఁడ ననుచుఁ గృతాంజలి యగుటయు వ్యాసమహామునియు నాశీర్వాదంబు సేసి యంతర్హితుం డయ్యెఁ గౌరవేశ్వరుండును దుర్యోధన సంజయుల విజనివాసంబులకుం బోవంబనిచి తానును గాంధారియు నభ్యంతర మందిరమున కరిగి యుచితవ్యాపారంబులం బ్రవర్తిల్లుచు నుండె నని చెప్పిన విని వదంపడి పుట్టిన విశేషం బెట్టి దని యడిగిన.

శా. నిత్యానిత్య వివేకవైభవ సమున్నిద్రాంతరంగస్ఫుట
ప్రత్యూహా పరమేశ విశ్వజగదారాధ్యా మహానంతచి
త్సత్యానందవిభుస్వభావమహితా సంవిత్సమాధానదా
ర్గత్యవ్యాహృతి సంప్రవర్తన విదగ్ధశ్రీ పదాంభోరుహా.

క. వ్యాసాదిముని ప్రోక్తమ, హానందర్భా ప్రమేయతాగూఢగుణో
ల్లాసా నైర్గుణ్యసము, ద్భాసి రహస్యానుభవ భక్తాధీనా.

మాలిని. సమదనిమిష చూడానవ్యరత్న ప్రభాసం
గమరుచిరపదాబ్జా గర్వదుర్వారదైత్యో
ద్యమబహులతమో మార్తాండదోః క్రీడనప్ర
క్రమ లలితవిశాసా గాఢభక్తి ప్రకాశా.

గద్యము ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కనసోమయాజి ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున యుద్యోగపర్వంబునందు ద్వితీయాశ్వాసము.

ఉద్యోగపర్వము, తృతీయాశ్వాసము

శ్రీవాగ్విభవారోగ్యప్రావీణ్య ప్రాభవానుభావమహిత సౌ
ఖ్యావహ పదస్మరణ కరుణావాస కటాక్షకిరణ హరిహరనాథా.

శ్రీకృష్ణుని రాయబారము

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె.

తే. సంజయుండు దన్ను వీడ్కొని చనిన ధర్మ, సుతుండు మఱునాఁడు దమ్ములఁ సుతుల నిష్ట
భృత్యవరులను దొరలను బిలువఁ బనిచి, యెల్లవారును వినుచుండ నిట్టు లనియె.

క. మనము జనార్దనుపాలికిఁ, జని కౌరవసభకు నతనిఁ జను మని ప్రార్థిం
చిన మేలు బంధుహితగురు, జనములతో రణము గాక సంప్రీతి యగున్.

వ. అని పలికి వార లందఱు బలసి చనుదేర మాధవుమందిరంబున కరిగి యతనిచేత సత్కృతుండయి సమస్త పరిజనంబులుం బరివేష్టింప నొక్కపార్శ్వంబునం బాంచాలియు సముచితపరివార పరివృతయై యుండ నతండునుం దానును సుఖాసీనుండై యుండి యతనితో నిట్లనియె.

క. ఆపదఁ గడవం బెట్టఁగ, నోపి శుభం బైనదాని నొడఁగూర్పను మా
కీపుట్టువునకుఁ బొందు, క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా.

తే. సమయ మిది మిత్త్రకార్యంబు చక్కఁ జేయ, నీకతంబున నేమవినీతుఁ డైన
యాసుయోధనుతోడి పోరాట దక్కి, యనుభవింతుము మాయంశ మగు ధరిత్రి.

వ. నీకు మేము ప్రద్యుమ్నాది కుమారులతోడివారము మమ్ము దురితంబులు వొరయకుండ నరసి రక్షింపు మనవుడు వాసుదేవుండు నీపంచినయట్ల చేయంగలవాఁడ నెయ్యది తలంపు సెప్పు మనిన నజాతశత్రుండు నీవు కరిపురంబున కరిగి కౌరవులతోడం దగినమాట లాడి తెఱంగు సేయవలయు నని ప్రార్థించి యతని నియ్యకొలిపి యిట్లనియె.

సీ. మాతండ్రితలఁపును నాతనినందనుచందంబు నిన్న యాసంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁగదా నీకు వారిచిత్తముభంగి వాఁ డెఱుంగుఁ
బాలుపం పని యీక యేలిమాటలన మమ్ములుక దీర్చెదరు తా రధికదుష్క
రం బైన యానమయం బేము పదుమూఁడువత్సరంబులు సల్పి వచ్చి యుండఁ

ఆ. కులముపాడి నడపఁ దలఁపఁడ పతి సెడఁ, దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్ప లేఁ డింతకంటెఁ గలదె యెడరు మాకు.

క. జననియు సమస్తబాంధవ, జనములుఁ బ్రియ మంద వారి శాంతులఁగాఁ జే
యను నెమ్మిగ నొక్కటిపై, మననుం దెఱఁ గేది యునికి మాపౌరుషమే.

క. ఇచ్చటిబంధులు నీవును, నచ్చెరువడి వినుచు నుండ నయిదూళ్లను మా
కిచ్చినను జాలు నంటిని, బొచ్చెము గా దింతవట్టు పూర్ణము సుమ్మీ.

శా. ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయం జాలఁడో కాని పెం
పేదం గ్రూరత కోర్వ రాదు సిరి నా కే లందునే గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నాయరయు నీచుట్టాలకుం గావునన్
మోదం బందుట గల్గుఁ గౌరవులు నేనుం బొంది శ్రీ నొందినన్.

ఉ. అక్కట లాఁతు లైనఁ బగ లైనను జంపన కోర నేల యొం
డొక్క తెఱంగు లేదె యది యొప్పదె బంధుసుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు గణుతింపక సంపదకై వధించి దూ
టెక్కుట దోష మందు టను సీదురవస్థల కోర్వవచ్చునే.

వ. అని పలికి పాండవాగ్రజుండు వెండియు.

ఆ. క్షత్త్రధర్మ మింత కష్ట మగునె పెఱ, ధర్మ మాచరింపఁ దగద యటంద్రు
గాన శస్త్రజీవికయ తగి యున్నది, యైన వంశనాశ మనభిమతము.

వ. అదియునుం గాక.

ఆ. కలహ మగుట లక్ష్మిఁ గావించుఁ బ్రాణహా, నియును జేయు నింత నిక్కవంబు
పలువు రొకనికోఁడివాఱుట బల్లిదు, లనద చేతఁ జెడుటయును ఘటించు.

క. జయ మగు నోడుదు మను ని, శ్చయ మొక్కఁడు లేదు వినుము సమరమునఁ బరా
జయము మరణంబుకంటె హృ, దయపుటభేదనము సేయుఁ దథ్యం బనఘా.

క. కాన యవశ్యముఁ బెనఁకువ, గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్పు ధృతిం
బూని నడుచు నెవ్వఁడు డెం, దానం జెయి వెట్టికొని యతఁడు నిద్రించున్.

ఆ. పగయ కలిగెనేనిఁ బా మున్న యింటిలో, నున్నయట్ల కాక యూఱడిల్లి
యుండు నెట్లు చిత్త మొకమాటుఁ గావున, వలవ దధికదీర్ఘవైరవృత్తి.

చ. పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం
బగ వగ గొన్న మార్కొనక పల్కకయుండఁగ వచ్చునే కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు నే
మిగతిఁ దలచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా.

ఉ. కావున శాంతిఁ బొందుటయ కర్జము దా నది యట్టు లుండె శ్రీ
గావలె నంచుఁ బోరితము గామియుఁ గోరెద మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ నొందుమై
నేవిధి నైనఁ జక్కఁబడు టెంతయు నొప్పు జుమీ జనార్దనా.

చ. మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ
ర్తనముల రెండుదిక్కుల హితంబును బెంపును గల్గు నట్టిచొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడిమె
ల్పునఁ బరుసందనంబునను భూపతు లెల్ల నెఱుంగ నాడుమీ.

చ. తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కిన యేని సైఁచి యొ
ప్పుగ నిలుమీ గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారిమా
ట గొనమి యాసుయోధనుకడన్ నిలువన్ మన మెల్లగౌరవం
బుగఁ గురువృద్ధపల్కుఁ దలఁపుం జన నిచ్చిన మెచ్చరే జనుల్.

[1908

[సెప్టెంబరు నెలలో 50 సంవత్సర

ఈ జన్మదినోత్సవ శుభసన

ఉత్తమ రచనలతో, విభిన్న శీర్షికలతో, ఆకర్షవంతమైన
వివిధ రంగాలలో ఆంధ్ర సంస్కృతి సాహిత్య వికాసా
సుందరంగా ప్రకటిం

రచనల పోటీ:

(1) ఉత్తమ సాంఘిక నవల: ఆంధ్రదేశంలో గత యాభై సంవత్సరాలలో మత, రాజకీయ, ప్రకృతి సౌందర్య సుప్రసన్నతనూ, ఆంధ్రప్రజల విశిష్ట గుణగ
ఉత్తమ సాంఘిక నవలకు రు **501** లు బహుమానం ఇవ్వదలిచాము. వారపత్రిక సైజులో నవల 150
వరుసగా ప్రకటించుతాము.

(2) ఉత్తమ ఏకాంక నాటిక: ఆధునిక రంగస్థలంపై ప్రదర్శనకు యోగ్యమైన ఉత్తమ ఏకాంక
మించకుండావుండాలి. [**అనువాదాలు, అన**

(3) ద్విపదలో ఆంధ్రమహావిష్ణువు గాథ: ఆంధ్రజాతికి మూలపురుషుడగు ఆంధ్రమహావిష్ణువుగా
బహుమానం. ఇది దాదాపు 400 ద్విపద పాదాలలో

కవులు, కథకులు, వ్యాసకర్తలు, కళాకారులు యథాశక్తి స్వర్ణోత్సవ సంచికకు తమతమ రచనాభరణాలన్ను
రచన లేవీ మూడు, నాలుగు పేజీలకు మించరాదని విజ్ఞప్తి.

గమనిక: **రచనలు, చిత్రాలు, ఫోటోలు జులై 1 లోపుగా మాకు అందాలి. ప్రతి రచనకు, చిత్రానికీ, ఫో**
అని వ్రాయాలి. వాటిని పంపే కవరుమీద కూడా ఈ మాటలు వ్రాయాలి.

1958]

ాలునిండి 51 ప్రారంభ మవుతుంది]

ంయంలో వెలువడుతుంది.

రకరకాల చిత్రాలతో ఆంధ్రదేశ స్వరూప స్వభావాలను,
లను ప్రతిబింబింపజేసేట్లు ఈ ప్రత్యేకసంచికను సర్వాంగ
ంచాలని సంకల్పం

బ హు మ తు లు

సాంఘిక, సాంస్కృతిక రంగాలలో వచ్చిన వివిధ పరిణామాలనూ దృష్టిలోపెట్టుకొని ఆంధ్రదేశ
శాలనూ పరిగణిస్తూ తదనుగుణమైన ఇతివృత్తాన్ని తీసుకొని కథాసంవిధానానికి ప్రాధాన్యం ఇచ్చి రచించే
జీలకు తగ్గకూడదు; 200 పేజీలకు మించకూడదు. బహుమానం పొందిన నవలనుస్వర్ణోత్సవ సంచికనుండి

నాటికకు రు **116** లు బహుమానం. ఇది సచిత్ర వారపత్రికలో 8 పేజీలకు తగ్గకుండా 10 పేజీలకు
ంకరణలు పనికిరావు.]

ాథను ద్విపదరూపంలో(పాల్కురికి, శ్రీనాథునిబాణీలలో)వ్రాసిపంపే ఉత్తమ చారిత్రకరచనకు రు **116**/—ల
వుండాలి. ఈ పోటీ రచనలన్నీ మా కార్యాలయానికి 1958 జూన్ నెలాఖరులోగా చేరాలి.

ిందజేసి సంచిక సర్వాంగసుందరంగా వెలువడడంలో సహకరించవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాము. మామూలు

టోకు వెనుకవైపు రచయిత చిరునామాతోపాటు, ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవ ప్రత్యేకసంచికకు

నక్షత్ర ఫలితాలు

(2-4-58 మొదలు 8-4-58 వరకు)

బి. నరసింగరావు

గ్రహస్థితి

ర	బు శు		
కు	సింహ, కన్య, తులా, వృశ్చికములలో చంద్రుడు		
శ			
కే		గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈవారము మీకు మిశ్రమ యోగము. ప్రతికార్యమునకు ఆటంకాలు కలుగుతాయి. ఆర్థిక స్థితి తృప్తికరముగా వుండదు. అయినను ఈశ్వరానుగ్రహంవల్ల కార్యసిద్ధిని పొందుతారు. ఉద్యోగస్థులకు అధికారుల ఒత్తిడి. వర్తకులకు అసంతృప్తి. 2, 3 తేదీలలో ఆర్థికలోపం. ఆటంకాలు. 4 న ప్రయాణము 6,7 తేదీలలో కార్యలాభము. 8 న ఇంట్లోవున్న ముసలివారికి అనారోగ్యము.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము కోర్టు వ్యవహారాల్లో అనుకూలం; తక్కిన వ్యవహారములలో ఆశాభంగము. ఆదాయాభివృద్ధికి ఎక్కువ కార్యభారమును మీద వేసుకుంటారు. ఇతరులకు ఉపకారము చేయబోయి వివాదాలకు లోనౌతారు. ఉద్యోగస్థులకు అధికారుల ఒత్తిడి; వ్యాపారస్థులకు మాంద్యము. భార్యకుగాని ఇంట్లో మరే ఇతర స్త్రీకి గాని ఆరోగ్యము సరిగా వుండనందున ఆందోళన కలుగుతుంది. 2, 3 తేదీలలో ధనలోపము, ఆటంకములు. 4 తేదీని కార్యలాభము. 5 న వివాదములు 6, 7 తేదీలలో తోటివారి సహకారము. 8 న ఆరోగ్య చింత; విద్యార్థులకు శ్రద్ధ తక్కువ.

* కృత్తిక [అ, ఈ, ఉ, ఏ] *

ఈవారము మీరు తలపెట్టిన పనులు ఫలించవు. అయినప్పటికీ పట్టిన పట్టు విడవకుండా ప్రయత్నించి కార్యసిద్ధిని పొందుతారు. ధనలోపము తీర్చుకుందికి అప్పుచేయవలసివస్తుంది. సోదరుల కుటుంబములకు సహాయపడతారు. విద్యార్థులు వినోదములలో పాల్గొని ప్రమాదాలకు లోనౌతారు. 2, 3 తేదీలలో ఆటంకములు. 4 న అప్పు చేయుటచే ధనప్రాప్తి. 5 న ఉద్యోగస్థులకు అధికారుల చురుకుమాటలచే మనోవ్యథ, 6, 7 తేదీలలో శ్రమతోకూడిన కార్యసిద్ధి, 8 న ప్రమాదభయము. భూస్వాములకు, పోలీసుశాఖ ఉద్యోగస్థులకు మేలుకాలము.

*రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈవారము మీబుద్ధిబలముచే కార్యలాభం పొందుతారు. ధనాదాయము బాగుంటుంది. మిత్రులను కలుసుకుంటారు. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుపడుతుంది. విద్యార్థులకు శ్రద్ధ కలుగుతుంది. కవులు నూతనరచనలు మొదలుపెడతారు. డాక్టర్లకు, శిల్పులకు, కళాకారులకు మేలుకాలము. 2, 3 తేదిలలో ప్రయాణమువల్ల శ్రమ. 4 న మిత్రదర్శనము. 6,7 తేదీలలో యత్నకార్యలాభము; 8 న అశాంతి.

*మృగశిర [వే, వో, కా, కీ] *

ఈవారము మీ అధికారము పెరగడముతో ఆదాయము కూడా వృద్ధి అవుతుంది. యత్నకార్యములు సిద్ధిస్తాయి. పండిత సాంగత్యము వల్ల విజ్ఞానవిషయాలు తెలుసుకుంటారు. పిల్లల క్షేమాభివృద్ధివల్ల ఆనందము పొందుతారు! విద్యార్థులు శ్రద్ధగా విషయాలు నేర్చుకుంటారు. ఉపాధ్యాయులకు, పండితులకు న్యాయవాదులకు, కళాకారులకు యోగకాలము 2, 3 తేదీలలో తిరుబాటులేని కార్యక్రమము. 4 న భాగ్యయోగము 5 వ తేదీని ఆటంకములు 6, 7 తేదీలలో కార్యసిద్ధి.

ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] * *

ఈ వారము మీకు యోగదాయకము. ఇదివరకు కలిగిన చిక్కులు తీరిపోతవి. మాతృవర్గమునుండి సహాయము కలుగుటచే ధనలోపము తీరుతుంది. ప్రయాణము చేయవలసి వస్తుంది. బంధువులతో శుభకార్యాలోచనలు చేసి మృష్టాన్న భోజనముతో వినోదిస్తారు. ఇంట్లోవున్నవారి ఆరోగ్యము బాగుపడుతుంది. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ కలుగుతుంది. వెండినగలు, బియ్యము, నూలు, బట్టలవర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలం. 2, 3 తేదీలలో ప్రయాణము, అశాంతి. 4 న ధన లాభము. 5 న అలసట. 6, 7 తేదీలలో శుభకార్యాలోచన, వినోదము.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము మీకు యోగదాయకము. గతవారము అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభకరముగా ముగియుటే కాకుండా నూతన కార్యారంభము చేస్తారు. పరోపకారము చేస్తారు. వాహనయోగము కలుగుతుంది. బంగారము, వజ్రములు, మొదలగు ఖరీదైనవస్తువుల వర్తకులకు లాభయోగము. బట్టలవర్తకులకు కూడా యోగకరము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. 2, 3 తేదీలలో తీరికలేని కార్యక్రమము. 4 తేదిని నూతన కార్యారంభము. 5 న బడలిక 6, 7 తేదీలలో కార్యలాభము, ధనయోగము, విందు, వినోదము.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము అన్నిరంగములలోనూ ఆటంకములు కలుగును. కార్యభారము ఎక్కువగుటచే త్రిప్పట. అకాలభోజనము. శరీరములో అస్వస్థత. ఆరోగ్యభంగసూచనలు కనబడగానే శ్రద్ధవహించండి. విద్యార్థులకు చదువుపై అశ్రద్ధ. గోధుమలు మొదలగు ఆహారధాన్యముల వర్తకులకు లాభదాయకము. రాజకీయవాదులకు మేలు. అధికారులకుపయోగము. 2,3 తేదీలలో ఆటంకములు. 4 న పితృవర్గ సహాయము. 6,7 తేదీలలో కార్యలాభము. 8 న అనారోగ్యము.

* ఆశ్రేష [డీ, డూ, డే, డో] *

ఈ వారము మీకు అంతయోగకరము కాదు. కార్యసాధనలో అనేక ఆటంకములు కలుగుతాయి. మిత్రులెవరో శత్రువులెవరో తెలుసుకోలేకపోతారు. ప్రయాణము చేయవలసి వస్తుంది. ఉపకారము చెయ్యాడని అనుమానించిన వ్యక్తి సహాయమువల్ల వారాంతమందు కార్యసిద్ధిని పొందుతారు. వ్యాపారస్థులకు ఆటంకములు; విద్యార్థులకు శ్రద్ధ తక్కువ 2,3 తేదీలలో కార్యభంగము. 4 న ప్రయాణము. 6,7 తేదిలలో ఆకస్మిక మిత్రసహాయము, కార్యసిద్ధి. విదేశీయుల పరిచయము, విచిత్రవస్తు సంపాదన. 8 న ఆత్మీయుల అనారోగ్యముచే మనోవ్యథ.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈ వారము మీకు మిశ్రమయోగం. యత్న కార్యములకు ఆటంకములు వచ్చినా చివరకు ఫలిస్తాయి. గృహావసరములు తీరక ఇంట్లో వారికి అసంతృప్తి కలుగుతుంది. విద్యార్థులకు చదువు సవ్యముగా జరగకపోయిననూ నూతనాంశాలను నేర్చుకుంటారు. 2,3 తేదీలలో నిలకడలేని స్థితి, శ్రమ. 4 న ప్రయాణము: 5 న ఆత్మీయుల కోపము. 6,7 తేదీలలో కార్యలాభము. 8 గృహమందున్న వారిలో ఒకరి అనారోగ్యమువల్ల వ్యథ.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ,]

ఈ వారము మీ ఆదాయాభివృద్ధికి ఎక్కువ కార్యభారమును మీద వేసుకుంటారు. కార్యములు నెరవేరక ఆశాభంగము పొందుతారు. కోర్టు వ్యవహారములు కొంతవరకూ అనుకూలిస్తవి. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి కలిగిననూ తోటివారి సహకారమువల్ల తగుతుంది. వ్యాపారస్తులకు లాభము తక్కువ. భార్యకుగాని ఇంట్లో మరే స్త్రీకిగాని ఆరోగ్యము చెడే సూచనలున్నవి. వ్యవహారముపట్ల స్త్రీలతో పేచీలు వస్తవి. 2,3 తేదీలలో కార్యములపట త్రిప్పట, శ్రమ, 4 న స్వల్ప కార్యసిద్ధి; 5 న వివాదము. 6,7 తేదిలలో తోటివారి సహకారము. 8 న ఆరోగ్య చింత.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీకు అంత యోగదాయకము కాదు. ప్రతి పనికీ ఆటంకము కలుగుతుంది. కాని పట్టుదలతో ప్రయత్నించి తుదకు ఫలసిద్ధిని పొందుతారు. సమయమునకు అనుకున్న డబ్బు రాకపోవుటచేతను సోదరులకు సహాయము చేయలేక చింతిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల పోటుమాటలవల్ల మనో వ్యథ. అవయవములకు ప్రమాదము కలిగే సూచనలున్నవి; జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, ఇంజనీరింగు శాఖవారికి, భూస్వాములకు శ్రమ ఎక్కువగా వున్నా మేలుగా వుంటుంది. 2, 3 తేదిలలో త్రిప్పట, శ్రమ. 4 న రూపొందిన కార్యక్రమము. 5 న ప్రమాదభయము. 6, 7 తేదిలలో కార్యలాభము.

* హస్త [పూ, ష, ణా, ఠ] *

ఈ వారము మీ పలుకుబడివల్ల కార్యానుకూలతను పొందుతారు. ఆర్థికస్థితి బాగుపడుతుంది. నూతనమిత్రలాభము కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఆదరణ కలుగుతుంది. కవులు నూతనరచనలు ప్రారంభిస్తారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. డాక్టర్లకు, గణితశాస్త్రజ్ఞులకు, నటీనటులకు యోగకాలము. 2, 3 తేదిలలో నిలకడలేని కార్యక్రమము. 4 న ప్రయాణము. 6, 7 తేదీలలో ధనలాభము. కార్యసిద్ధి.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీకు ధనయోగము కలుగుతుంది. కోర్టు వ్యవహారములలో అనుకూలముగా రాజీపడతారు. పండిత గోష్ఠివల్ల, గ్రంథ పఠనంవల్ల విజ్ఞానము వృద్ధి పొందుతుంది. పిల్లల క్షేమాభివృద్ది సంతోషమునిస్తుంది. విద్యార్థులు ఉత్సాహముతో చదువుకుంటారు. ఉద్యోగస్తులకు హోదా పెరుగుతుంది. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు, కళాకారులకు మేలుకాలం. 6, 7 తేదిలలో ధనాదాయము, కార్యసిద్ధి మొదలగు యోగములు.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీరు తలపెట్టిన కార్యములు సఫలమవుతాయి. ఆర్థికస్థితి బాగుంటుంది. బంధుమిత్రులతో కలసి వినోదాల్లో పాల్గొంటారు. శుభవార్త వింటారు. బియ్యము, వెండి, నూలు, బట్టల వర్తకులకు యోగకాలము. విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఎక్కువవుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు మేలుకాలము. 2, 3 తేదీలలో మానసికాందోళన. 4 న ప్రయాణము 6, 7 తేదిలలో బంధుసమాగమము, శుభకార్య నిశ్చయము, మృష్టాన్న భోజనము, వినోదము.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము అనుకున్న పనులు ఏ ఆటంకములు లేకుండా నెరవేరుతవి. ఇతరులకు మేలుచేయుటచేత మీకు కీర్తి కలుగుతుంది. బంధుమిత్రులతో కలసి విందు, వినోదములలో పాల్గొంటారు. వాహన యోగము కలుగుతుంది. ఉద్యోగస్తులకు హోదాతో ఆదాయముకూడా పెరుగుతుంది. బంగారము, వజ్రములు, నవరత్నములు మొదలగు విలువగల వస్తువుల వర్తకులకు లాభం. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 2, 3 తేదీలలో తీరుబడిలేని కార్యక్రమము. 5వ తేదీని అధికఖర్చులు. 6, 7 తేదిలలో ధనయోగము, లాభము, కార్యసిద్ధి.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము ఆదాయాభివృద్ధికి మీరు చేసే ప్రయత్నాలకు ఆటంకములు కలుగుతాయి. కార్యభారము ఎక్కువవుతుంది.

ధరలు:

నూలు, వస్త్రములు: మార్పు లేదు.

నూనెదినుసులు: మందముగా వుండును.

బెల్లము, పంచదార: కొంచెము హెచ్చు తక్కువలలో వుండును.

చింతపండు: మార్పు లేదు.

ఆహార ధాన్యములు: కొంచెము హెచ్చును.

పప్పు దినుసులు: నిలకడగా వుండును.

వెండి, బంగారము: స్వల్ప తేడాలో వుండును.


* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలుగనివారు నామనక్షత్రము (వారి వారి పేర ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృషీకేశను పేరునకు స్వాతియూ, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకు డనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

ఉష్ణాధిక్యమువల్ల అనారోగ్య సూచనలు కనబడగానే శ్రద్ధవహించిన మేలు. గృహావసరము తీరేందుకు సరిపడే ఆదాయము లేక అసంతృప్తి కలుగుతుంది. విద్యార్థులకు శ్రద్ధతక్కువ. అధికారములోవున్న ఉద్యోగస్థులకు, రాజకీయవాదులకు మేలుకాలము. 2, 3 తేదిలలో త్రిప్పట, ఆటంకములు, శ్రమ. 4 న రాజకీయాలలో వారికి జయము. 5 న గృహకలతలు. 6, 7 తేదిలలో స్వల్పయోగము. 8 న ఆరోగ్యభంగము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము నిలకడలేని ఆలోచనలతో సతమతమవుతారు. ధన లోపమువల్ల కూడా చిక్కులలోపడతారు. శ్రమ పడినప్పటికీ మాట దక్కదు. గృహమందున్న ముసలివారి అనారోగ్యము ఆందోళనకలిగిస్తుంది. ఆకస్మికమిత్రుని సహాయమువల్ల కొన్ని చిక్కులు తొలగి ఫలసిదినిపొందుతారు. అనుకోకుండా ప్రయాణము చేయవలసివస్తుంది. విద్యార్థులకు చదువుపై ఆసక్తి తక్కువ. వర్తకులకు వారాంతమున లాభం. 2, 3 తేదిలలో అమితఖర్చులు. 4 న కొంత శాంతి; 5 న ప్రయాణముచే శ్రమ. 6, 7 తేదిలలో నూతన మిత్రదర్శనము, కార్యలాభము. 8న ఆరోగ్య చింత.




పాండ్స్

డ్రీమ్‌ఫ్లవర్ టాల్క్

మిమ్మల్ని రోజంతా హాయిగా మరియు సువాసన వెదజల్లుతూ ఉంచుటలో సాటిలేనిది

ఉత్సాహమునిచ్చే, పరిమళముగల పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్కమ్ పౌడరు వాడితే తీక్షణమైన ఎండలో చికాకు పుట్టించే వాతావరణములో కూడ మీకు చల్లగా, హాయిగా ఉంటుంది. ఈ మెత్తని పౌడరును ఒళ్లంతా రాసుకొంటే చెమట వలన కలిగే చికాకు లేకుండా మీరు రోజంతా ఉత్సాహముగా మరియు హాయిగా ఉంటారు. రోజంతా హాయిగా ఉండుటకు ఎల్లప్పుడూ పాండ్స్ డ్రీమ్‌ఫ్లవర్ టాల్కమ్ పౌడరునే వాడండి.

చెస్‌బ్రో-పాండ్స్ ఇన్ కార్పొరేటెడ్
పరిమితమైన బాధ్యతతో. యు.ఎస్. అమెరికాలో
సంస్థాపితము.



మార్చి 1 న హైదరాబాదు సాయం కళాశాల తెలుగు సారస్వత సమితి వార్షికోత్సవ సందర్భంలో నృత్యప్రదర్శనం చేసిన కుమారి సూర్యకుమారి.

★ నక్షత్ర ఫలితాలు ★

* మూల [యే, యో, బా, బీ]

ఈవారమువల్ల ఇదివరకు ఉపకారము పొందినవారే మీపనులు నెరవేరకుండా అడ్డు వస్తారు. అయిననూ దైవమును నమ్మి కార్యసిద్ధిని పొందుతారు. ఉద్యోగస్థులకు నేర్పరితనమువల్ల కార్యానుకూలత కలుగుతుంది. వర్తకులకు ఆందోళనగా వుంటుంది. 2, 3 తేదిలలో మోసపోవుట, 4 నూతనులతో పరిచయము. 5 న అధిక ఖర్చులు. 6, 7 తేదీలలో ఆత్మవికాసము, కార్యలాభము. 8 న ఇంటోవారి ఆరోగ్యము సరిలేక చింత.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈవారము కార్యభారముచే శ్రమ ఎక్కువ. మీపనులు నెరవేరక బాధపడుతూ కూడా ఇతరులకు సహాయం చేసేందుకు ప్రయత్నించి సఫలముకాక నిందలపాలవుతారు. కోర్టు వ్యవహారములు మీపరముగా తీర్పు అయినా ఖర్చులు ఎక్కువగుటచే అలాభము వుండదు. భార్య ఆరోగ్యము సరిగా వుండనందున ఆందోళన. అన్ని రంగములలోనూ అసంతృప్తిగా వుంటుంది. 2, 3 తేదీలలో శ్రమ, 4 న స్వల్పలాభము. 5 న వివాదములు. 6, 7 తేదీలలో కార్యలాభం. 8 న ఆరోగ్య చింత.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీ ప్రయత్నములు ఫలించక అనేక చిక్కులు కలుగుతాయి. పట్టుదలతో సాధించి ఫలమును పొందుతారు. తోబుట్టుల సహాయమువల్ల చాలావరకూ ధనలోపం తీరుతుంది. అధికారుల ఒత్తిడిచే ఉద్యోగస్థులకు వ్యధ. యంత్రములు, అగ్ని మొదలగువాటివల్ల కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. భూస్వాములకు, గనుల యజమానులకు మేలుకాలము 2, 3 తేదీలలో కార్యభంగము 5 న మనోవ్యధ 6, 7 తేదిలలో బంధు సహాయము, కార్యలాభము. 8 న ప్రమాదభయం.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము మీ బుద్ధిబలముచే మీ ఆశయాలను కార్యరూపములో పెట్టి సాధిస్తారు. జ్ఞాతులవల్ల కార్యసహాయము, ధనసహాయము కూడా కలుగుతుంది. రక్తబంధువుల కుశలవార్త తెలిసి సంతోషము పొందుతారు. ఉద్యోగస్థులకు హోదా పెరుగుతుంది. విద్యార్థులకు శ్రద్ధ కలుగుతుంది. వైద్యులకు లాభము. కవులకు, గణితశాస్త్రజ్ఞులకు, చిత్రకారులకు, నటీనటులకు యోగము. 2, 3 తేదీలలో ఆలోచనలు తెగని కార్యక్రమము; 4 న మిత్రసహాయము 6, 7 తే లో ప్రయాణము, ధనలాభము, కార్యసిద్ధి. 8 న అలసట.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

ఈ వారము ఉత్సాహముతో కొత్త పనులను మొదలుపెడతారు. ధనాదాయము ఎక్కువవుతుంది. కోరువ్యవహారములు లాభిస్తాయి. పిల్లల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమము, ఏర్పరుస్తారు. ఉద్యోగస్థులకు అధికారుల ఆదరం లభిస్తుంది. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. 2, 3 తేదిలలో విరామములేని కార్యక్రమము. 4 న ఉద్యోగస్థులకు మేలు. 6, 7 తేదిలలో ధనలాభము, కార్యసిద్ధి పండితగోష్ఠి. ఉపాధ్యాయులకూ, న్యాయవాదులకూ, నటీనటులకు యోగకాలము.



నక్షత్రఫలితాలు

*శతభిషం [గో, సా, సీ, సూ]

గతవారములోకన్నా ఈ వారము ఆర్థిక స్థితి ఎక్కువ అవుతుంది. తలపెట్టిన పనులు నెరవేరుతాయి. బంధుమిత్రులతో కలిసి, కవితాగోష్ఠి, గానసభలు మొదలగు వినోదములలో పాల్గొంటారు. మృష్టాన్న భోజనము ఆరగిస్తారు. విద్యార్థులకు చదువు ఉత్సాహముగా సాగుతుంది. బియ్యము, నూలు, బట్టలు, వెండిసరుకుల ధరలకు 4, 5, 6, 7 తేదీలలో లాభయోగము. కవులకూ, గాయకులకూ, నటీనటులకూ మేలుగా వుంటుంది. 8 న మానసికాందోళన కలుగుతుంది.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈవారము మీరు తలపెట్టిన కార్యములు ఫలిస్తాయి. ధనలాభము కలుగుతుంది. సాంఘికముగా మీకీర్తి ఎక్కువవుతుంది. పుణ్యకార్యములు చేస్తారు. మీకు వాహనయోగము, మీ భార్యకు అలంకారప్రాప్తి. పట్టుబట్టలు, బంగారము, నవరత్నములు మొదలగు విలువగల సరుకుల వర్తకులకు 4, 5, 6, 7 తేదీలలో లాభయోగము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. 8 వ తేదిని ఆందోళనగా వుంటుంది.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]*

మీ ఆదాయము వృద్ధిచేసుకుంది! చేసే ప్రయత్నాలకు ఆటంకములు కలుగుతాయి. గృహావసరము తీరక కలతలువస్తాయి. అకాల భోజనమువల్ల అనారోగ్యసూచనలు కనబడగానే రవికి శాంతిచేయించండి. అందువల్ల మేలుకలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారము పెరుగుతుంది. 2, 3, 5 తేదీలలో వర్తకులకు ఆందోళన. 4, 6, 7 తేదీలలో రాజకీయములలో వారికి అనుకూలము. 8 వ తేదీని ఆరోగ్యభంగము.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈవారము మీకు మిశ్రమయోగము. అనుకున్నటు కార్యములు జరుగవు. నమ్మినవారు తటస్థముగావుంటారు. ఎవరినినమ్మవచ్చునో, ఎవరిని నమ్మకూడదో అని మథనపడతారు గాని ప్రయాణములో కలిసిన మిత్రుని పరిచయమువల్ల వారాంతమునకు కార్యానుకూలత కలుగుతుంది. ఇంట్లోవారి అనారోగ్యము ఆందోళన కలిగిస్తుంది. 2, 8 తేదీలలో ఆటంకములతోకూడిన కార్యక్రమము. 4 ప్రయాణము. 6, 7 తేదీలలో మిత్రసమాగమము, కార్యలాభము, విచిత్ర వస్తుసంపాదన, విదేశీయులతో మైత్రి. 8 వ తేదీని ఆరోగ్యచింత. ★



వనితాలోకం

అప్పుచేసి పప్పుకూడు

ఈమధ్య మేము ఇల్లు మారాము. కొత్తఇల్లు సదుపాయంగానే వుందిగానీ అక్కడ వున్న ఇరుగుపొరుగు వారితో చాలాబాధగా వుండేది. ఎందుకంటె ప్రతిరోజూ వాళ్ళు ఏదో ఒక వస్తువు అడుగుతూనే వుండేవారు. పోనీ ఆ అడిగేవస్తువు అప్పుగా యివ్వమంటె ఒకవేళ "మాకు అప్పుఇవ్వటము అలవాటు లేదు కావలిస్తే కొస్త వూరికే పట్టుకెళ్ళండి" అని అంటె ఇక ఎప్పుడూ అప్పుకి రారుకదా అని అలా అనటానికయినా వాళ్ళు అప్పుగా ఇవ్వమని అసలు అడగరు. పరికదా 'కొస్త వుంటే పెడుదురూ మా యింట్లో అయిపోయాయి అది లేకపోతే వండినవి రుచిగా వుండవు' అంటారు. లేవు అంటే మీ యింట్లో ఏవస్తువుంటే అది యివ్వండి. ఏమిచేస్తాము వాటితోనే సరిపెట్టాను అంటారు ఉద్ధరిస్తున్నట్లు. ఒకవేళ అప్పు ఇవ్వమంటే యిస్తాము అనుకోండి మళ్ళా మనము అడిగేవరకూ ఇవ్వరు. పోనీ తీసుకున్న వస్తువు వాళ్ళకి యిచ్చేయాలి అన్న అభిప్రాయమే వుండదు. ఈ బాధలు పడలేక ఒకొక్కసారి ఇస్తాను. ఒకొక్కసారి వున్నప్పటికి మాయింట్లోగూడా అయిపోయాయి అని సాగనంపుతాను. ప్రతిది కొస్త పెట్టమని వస్తే ఎంతకని సర్దగలము, మనకేమయినా వూరికే వస్తున్నాయా? అన్నీ మహాప్రియంగా వున్న ఈ రోజులలో ఒకరికి దానాలు చేయాలంటె చాలా కష్టము.

ఒక్క ఇరుగుపొరుగులోనే కాకుండా మావారితో కూడ ఈ విషయాల్లో ఇబ్బంది వుంటుంది. అది ఏమిటంటే ఎవరైనా డబ్బు అప్పు అడుగుతే చాలు ఇంట్లో వున్నది లేనిది కూడ చూడకుండా వారికి ఇచ్చేస్తారు. ఒకవేళ చేతిలో లేకపోయినా పరిచయము వున్న వారి దగ్గరైనా తను తీసుకొని అప్పు అడిగిన వారికి యిస్తారు.

తనకు మాలిన దానమూ అన్నట్లు, 'మీ దగ్గరవుంటే యివ్వండి లేకపోతే లేదని చెప్పండి' అన్నానా, "నాకు లేదని చెప్పే అలవాటులేదు. నోరు తెఱచి అడిగేవానికి లేదని ఎట్లా చెప్పను" అని అంటారు. నేను నోరు మూసుకు వూరుకుంటా. పైగా యింట్లోకి కావలసిన ముఖ్యమైన వస్తువులు ఏమైనా లేవలసివస్తే పచారి షాపుల్లో అరువు తీసుకొస్తుంటారు. నాకు అరువుతీసు

ఎం. ప్రభావతిదేవి

(బందరు)

కోటమంటే యిష్టముండదు. చేతిలో డబ్బు ఒకరికి యివ్వటము యెందుకు అరువుతీసుకుని బాధపడటము దేనికి. రొక్కమిచ్చే తీసుకురండి అంటె వినరు. పైగా, "మనకు ఈ ఊరిలో వున్న ఉద్యోగస్థ అందరికంటె చాల తక్కువగానే అప్పువుంది కాని ప్రతి ఉద్యోగస్థునకు పచారి కొట్లలో నేగాక కాఫీ హోటల్సులో కిళ్ళీ కొట్టుల్లో యింకా చాలచోట్ల వందలకొలది అప్పులుంటాయి. మనకు వున్న ఈ కొద్ది అప్పుకే తల్లడిల్లి పోతావు మరి వాళ్ళ సంగతో" అంటారు.

అందరిలాగే మనమూ ఎందుకు అప్పుచేసి జీవించాలి. మనకు సాధ్యమైనంతవరకూ అప్పులేకుండానే గడవవేము చూసుకోవాలి కాని అందరూ అప్పుచేస్తున్నారని మనమూచేస్తే అందులో గొప్పేమివుంది, అని నా వాదన.

చాలమంది అప్పుచేసి కాలము నెట్టుకొస్తుంటారు. కాని చూసిమూసి చేసిన బాకీ త్వరగా తీర్చలేరు. తీర్చే తాహతులేకాదు వాళ్ళు ఎగగొట్టేది. తీసుకున్నప్పుడు వున్న సంతోషము, ఇచ్చేటప్పుడు వుండదు. అంతే. ఆతర్వాత ఎప్పుడో ఇవ్వవచ్చులే వాళ్ళు తొందరచేయటం లేదుగా అని నిర్లక్ష్యంగా వుండి చేతిలో డబ్బు పుష్కలంగా వున్నప్పటికీ యివ్వరు. మాయింటి ప్రక్కన ఒకాయన వుండేవాడు. ఆయన యెప్పుడూ జల్సాగ తిరుగుతాడు. షోకుగా బట్టలగకుండా అతిబడాయిగా వుంటాడు. పైగా అట్లాతిరిగేది కాకుండా పరిచయము వున్నవాళ్ళందరితో కూడ, "బ్రతికినన్నాళ్ళు దర్జాగ బ్రతకాలోయ్ బ్రదర్. మాసేవాళ్ళందరూ షెబాష్ అని మెచ్చుకోవాలి. బ్రతికేకొన్నిదినాలు మూడు పువ్వులు ఆరుకాయలుగా వుండాలికాని మనపిల్లలు బాగుపడాలి అని వారికోసము, ఇప్పటినుంచి ఒక్కొక్కకాణీ దాచిపెట్టటము చాల తెలివితక్కువతనము. మనము తినగా మిగిలిందే వాళ్ళకి" అని ఉపన్యసిస్తాడట.

పైగా నేను తిన్నట్లు మీరు కూడ తింటేనా? వాలాగవుండమన్నా వుండలేరు. అసలు నేను తినేతిండి మీరు తినలేరుగా. మీలాగ ఈసురోమంటూవుంటే చూడలేము. నన్ను చూడండి ఎట్లా వున్నానో. నాకు రెండుమూడు కూరలు లేనిదే అన్నము తినలేను. ఈ రోజు మాయింట్లో కూరలుమాస్తే మీరు నోరు తెరవాల్సిందే. చేప పులుసు, రొయ్యలవేపుడు, మాంసపు కుర్మా ఇంకా డబ్బు చాలలేదుకాని ఇంకా యాపిల్ పండ్లు కూడ తెప్పించేవాడిని. ఈ రోజులలో విరివిగా పండ్లు తాజాగ వున్నయి, తప్పకుండా తినాలోయ్ అంటాడు. అనక, బ్రదర్! ఒక్క అయిదు రూపాయలువుంటే ఇయ్యి ఓయ్. రేపు సాయంత్రానికి ఇచ్చేస్తాను.

(42- వ పేజీ చూడండి)

అసలు పేర్లూ ★

మా సరోజకు మగపిల్లాడు పుట్టాడని చెప్పగానే వాళ్ళనాన్నగారు, "పానకాలే పుట్టాడా? నేననుకుంటూనే వున్నాను" అన్నారు. ఎంతో చక్కచక్కని పేర్లుండగా మనమడికి పానకాల పేరేమిటండీ అన్నాను. వాడు రెండురోజులకి పుడతాడనగానే మంగళగిరి పానకాల స్వామి కలలో కనుపించాడు. అంచేత స్వామిపేరే పెట్టాలన్నారాయన. ఆయన నమ్మకమల్లాటిది. కానీ మా సరోజకీ దాని మొగుడికీ ఈ పేరెంతమాత్రము యిష్టము లేదు. ఒక్క మా యింట్లోనే కాకుండా కొత్తగా పేరుపెట్టాలంటె ఈలాగే వుంటుంది ప్రతియింట్లోను.

లేక లేక పిల్లలు పుట్టడము, పుట్టినపిల్లలు బ్రతకకపోవటమువంటి వాటివల్ల మొక్కుబడులు అవీ ఉంటేతప్ప శిశువు పుట్టగానే (ఆడో, మొగో తేలుతుంది కాబట్టి) ఇహ పేరేమిపెట్టాలా అని తాపత్రయపడతాము మొట్టమొదట, ఆ మధ్య మా స్నేహితురాలి కొడుకు బారసాల అయితే వెళ్లాము.

దానికి వాళ్ళ నాన్న పేరు పెట్టాలని, వాళ్ళాయనకు ఆయన తండ్రి పేరు పెట్టాలనీ, సరే వాళ్ళత్తగారికి ఇలవేల్పయిన ఏడుకొండలవాడి పేరు పెటాలని ఉంది. ఇంతమంది కోరిన పేర్లు ఆ ఒక్క పిల్లాడికే పెటాలి. చివరకి ఆలోచించి ఆ ముగ్గురి కోర్కెలు తీరేట్టుగా మాతామహపితామహ ఇలవేల్పుల మూడు పేర్లు కలిసేట్టుగా వెంకటరామక్రిష్టారావు అని పెట్టారు. దానితో ముగ్గురు సమాధానపడ్డారు. అల్లా కాకుండా ముగురిలో ఎవరో ఒకరి కోరిక ననుసరించి పేరు పెట్టినట్లయితే ఎల్లా వుండేదో?

తమాషాగా వుండే చిన్న కథ ఒకటుంది పేర్ల గురించే. ఓసారి ఒకరి యింటికి చూసేందుకు వెళ్ళింది టొక ఇల్లాలు. అన్నీ చూసి, ఆవిడిద్దరి పిల్లల్ని చూపించి పేర్లేమిటని అడిగిందటా గృహిణిని. అందుకు జవాబు చెప్పిందిటా గృహిణి. ఎంత చక్కగా చెప్పిందీ చూడండి. "పట్టుచీర కట్టుకున్నది బంగారు తల్లి. ఆ తల్లి పేరే ఈ తల్లి" అని తల్లి పేరు పెట్టిన పెద్ద పిల్లని గర్వంగా చూపించింది.

"ఆ కూర్చున్న ముండ, పేరు కుతాపి ముండ. ఆ ముండ పేరే ఈ ముండ" అందిట అత్తగారి పేరు పెట్టిన తన రెండో పిల్లని చూపిస్తూ, ఈసడింపుగా. కనుక ఇదిచూసి, తల్లితండ్రులపేర్లు పెట్టదలచినవారు వుభయుల తల్లితండ్రుల పేర్లు కలిపి ఒకరికే పెట్టడము శ్రేయస్కరము అనిపిస్తుంది.

పేర్లనగానే నాకో తాతగారు జ్ఞాపకమొస్తారు. ఆయన పిల్లలకి పేరుపెటడము గురించి చెప్తుంటే వింతగా వింటూండేవాళ్ళము. ఆయనకి మొదట పుట్టిన యిద్దరు పిల్లలకి వరసగా తల్లీ తండ్రిపేరు పెటాడుట. మూడోసారి పుట్టిన ఆడపిలకి అత్తగారిపేరు పెట్టాలనుకున్నాడుట.

"ఎందుకు బాబూ నాపేరు పెట్టడము కోపమొచ్చినప్పుడల్లా నాపేరుపెట్టి తిట్టేందుకా" అందిట అత్తగారు.

"మరేనండత్తగారూ, ముందు పిల్లకి మాఅమ్మపేరు పెటానా. మరి మీ అమ్మాయి కోప మొచ్చినప్పుడల్లా మా అమ్మపేరుతో దాన్ని తిడుతూంటుంది. అంచేత దానికి మీ పేరుపెటి తరువాయి నేతీర్చుకుంటాను" అని అత్తగారిపేరే పెట్టాడుట ఆయన.

★ కొసరు పేర్లూ


తీరా ఆఅమ్మాయి పెళ్ళయేసరికి అత్తారికి ఆపిల్లపేరు నచ్చక విజయా అని మళ్ళీ నామకరణముచేశారు. "బాబూ కాలం మారిపోయింది. తల్లితండ్రులు పేర్లుపెట్టే కాలంపోయి అత్తారు నామకరణము చేసే రోజులొచ్చా" యంటూ డాయన నవ్వుతూ.

పుట్టిన శిశువుకి పేరు పెటడమూ, పెట్టిన పేరుని సజావుగా వినియోగించుకోవటమూ ఒక కళే ననిపించుకుంటుంది. ఆడపిల్లలకి మొగపేర్లూ (రాముడూ కృష్ణుడూ సూర్యం యిలాటివి) మొగపిల్లలకి ఆడపేర్లూ (రాధా, సుందరము) లాటివి పెట్టడము తరుచు చూస్తూంటాము. ఈ పేరుగల వ్యక్తుల్ని ప్రత్యక్షంగా చూసేవరకు ఆడో మగో నిర్ణయించుకోలేము. ఇహ మరికొంతమంది పేరుపెట్టేటప్పుడు ఓ కోతేటి చాంతాడంత పెట్టి, ఆపైన ఆ పేరంతా వదలి బుడ్డీ అనో బడ్డూ అనో ఓముద్దుపేరుతో పిలుస్తూంటారు. ముద్దుపేరు అంటే జ్ఞాపకమొస్తుంది. మా ప్రక్కయింటి వారబ్బాయి కామధ్య పెళ్లయింది. పెళ్ళికూతురు పెళ్ళికొడుకు కూడా చిన్నవాళ్లే. వాళ్ల పిల్లలందర్నీ అసలు పేరుతోనే పిలచి, ఒక పిల్లాడిని మాత్రము బుచ్చీ అని ముద్దుపేరుతో పిల్చేవారు. విని విని పెళ్ళికూతురడిగింది అత్తగార్ని, రేపు బుచ్చికి పెళ్లయితే పెళ్లికూతురు (తలుపుదగ్గిర) బుచ్చి అనే చెప్తుందా లేకపోతే మరో పేరు ఏమైనా చెప్తుందా అని, వాడి అసలు పేరు రామారావు ఆపేరే చెప్తుంది వాడి పెళ్లాము అంది అత్తగారు. తనకాపేరే బాగుందనుకుంటూ ఆ అమ్మాయి మరిదిని రామం అనే పిలుస్తూండేది. తను మాత్రము బుచ్చీ అని పిల్చినప్పుడల్లా ఆపిల్ల మాటలు జ్ఞాపకమొచ్చి నవ్వుకునే వాళ్ళము.


ఈ ముద్దుపేర్లజాపితాకు చెందినవే పాప బేబి అనే నామధేయాలు. మా పాప (లేక బేబి) కి పుట్టిన రోజనో తొట్టిలో వేసుతామనో పేరంటానికి పిలుస్తూంటారు కొంతమంది. తీరా పేరంటానికి వెళ్లి 5, 6 గురు పిల్లల తల్లయి వద్దూ, పొడుగుకలిగి అమ్మమ్మలా కనుపించే వ్యక్తే పాపని (బేబిని) తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యంతో నోరువెళ్లబెట్టి చూస్తాము. చిట్టిపాప పెద్దదయినకొద్దీ ముద్దుపేర్లు మానేసి అసలు పేరుతో పిలవటము అలవాటు చేసుకున్ననాడు ఈ అవస్థ తప్పుతుంది. ఈ కొసరుపేర్లలో మరీ తమాషా అయినవి. బుల్ బుల్ లాటి పక్షుల పేర్లూ, కరాచీ, శ్రీశైలం, సింహాచలంలాటి వూరుపేర్లూను. ఆ వూళ్లో పుట్టాడనో, ఆ వూరి దేముడి పేరనే కారణముతోనో అసలుపేరు మానేసి ఈ కొసరు పేరుతో పిలుస్తూంటారు. క్రమంగా అదే అలవాటైన ఆ వ్యక్తిని కలుసుకునేందుకు మనము వెళ్లినా ఆ కొసరుపేరు చెప్తేనే ఆ వూరివారికి గుర్తు తెలుస్తుంది. ఈ సంగతి తెలియని మనము అసలుపేరు చెప్పి ఆ ఊరు వెళ్ళి ఆ వ్యక్తిని కలుసుకోలేక కాళ్ళీడ్చుకుంటూ తిర్గి రావాల్సివస్తుంది.

అల్లాంటి కొసరుపేర్లు పెట్టుకున్నవారు అసలు పేరుతోపాటు కొసరు పేరుకూడా శుభలేఖల్లో వేయిస్తే మంచిది. ఇల్లా పెట్టే ముద్దుపేర్ల కథని ఒక హరిదాసుగారు పిట్టకథగా చెప్తూంటారు తరుచు హరికథల్లో, ఈ పులగము, నెయ్యి, చుట్టము అనే కథని ఈ మధ్యనే పత్రికలో ప్రచురించారు కూడా. మరి కొంతమంది, మంచిపేరు పెట్ట

జాకెట్లకు చమ్కీ బిళ్ళలు



(౨)



(3)

డి. సౌజన్య
(పొలిచెర్లవారి పాలెం,
నెల్లూరుజిల్లా)

చమ్కీబిళ్లలమీద తేనెపూసలు పెట్టి కుడితే అందంగా కనబడతాయి. చమ్కీబిళ్లను బట్టమీద పెట్టి సూదిని బట్ట క్రిందనించి చమ్కీబిళ్ల మధ్యవున్న రంధ్రములోనించి రానివ్వాలి. ఆ సూదికే ఒక పూస కుట్టుకొని చమ్కీ బిళ్ల మధ్యకు రానిచ్చి ప్రక్కనే సూదిని క్రిందకు గుచ్చి సన్నటి ముడివేయాలి. మొదటి డిజైను జాకెట్ చేతులమీద కుట్టుకోవాలి. రెండవది వీపుమీదకు బాగుంటుంది. రెండవ డిజైను మధ్యవున్న పువ్వును ఎరుపురంగు శాటిన్ దారంతో ముద్దకుట్టుకుట్టాలి. పువ్వుమధ్య పసుపుపచ్చ చుక్క కుట్టినా లేదా ఒక చమ్కీబిళ్ల కుట్టినా బాగుంటుంది. ఆకులు రెండూ ఆకుపచ్చదారంతో గొలుసుకుట్టు కుట్టాలి. మూడవడిజైను మెడచుట్టూ కుట్టుకుంటారు. దీనికి కాడకట్టు వేసుకోవచ్చు లేదా గొలుసుకుట్టు వేసినా బాగానేవుంటుంది.

ఒక చమ్కీబిళ్లమీద పూసపెట్టి జాకెట్ అంతా అక్కడక్కడ కుట్టుకున్నా బాగానేవుంటుంది.

డముతో తమబాధ్యత తీరిపోయిందనుకుని కొసరుపేరు పెట్టకపోయినా అసలు పేరునే రకరకాలుగా వికారపరుస్తారు. మా చుట్టాలబ్బాయిపేరు మురళీ క్రిష్ణ, వాళ్ళమ్మ వాడిని మ్రురీ, మ్రురీ, అని పిలుస్తుంది. ఆ పిలుపు విన్నప్పుడలా తేలూ జెర్రీ గుర్తుకు వచ్చి ఎల్లాంటి పేరుకి ఎల్లాంటిగతి పట్టిందా అని పిలుస్తుంది. ఇంకో అమ్మాయిపేరు సుబ్బలక్ష్మి. కానీ ఆ అమ్మాయిని సుబ్బీ అని పిలుస్తారు. పిల్లల తల్లయినా ఆ అమ్మాయి సుబ్బిగానే వుండిపోయింది. ఆ పేరేపెట్టిన ఇంకొక రమ్మాయిని సుభా అని పిలుస్తారు. సుబ్బలక్ష్మి అని పూర్తిగా పిలవలేకపోయినా సుబ్బీ అన్నదానికి సుభా అన్నదానికి తేడా లేదూ ? అసలు పిలిచే ఓపిక లేనివారు పెద్దపేర్లు పెట్టడము మానెయ్యాలి. మా పనిచేసే అప్పలమ్మకొడుకు పేరు వీరభద్రరావు, అది వాణ్ణి బాబూ ఈరబద్దరావ్ అని నోరారా పిల్చేది. పొరపాటునైనా వీరిగా అని కాని వీరయ్యా అని కానీ పిల్చేదికాదు. దాని ఓపికను మాకు ఆశ్చర్యంగా వుండేది. పేరేమి పెట్టాలనే ఆలోచనకన్నా పెట్టినపేరుని ఎల్లా వాడాలనేది ముఖ్యమంటాను. మీరేమంటారు.? ★

ఆడవాళ్లు; ఆత్మహత్యలు

మేరీ రచనపై మరో వ్యాసం ★ మన పురాణాలు కేవలం కాకమ్మ కథలు కావు

శ్రీమతి సి. హేమలత

సి.హెచ్. మేరీగారి వ్యాసం చదివినతరువాత (29-1-58 ఆంధ్ర వారపత్రికలో) భారతస్త్రీగా హైందవనారిగా సమాధానమివ్వడం సమంజసంగా తోచి ఈ జవాబు వ్రాస్తున్నాను.

మేరీగారు వ్రాసిన వ్యాసంలో రెండవ పేరాలో ఆమె పాతివ్రత్యమనేది ఆడవాళ్ల పాలిట భస్మాసురవరంగా చూపించారు. అశోకవృక్షంక్రింద సీత "హా" అని తన భర్త అయిన శ్రీరామచంద్రమూర్తికోసం విలపించటం వీరి ఉద్దేశంలో తప్పు. పాతివ్రత్య బిరుదుకోసం సీత అలా నటించిందని అభిప్రాయమేమో. తనకంటికి అష్ట ఐశ్వర్యాలతో కనిపించిన రావణాసురుడితో సీత కులుకుతూంటే మేరీగారు సంతోషించి ఉండేవారేమో! అంటే ఈ కాలపు లెక్క ప్రకారం భర్త ఇంట లేనప్పుడు పరపురుషునితో విహరించడం సమంజసమని వీరి వాదమేమో? "ఏ కాలంలోనైనా, ఏ నాడులోనైనా ప్రేమించిన పురుషుని కోసం ప్రాణాన్నైనా సమర్పింపడానికి స్త్రీ వెనుకంజవేయదు" అన్న చిన్న విషయాన్ని మేరీగారు ఎందుకు అర్థం చేసికొనలేకపోయారో అర్థంకాదు.

సూర్యగమనాన్ని నిరోధించింది. అగ్నిజ్వాలలు ఖండించింది యముని ఇరకాటంలో ఇరికించింది స్త్రీ. ఇదంతా భర్తకోసమే చేసింది గాని, పాతివ్రత్యమనే బిరుదుకోసం గాదు. ఈ నాడు మన ప్రభుత్వం భారతరత్న, పద్మవిభూషణ మొదలగు బిరుదులు నెహ్రూ ప్రభృతులకు ఇచ్చింది. కాని ఈ త్యాగమూర్తులు ఈ బిరుదుల కాసించా భారతస్వాతంత్ర్య సమరంలో తమ సర్వస్వము సమర్పించింది? పైవిధంగానే త్యాగమూర్తులైన స్త్రీజనానికి ఆనాటివారు పాతివ్రత్యమనే బిరుదు తగిలించారు. ఈనాడు కూడా జూదంలో ఉన్న ఆస్తులన్నీ అమ్ముకొని భార్యకు ఆ కట్టుకున్న చీరకూడా లేకుండా చేసేవారు ఎంతమంది లేరు? ఒకసారి మేరీగారు మన భారతగ్రామాలని పరిశీలించితే అలాంటి పురుషులని సైతం ప్రేమించే భార్యలు ఎంతమంది వున్నారో విశదమవుతుంది. వారలాగ ప్రేమించడానికి కారణం పాతివ్రత్యమనే బిరుదుకోసమా! అడవులైనా, అంతఃపురాలైనా అనుకూలవంతుడైన భర్త సాన్నిధ్యాన్నే భార్యకోరుతుంది గాని భర్త కష్టాల్లో ఉన్నప్పుడు తను సుఖపడాలని ఏ స్త్రీ కోరుతుంది? అలాంటి హృదయమే స్త్రీకి ఉన్నట్లయితే, ద్రౌపది ఏనాడో దుర్యోధనునిపజ్ఞ జేరివుండేది. అతడా ఎఱ చూపించాడు కూడా. నిండుసభలో కట్టుబట్ట వూడదీస్తున్నా, పాండవులు వూరకున్నది దద్దమ్మలై గాదు

> వచ్చే వారం!
> తనపై విమర్శలకు
> మేరీ
> సమాధానం

కాపాడశక్తిలేక కాదు. మాటకు కట్టుబడిన త్యాగమూర్తులు వారు. వారా నిమిషంలో దుర్యోధనునికి బానిసలు. బానిసలు ప్రభువుపై కత్తిదూయడం ప్రభుద్రోహం అన్న మాటకు కట్టుబడినవారు. తదుపరి అవకాశం వచ్చినప్పుడు వారి ప్రతీకారక్రోధాగ్నికి కౌరవులు ఆహుతికాలేదా? హిందువుల భారత రామాయణములు కాకమ్మకథలని మేరీగారు అన్నారు. ఇవి కాకమ్మ కథలైతే, ఇలాంటి కాకమ్మకథలెన్నో వారి పవిత్ర బైబులు గ్రంథమునందును గలవే! ఒక మతమును మనస్సునందుంచుకొని సాంఘిక విషయమును చర్చించుట మేరీగారికి తగునా?

భర్త స్త్రీకి పరమదైవమని మన హిందూ పురాణాలు చెప్పేమాట నిజమే. పై విషయమును "స్త్రీలనోటదుమ్ముకొట్టుటే" అన్నట్లు మేరీగారు విమర్శించారు. స్త్రీకి పరపురుషులు దైవము, స్త్రీకి ప్రాతివ్రత్యము అవసరము. భర్త రోగిష్ఠి అయినచో కొంతకాలము కాపురము చేసిన పిమ్మట వానికి విడాకు తివ్వవలెను, అని పురాణములు వ్రాసిన స్త్రీల నోటి కది తేనెపూసినట్లగునా? పైవిషయమును ఏ భారతస్త్రీ అయినను, కాదు కాదు, ఏ స్త్రీ అయినను హర్షించునా? అవివాహిత కుంతిని కాలుజారినవాళ్ళకు ఆదర్శసతిగా హైందవులు నిలబెట్టలేకపోయినందుకు మేరీగారు బాధపడారు. అలా కాలుజారిన మేరీసతిని (ఏసుక్రీస్తు మాత) క్రైస్తవ పురాణాలు అంతస్తుకు ఎత్తాయి! అలాగే హిందువులు చేయలేదని మేరీగారి బాధ? స్త్రీకి ఐదుగురు భర్తలుండటం ఈనాటి సాంఘిక పరిస్థితులదృష్ట్యా విడ్డూరమనిపించవచ్చు. కానీ ఆనాటి సమాజం ఆ విషయాన్ని హర్షించింది. ఈనాడు స్త్రీలు పరపురుషునితో నృత్యం చెయ్యడం నాగరికతాలక్షణమనుకుంటున్నాం. ఈ విషయాన్ని ఆ పాండవులు చూచినచో విడ్డూరంగా చెప్పకుందురేమో! కొన్ని శతాబ్దాలనాటి సాంఘికవిషయాన్ని ఈనాడు మనం చర్చించడం ఏమంత బాగుంటుంది చెప్పండి? ఈనాడుమట్టుకు విడాకులనే పేరుతో ఐదుగురుకి మించిన భర్తలతో కులుకుతున్న స్త్రీ ఏమంత ఆదర్శసతో? ఇంతచిన్న విషయాన్ని గుర్తించలేని మేరీగారు "ఇంకెవరిది ఆదర్శం, ఇంకెవరు దిక్కు?" అని బాధపడారు. పై విషయాలు మినహాయించి మేరీగారు వ్రాసిన వితంతు వివాహాలు పతిసహగమనము, ప్రేమించిన పురుషుని వివాహము చేసుకొనడము అన్న విషయాలను గురించి బాగానే వ్రాశారు. ఆడవాళ్లలో ఆత్మహత్యలు ఎక్కువ కావడానికి కారణాలు మనం స్థూలదృష్ట్యా చూచినట్లయితే మూడు విషయాలు గోచరమవుతాయి.

1. కాలుజారిన స్త్రీలు :—ఈ వర్గానికి

మొద్దు పేర్లు, ముద్దు పేర్లా

సాధారణముగా మన తెలుగువారిలో చిన్న పిల్లల్ని ముద్దుకోసమైతే నేమి లేక పెద్ద పేరుతో పిలవడం బద్ధకంచేతనైతే నేమి ఉన్న పేరు చెడకొరికి ఏదో తోచినట్లు పిలవడం. చివరికి పెద్దయినా కూడా అదే పేరు అందరూ పిలవడం పరిపాటైపోయింది.

ఒక అమ్మాయి చిన్నప్పుడు చాలాలావుగా వుండేదట. అందరూ బుగ్గలబూరెమ్మ అని అంటూవుండేవారట. ఆఖరుకి అందరూ అదే అలవాటైపోయి బూరెమ్మ అని పిలవడం మొదలెట్టారు. ఇప్పటికీ వాళ్ళతాతగారి వూరువెడితే అందరూ ఆమెని బూరెమ్మ అని పిలుస్తారు.

మామరిది పేరు రామచంద్రరావు. అంత పేరుతోనూ పిలవకపోతే మానె. కనీసం రామం అనయినా పిలవరు. రావిగా అని పిలుస్తారు మావాళ్ళంతా.

మా ఆడబిడ్డపేరు మాణిక్యాంబ. ఆమె పేరు పిలవడం బద్ధకంచాలి మాణీ అని పిలుస్తారు అందరూ. పోనీ మణి అని పిలిచినా బాగానేవుండును—

మా స్నేహితురాలు ఒకమ్మాయి పేరు కామేశ్వరి. వాళ్ళ ఇంట్లోవాళ్ళు అంత పేరు పిలవలేరుట. మరి కామం అని పిలుస్తే బాగుండదు. కనుక కామీ అని పిలుస్తారు. నలుగురు పిల్లలతల్లైనా ఇప్పటికీ అలాగే పిలుస్తారు అందరూ ఆ అమ్మాయిని.

మా అబ్బాయికి కొంచెము ముక్కు పెద్దది. వాడిని ఎత్తుకున్నపుడల్లా దుర్రముక్కుగాడు అంటూ వుండేవారు అందరూ. చివరికి దుర్రిగాడుగా మారింది.

కొద్దిరోజుల క్రిందట మేము ఇల్లు మారినాము. ఆయింటివారికోడల్ని పాప అని పిలుస్తారుట. ఆ పాపకు అయిదుగురు పాపలు. జుట్టు కూడా కొంచెము నెరిసింది. ఆవిడభర్త ముద్దుగా పాపా అని పిలుస్తూవుంటే కొత్తలో మేము కూతురు నేమోనని అనుకునేవాళ్ళం. తరువాత తెలిసింది ఆవిడను పాపఅని పిలుస్తారని.

ఇదివరకు మా ఇంటిదగ్గర ఒకావిడవుండేది. ఆవిడ మరిది పేరు విశ్వేశ్వరశర్మ. వాళ్ళల్లో మరుదుల్ని ఆడబిడ్డలని అంటే మన్నించా

వారణాసి సుబ్బలక్ష్మి

లిట. చెట్టంత మరిదిని ఏమండీ విశ్వీ. పిల్ల ఏడుస్తూవుంటే ఎత్తుకోవాలని తెలీదు బుద్ధి లేదుటండి, అని కేకలు వేస్తూ వుంటే మాకు నవ్వు ఆగేదికాదు. వెనుకటికి ఒక ఇల్లాలు, అత్తగారిని సగౌరవంగా చెప్పడిందట. ఆ మరికపా మెతకగానే వుండేది అని ఆ పిలుపు.

ఇటువంటివి వ్రాయాలంటే ఇంకా చాలా వున్నాయి. సామాన్యంగా ప్రతీ ఇంట్లోనూ ఇటువంటి పిలుపులు వింటూనే వుంటాము. చిన్న పిల్లలపుడు మన పిల్లల్ని మనము ఎట్లాపిలుస్తే, అదే పైవాళ్ళకుకూడా అలవాటైపోతుంది.

చిన్నపిల్లల్ని ఎల్లా పిలిచినా ముద్దుగానే వుంటుంది కాని పెద్దయిన తరువాత నే వుంది చిక్కంతా. పల్లెటూరివారికి మరీ ఎక్కువగా వుంటుంది ఈ అలవాటు. కాస్త పొట్ట పెద్దదిగా వుంటే, బొజమ్మా, అని పిలుస్తారు లావుగావుంటే, గున్నమ్మా. నల్లగావుంటే కాకమ్మ కాస్త సన్నంగా పీలగా వుంటే, బుచ్చెమ్మ. బుల్లెమ్మ. ఇలా ఏదితోస్తే అది పిలుస్తూవుంటారు. పిలిచేవాళ్ళకే ఏ బాధ లేదు కాని అసలువాళ్ళకే బాధ. ఖర్మం కాలి ఏ చెత్తాకోరు పేరో పిలవడం అందరికీ అలవాటైతే చచ్చే సిగ్గుగా వుంటుంది. అందరికీ అలవాటైన తరువాత ఆ పేరు మాన్పించి అసలు పేరుతో పిలిపించుకోవడం మనతరం కాదు. సరికదా బ్రహ్మతరంకూడా కాదు. అందుచేత సాధ్యమైనంత వరకూ బద్ధకించకుండా పిల్లల్ని అసలుపేరుతో పిలవడం మంచిది, ఒకవేళ పెద్దపేరయితే సగం సగం పేరుతో పిలిచినాసరే వినడానికి ఇంపుగావుంటే సరి, పిల్లల్ని పిలవడములో ప్రతీ పెదవాళ్లు శ్రద్ధవహిస్తే ఇటువంటి వికారపు పేర్లు చాలావరకూ అంతరిస్తాయి.

చెందిన వాళ్ళలో ఆత్మహత్యలు చాల తక్కువ. ఈ వర్గీయులు జారినకాలు పైకి తీసికొన లేక అదే ప్రవాహంలో కొట్టుకు పోతారు.

3. ప్రేమించి విఫలులైన స్త్రీలు :— చదువ నేర్పిన మనం పిచ్చిపిచ్చి ప్రేమలకు లోనగుట లేదు. కొద్దిమంది అజ్ఞానులు సినిమాలు, చవకబారు నవలా పుస్తకములకు బానిసలై ప్రేమ లనేడు వూహా జనిత మదోన్మాదమునకు లోనై, వయస్సు పొంగు వలన కంటికి ఎదురుగా నున్న వారిని ప్రేమించి విఫలు లవుటకద్దు. అట్టివారిలో ఆత్మహత్యలు ఎక్కువ.

4. దారిద్ర్యము, అత్తగారు, ఆడపడుచుల బాధలు, ప్రేమింపని భర్త, చికిత్స కందని రోగబాధితులు—వీరందరూ, ఈ వర్గీయులే—ఇచ్చట కూడ ఆత్మహత్యల కాస్కారమున్నది.

స్త్రీలలో ఆత్మహత్యలకు కారణము పైవాటిలో ఏ ఒక్కటైన కావచ్చును. పురుషులు పూర్తిగా మట్టుకు కారకులు కారు. సంఘము, సామాజిక కట్టుబాట్లు మొదలగు విషయముల పైకూడ ఈ ఆత్మహత్యలు ఆధారపడి వున్నవి. ★

★ జుట్టు రాలకుండా ఉండడానికి— ★

ఎంత మందపాటితల్లైనా ఖర్మగాలి జుట్టు వూడటం లంకించుకుందంటే నెల తిరిగొచ్చేసరికి బొప్పణమై వూరుకుంటుంది. ఈనాడు చక్కటి జుట్టున్న ఆడవాళ్లు అరుదుగా కన్పిస్తున్నారు. చాలామందికి వెంట్రుకలు రాలే జబ్బు మహా బాధగా వుంది. ఈ విషయంలో తలనూనెలు చాలామందికి పని చెయ్యటంలేదు సరిగదా, వున్న తలకూడా గబగబా వూడిపోతోంది. నాకెంతో చక్కటి తల వుండేది. కానీ, దురదృష్టవశాత్తూ విపరీతంగా వూడిపోతోంటే నేను చేసిన వైద్యాలకీ, రాసిన మందులకీ అంతు లేదు. ఏదీ గుణం కన్పించలేదు. నెత్తిమీద జుత్తు ఒత్తుగా లేని తలకి సవరాలు పెట్టుకున్న అవి వెనక్కి బరువుగా వేలాడ్డం, ఆ బరువుకి మరిన్ని వెంట్రుకలూడిపోవటం తప్ప అందంరాదు.

ఏడు వారాలనుంచీ నేనీవైద్యం చేస్తున్నాను. సుగుణంగా వుంది. టేబుల్ స్పూన్ నిండుగా మెంతులు తీసుకుని రుబ్బురోట్లో వేసి పెరుగులా రుబ్బాలి నీళ్లుపోస్తూ, గట్టిగా ముద్దలాగానీ, పల్చనినీళ్ళలాగానీ వుండకూడదు. జారుగా పెరుగులా రుబ్బి తల నిండా పాయలుపాయలుగా తీసుకుని బాగా నెత్తికి అంటేలా రుద్దుతూ రాయాలి. తర్వాత తల ముడివేసుకోకుండా మెంతి పిండంతా పొడిగా ఆరిపోయేవరకూవుంచాలి. సుమారు 4 గంటలపైన పడుతుంది ఆరటానికి. ఆ తర్వాత తల రుద్దుకోవాలి. ఐదారుపట్ల వరకూ తొందర తొందరగా వారానికి రెండు సార్లు ఈవిధంగా తలస్నానం చేస్తూవుంటే సుగుణం కన్పిస్తుంది. ఆలస్యంచేస్తే పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది. మెంతిపిండి వల్ల మెదడుకు చలవచేసి, తలనొప్పివున్న వాళ్ళకి చాలాగుణం కన్పడుతుంది. కేవలం తలనొప్పి వున్నవాళ్లయినా యిలా చేయవచ్చు. జుట్టు ముందు రాలటం ఆగిపోతే తర్వాత పెరగటం జరుగుతుందిగదా! నిత్యం, మంచి కొబ్బరినూనె, కల్తీ లేనిది, వాడటం మంచిది. స్వయంగా గానుగాడించుకొని రాసుకొంటూంటే నిజంగా వేరే మందులవసరం వుండదు. ★

దద్దనాల రంగనాయకమ్మ,
(బొమ్మిడి)






LUX
TOILET SOAP
LUX

వనితా వాణి



సిగ్గు-సింగారము

19-2-58 వ తేదీ వారపత్రికలో వనితా లోకం శీర్షికలో కె. లీలావతిగారు వ్రాసిన ఈ వ్యాసం నాకు చాలా నచ్చింది.

స్త్రీకి సిగ్గు అనేది ఆభరణం వంటిది. సమయానుకూలంగా సిగ్గు అభినయిస్తే చాలా అందంగా వుంటుంది. కాని ప్రతి విషయంలో, అయినదానికి, కానిదానికి కూడా సిగ్గుపడిపోవటం, చాలా అసహ్యకరంగా అనిపిస్తుంది.

ఒకచోట నలుగురు కూర్చుని మాట్లాడుకుంటున్నప్పుడు ఈ సిగ్గుపడేవారు కూడా వింటే కొంతవరకు సిగ్గుపోయి మాట్లాడాలని కుతూహలంగా వుంటుంది.

చిన్నప్పుడు మా చెల్లెలు యింటికి ఎవరైనా నలుగురు ఆడవారు వచ్చినయెడల, వంటింట్లో దాక్కునేది వాళ్ళు వెళ్ళాక, బయటకు వచ్చేది కాని, యిప్పుడిప్పుడు పెద్దదయిన పిమ్మట చిచ్చుబుడ్డిలా ఒకటే వాగేస్తుంది. చాలా ఛలోక్తిగా జవాబులు యిస్తుండేది. ప్రతివారు ఆశ్చర్యపడేవారు యింత మాటల పుట్టయినందుకు.

సందర్భానుసారంగా సిగ్గుపడితేనే దాని అందం రాణిస్తుంది లేనిపక్షంలో చూచేవారికి చికాకును కూడా కలిగిస్తుంటుంది.

"ఆడవాళ్ళ ఆత్మహత్యలు" అను పోయిన వారంలో "మేరీ" గారు వ్రాసిన వ్యాసానికి 19-2-58 వారపత్రికలో "బి. ఎస్. లక్ష్మి" ప్రతివ్యాసం చాలా చక్కగా వ్రాశారు. బాగుగా నచ్చింది.

—పి. సీతాదేవి, అనంతపురం]

* * *

కె. లీలావతిగారు వ్రాసిన, సిగ్గు, సింగారము అన్న వ్యాసం బాగుంది. సిగ్గుపడుతూ (ప్రతీదానికి) వుంటే గొప్ప అనుకునేవాళ్లు ఈ వ్యాసం చదివైనా ఇది మార్చుకుంటారు.

—వై. లలిత. సికింద్రాబాదు]

బి. ప్రేమలీలగారు వ్రాసిన 'అమ్మా నే కాలేజీకి పోనమ్మా!' అన్న వ్యాసము చాలా బాగుంది. వారికి నా అభినందనలు. ఆమె స్త్రీ అయినా నేటి కాలపు విద్యార్థినుల పోకడలను నిష్పక్షికంగా విమర్శించి వారిలోనూ మార్పు రావాలని వ్రాశారు. నాకు చాలా సంతోషంగా వుంది. ఆడపిల్లలు, తమ వెంటబడే మొగపిల్లలను 'రోమియో'లని 'ఖైస్'లని పేర్లుపెట్టి చీదరించుకుంటారేగాని అట్లా ఆ పిల్లకాయలంతా తమ వెంట ఎందుకు పడుతున్నారు? అని ఆత్మవిమర్శన చేసుకోనకపోవడము చాలా శోచనీయం. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమంగా పెంచి, మంచి అలవాట్లు, మంచి పద్ధతులు వారిచే ఆచరింపచేసిననాడు, ఈ 'రోమియో'ల బాధా వుండదు. ఈ 'ఖైస్‌ల' బాధా వుండదు.

—ఆదిపూడి వేంకటరావు, విజయనగరము]

* * *

అభినందనలు

ఈ వారం "అత్తగారూ—ఆవకాయ" అన్న వ్యాసాన్ని శ్రీమతి భానుమతీ రామకృష్ణగారు చక్కగా రాశారు. వ్యాసం చదువుతున్నంతసేపు నవ్వు పట్టలేకపోయాను. అందులో ఒక్కొక్క ఘట్టం తలుచుకొంటేనూ నవ్వువస్తుంది. సినిమా పరిశ్రమలో పనిచేస్తూ తీరిక సమయాలలో ఇలాంటి మంచి మంచి వ్యాసాలు రాస్తున్నందుకు భానుమతీ రామకృష్ణగారికి నా హృదయపూర్వక అభివందనములు. "వనితావాణి" ద్వారా తెలియచేస్తున్నాను. ఇకమీదటనూ ఇలాటి మంచి వ్యాసాలు రాసి వనితాలోకం పాఠకులను ఆనందపరుస్తారని తలుస్తాను. ఇంకా ఈ వారం వనితాలోకం శీర్షికలోనే "అతిథి సత్కారం" అన్న వ్యాసాన్ని మతుకుమల్లి సుశీలగారు బాగా రాశారు.

—వి. సరసు, తుంగభద్రా డాం]

* * *

"అత్తగారు, ఆవకాయ" అన్న వ్యాసం చాల బాగుంది. ఆవిడను వీలున్నప్పుడల్లా ఇలా నవ్వించే వ్యాసాలు వ్రాస్తారని ఆశిస్తున్నాను. రచయిత్రికి నా ధన్యవాదాలు.

— వేదుల రాజ్యలక్ష్మి, విజయనగరం]

* * *

ఆయాక్షన్లు! ఆమాటలు!!

ప్రేమలీలగారు, 'నేనింక కాలేజీకి పోనమ్మా' అనే విషయాన్ని గురించి చక్కగా వ్రాశారు. ఆ అమ్మాయి అలంకరణ కొంచెం చేసుకున్నది. దాన్ని చూసి మగపిల్లలు కొరుకూతలు కూశారని వ్రాశారు. మరి అలంకరణతోపాటు సినిమాల్లో చూసి ఆయాక్షన్ చేస్తూ ఆమాటలు ఉపయోగించే వారిని ఏమనాలో అర్థంగాదు. ఇలాంటివి రోజూ ఎన్నో చూస్తుంటాము. అలాంటి పిల్లల్ని చూసి, కుర్రాళ్లు ఆపోహపడతారంటే అతిశయోక్తి ఏమీలేదు. దేవాలయానికి వచ్చినప్పుడు బాగా అలంకరించుకొని నలుగురైదుగురు పిల్లలు కలిసివస్తారు. ఇంక వీళ్ళను చూడాలేకాని వ్రాయటానికి చాతకాదు. ఒకరినిమాత్రం ఎగతాళి బాగా చేస్తారు. ఇలాంటివారితో మాట్లాడాలన్నా కష్టమే. అలాంటప్పుడు అనవసరంగా నన్ను అన్నారే అని ఉడుక్కోవటం ఎందుకో! మనదగ్గర ఏ పొరపాటు ఉన్నా అలాంటివి జరుగుతూ వుంటాయి. వెనకటికి ఒకడు 'మనబంగారం మంచిదయితే కంసాలి ఏంచేస్తాడు అని అన్నాడట!' అలాగని ఒక్కొక్కసారి మనపిల్లలు అమాయకులు అయినా ఇలాంటివి వస్తవి. అలాంటప్పుడు ధైర్యంగా వుండాలి.

—టి. రమాదేవి, మార్కాపురం.]

* * *

ఎంత చదివితే ఏం లాభం?

మార్చి 12 సంచికలో "ఏడిపిద్దాంరా" అనే వ్యాసము, ఎస్. ఆర్. చంద్రకుమారిగారు, చక్కగా వ్రాశారు. ఒక్క విద్యార్థులలోనే కాదు, వుద్యోగస్థులలో కూడ ఈ దుర్గుణమున్నది, నేను చూచినది వ్రాస్తున్నాను. 15 రోజుల క్రిందట అనుకుంటా; ఆయనకు పెద్ద సంసారము, అక్కలు, చెల్లెండ్లు, తమ్ములు, వొదినగారు అందరూ వున్నారు. వారికి అపుడు వారు మనసుకు తోచరు కాబోలు! ఒక టీచరు 2 గంటలప్పుడు స్కూలుకు పోతూవున్నది. ఆయన ఆమెను చూచి, ఆమె చాలా నల్లగా వున్నది; బొగ్గులా వున్నదిరా అని హేళన చేస్తూ నవ్వసాగాడు. రు150ల ఉద్యోగస్థుడు, డిగ్రీ తీసుకొన్నాడు! ఇటువంటి వారికి, ఎంత చదువు వుంటేనేమి! వుద్యోగము చేస్తేనేమి! వారి నైజమే అంత అని వూరికే వుండవలసి

వనితా వాణి

వదే కాని ఇటువంటి వారిని ఎవ్వరూ ఏమీ చేయలేరు.

—జి. లక్ష్మీదేవమ్మ, చంద్రగిరి]

* * *

ఇనపచక్రాల క్రింద...

'ఇనపచక్రాల క్రింద నలిగిపోయే అభాగినులు' అను వ్యాసములో పార్వతిగారు వున్నది వున్నట్లు వ్రాశారు. మా చెల్లెలు ఒకామె వున్నది. 30 సంవత్సరాలు. 4 గురు బిడ్డలు; పెనిమిటి చనిపోయి 4 నెలలు అయినది; ఆయన అన్నగారు వారిని దగరకి తియ్యరు, తండ్రి లేడు, తల్లి వుండీ లేనిదానితో సమానమే. ఆస్తి వుంటే అంతా నాశనము చేసినారు. ఆమెకు చదువురాదు, పని చేతకాదు. ఇటువంటివారు బిడ్డలను చూచి బ్రతుకక పోతే ఏమిచేసెదరు. ఇట్లా వున్నవి పరిస్థితులు. కనుక, తల్లితండ్రులు, చదువు అయినా చెప్పించాలి. లేక ఏదైనా పనిచేసి పొట్టపోయించుకొనే టట్టు అయినా చూడాలి. పార్వతిగారికి నా వందనములు.

—జి. లక్ష్మీదేవమ్మ, చంద్రగిరి]

* * *

మామ్మగారి వ్యాసం బాగుంది

ఫిబ్రవరి 26 సంచికలో శ్రీమతి పొన్నాడ సుబ్బమ్మ గారు వ్రాసిన "నా ఎనభై ఏళ్ళ అనుభవాలు" అన్న వ్యాసం ప్రశంసనీయముగా వుంది. నేటి నాగరిక ప్రపంచంలో యువతీయువకులు దినదినాభివృద్ధిగా మార్చుకొనే అలవాట్లను బహు చక్కగా విమర్శించారు. అటువంటి వారు ఈ వ్యాసాన్ని చదివి వారి అభిప్రాయాలు మార్చుకుంటారని తలుస్తాను. ఇంత వయస్సులో కూడా ఇంత చక్కగా విమర్శించి, పతితల మనస్సుకు కష్టము కలుగకుండా సున్నితముగా వ్రాశారు. 'కొంగున పెనిమిటి, జేబులో ప్రియురాళ్లు' అని బాగుగా వ్రాశారు. తమ ఎనభై ఏళ్ళ అనుభవాలను మామ్మగారు చాలా చక్కగా చిత్రించారు. ఇంతవరకు ఇలా వ్యాసం ఎవ్వరూ వ్రాయలేదు. వారికి నా అభినందనలు.

—శేఖర్, పాల్వంచ]

* * *

పొన్నాడ సుబ్బమ్మమామ్మగారు వ్రాసిన వ్యాసము చదివి చాలా సంతోషించినాము. వారు పెద్దవారు. వారి హితవు అనుసరించి పాటించవలసి విషయములు నేర్చుకొనవలయునని నా ప్రార్థన. వారు అట్లాంటి వ్యాసము వ్రాసినందులకు వందనములు

మొగరె కరీమున్నీసా బేం.
మాడుగుల (విశాఖజిల్లా)

* * *

ఉన్నది ఉన్నట్లు!

12-3-58 వనితాలోకంలో; శ్రీమతి వి. ప్రేమలీలగారు, 'నేనింక కాలేజీకి పోనమ్మా' అను వ్యాసాన్ని బాగా వ్రాశారు. ఇంతవరకూ ఈ విధంగా ఉన్నది ఉన్నట్లు వ్రాసినవారు కానరాలేదు. ఆడవారయినా; ఆడవారిలోనుండు లోపాలను నిర్మొగమాటంగా ఉన్నదిఉన్నట్లు వ్రాసి యువతులకూ; యువతుల తల్లులకూ ఒకపాఠం నేర్పిన వారయ్యారు. ఇంతవరకూ వ్రాసిన రచయిత్రిలు పురుషుల మనస్తత్వాలను వర్ణించుట, దూషించుట మొదలగునవి చేసి స్వార్థాన్ని వెలిబుచ్చుకొన్నారు; కాని ప్రేమలీలగారు; అట్లుగాక; ఉన్నది ఉన్నట్లుగా వ్రాసి; పాఠకలోకానికి ఈ వ్యాసము ద్వారా పాఠము నేర్పినందుకు ప్రేమలీలగారికి నా కృతజ్ఞతాంజలిని తెలుపకోర్తాను.

— వి. వి. శర్మ, కేశవరం]

* * *

వినోదం; విజ్ఞానం

ఫిబ్రవరి 19వ తేదీ పత్రికలో కుమారి పుష్పగారు వ్రాసిన "బహుదూరపు బాటసారి" వ్యాసంచదివి చాల సంతోషించాను. స్కూలుజీవితం వదలి, గృహిణిగా అత్తవారిళ్ళలో మెలిగే నాబోటివారికి ఎక్స్‌కర్షన్సును గురించి చదవటం మధుర స్మృతిగా తోచింది. తర్వాత మార్చి 5వ తేదీ పత్రికలో పి. ఇందిర శైలంగారు "బహుదూరపు బాటసారి". అటువంటి వ్యాసములు అనవసరమని విమర్శించారు. అది చదివి చాల నిరుత్సాహం పొందాను. వనితాలోకం శీర్షికలో స్త్రీలకు విజ్ఞానంతో పాటు వినోదముకూడ కలిగించే వ్యాసములు వ్రాస్తేనే బాగుంటుందని నా ఉద్దేశము.

—రాజ్యం, రాజమండ్రి]

* * *

అప్పుచేసి పప్పుకూడు

(35-వ పేజీ తరువాయి)

నాకు ఇవ్వవలసినవాళ్ళు చాలమంది వున్నారుకాని సమయానికి ఒకరూ యివ్వరు" అని అడుగుతాడు. అందరికి తెలుసు. అందరూ ఇతనికే యివ్వాలో, యితనే అందరకీ యివ్వాలో.


సంపాదించిన డబ్బుతో తాహతుకొలదీ రోజుకి పదిరూపాయలైనా ఖర్చుపెట్టి తినవచ్చుకాని వాళ్ళ నెత్తిమీద వీళ్ళ నెత్తిమీద చేతులు పెట్టి అటువంటి మృష్టాన్నాలు భోంచేయక పోతేయేమి? ఏదయినా క్రొత్తపిక్చర్ గాని సర్కస్ గానివస్తే "ఏమోయ్ బావమరీ సాయంత్రము సినిమాకి తీసుకెళ్ళాలోయ్. నాతోకలిసి సినిమాచూసి చాలాదినాలయింది సుమా అడ్వాన్సు బుకింగ్ వుంది ఫస్టుక్లాస్ టిక్కట్లు కయితేనే వస్తానోయ్ చూడాల్సిన పిక్చరట" అని ఒక పాడి విసురుతాడు.

ఆ బావమర్ది అన్న అతనికి గుండెలో రాయిపడిపోతుంది. కాని ఏమిచేస్తాడు. ఇక తప్పదు. ఈ ఘటాన్ని వదిలించుకోలేము అని లోపల మంటగావున్నా పైకి నవ్వుతూ, "మీరు రాకుండా నేనొక్కడినీ ఎప్పుడన్నా వెళ్ళానా గురూ" అని నసుగుతాడు.

ఈవిధంగా అప్పుచేసి విందులు భోంచేస్తూ వుంటారు. ఇటువంటివారు ఎక్కడ దొరికితే అక్కడ అప్పులు చేసేస్తుంటారు తీర్చేమాట దేముడెరుగు. ఇటువంటి వారికి అప్పుచేయుట అంటే సామాన్యంగా చేతికి అందే వస్తువుగా భావిస్తూవుంటారు. అప్పు చేసి పబ్బంగడుపుకోవటమే కాని చేసిన అప్పు ఎట్లాతీరుస్తామా మన తాహతుకి మించిపోతుందేమో అని ఆలోచించరు.

పైగా బాకీ అడగొచ్చేవారిని ధర్మంగా ఇస్తున్నట్లూ, కొట్టవచ్చినట్లు మాట్లాడుతారు. మాయింటి యెదురుగా ఒక ఆఫీసులో ఉద్యోగము చేసే ఆయన వుండేవాడు. కొన్నాళ్ళకు అతనిని ఇంకో వూరు బదిలీ చేశారు. అతను వెళ్ళిపోయాడు. మరునాటినుంచి చాలామంది అతని కోసము తిరగటము మొదలుపెటారు. కారణము ఏమిటా అని కనుక్కుంటె వెళ్ళిన గుమస్తాగారు వాడుకున్న బాకీలవారని తేలింది. బియ్యము, పచారీకొట్టులో అప్పు, ఇంటిఅద్దెబాకీ, కాఫీహోటల్లో బాకీ ఆఖరికి వీధుల్లో అమ్ముకొనే ఇడ్డీవారికి కూడ బాకీ పెట్టి ఆ మహానుభావుడు ఇక్కడనుంచి జారుకున్నాడు. అతను వున్నన్నాళ్ళు ఏమయ్యారంటె ఇప్పుడప్పుడే వెళ్ళనన్నారండి. అందుకని అంత ఒత్తిడి చెయ్యకుండా వూరుకున్నాము. మమ్మల్ని ఇంతఅన్యాయము చేసినవాడు బాగుపడతాడేమిటిలెండి అని అతని పేరు చెప్పి తేచాలు రకరకాల దీవెనలు ఇస్తూవుంటారు. విసరగా విసరగా ఒకరాయి తిట్టగా తిట్టగా ఒకతిట్టు తగులుతాయట.

సాధ్యమైనంతవరకూ అప్పులేకుండానే గడపాలి. ఒక వేళ అప్పుచేయాల్సిన పరిస్థితే వస్తుంది. వెంటనే చేసినఅప్పు తీర్చటానికి ప్రయత్నించాలికాని అప్పు దొరికిందే చాలు తీర్చేసంగతి తర్వాత చూడవచ్చు అని తలచకూడదు. మనకి డబ్బులేక ఎంత అవస్థపడతామో అప్పు ఇచ్చిన వ్యక్తికూడ అంతఅవస్థ పడతాడు అని తలచి మనచేతిలో ఎప్పుడు డబ్బువుంటే అప్పుడు ఇచ్చేస్తే అవతలివ్యక్తి సంతోషిస్తాడు. మనకి అస్తమానం అడిగించుకొనే బాధా తప్పుతుంది. పైగా మనము బాకీ సక్రమంగా తీర్చేస్తుంటే మనకి అవసరము వచ్చినప్పుడు ఎవ్వరూ డబ్బు సహాయము చేయటానికి వెనుకాడరు. ★



బ్రాహ్మణుడు - పల్లెపిల్లవాడు

ఒక్కనాడు విప్రు డొకడు
దూరగ్రామ మేగుచుండి,
దారిలోన దాటవలసె
గంభీరమ్మైన నదిని.

పల్లెపిల్లవా డొకండు
ప్రతిదినమును నావపైన
నదిని దాటవేయుచుండె
… చేర్చుగ జనులను.

బ్రాహ్మణుడా నావనెక్క
బాలకుండు నడుపదొడగె;
పాఱుడంత వాని జూచి
పలుక దొడగె నిట్టుల:

"ఓరి కుఱ్ఱవాడ నీవు
విద్యలేమి నేర్చినావు?"
"విద్దెలంటె ఏమొ నేను
ఎరుగనండి బాబుగారు!"

విప్రు డంత ఈసడించి
"ఓరీ వ్యర్థపు జీవీ!
జన్మలలో కెల్ల నుత్త
మం బీమానవ జన్మము.

విద్యలేనివాడు వింత
పశువు గదర బాలకా!
విద్యలేక జీవిత మం
దర్థాంశము వ్యర్థమయ్యె.

పోనీ ఎన్నండైనా
దాన ధర్మ మిచ్చితివా?"
"కడుపునిండ తినుట కొక్క
పూటైనా దొరకదండి

దానాధర్మాలు ఎలా
చేస్తామో సామి! మేము?"
"అట్టులయిన మూడుపాళ్ల
జీవితంబు వ్యర్థ మింక."

అనుచు బాపడనుచుండగ
రంధ్ర మేర్పడి నావకు
కొంచెము కొంచెముగ నీరు
రాసాగెను నావలోకి.

పల్లె పిల్ల డదిచూచీ
త్రుళ్లిపడుచు విప్రునితో
"ఈదగలర బాబు మీరు?
ఇదే నావ మునుగుచుండె"!

అనగ నదరి బ్రాహ్మణుండు
"అయ్యయ్యో! బాలకా!
ఈతచేత కాదురా!
ఏమి చేతు నిప్పుడు!"

"అట్టులయిన మీ జీవిత
మంతా వ్యర్థం బింక"
అనుచు పిల్లవాడు నీట
దుమికి యీది ఒడ్డుచేరె.

పాపము! ఆ బాపనయ్య
గోవిందా యనుచు మునిగె
విద్య లెన్ని యున్న నేమి?
ఆపద బాపునదె విద్య. ★

చింతపల్లి వీరంశెట్టి

వేదాంతి ఓర్పు

పూర్వం ఒకానొక వూళ్లో ఒక గొప్ప పండితుడు ఉండేవాడు. ఆ పండితుడు సకలశాస్త్రాలు చదివి గొప్ప పేరుప్రతిష్ఠలు సంపాదించాడు. ఆయన దగ్గర చదువుకోటానికీ, ఆయనతో శాస్త్రచర్చలు చెయ్యటానికి చాలమంది పండితులు వస్తూ ఉండేవారు.

ఆ పండితునికి ఒకభార్య ఉండేది. ఆమె గయ్యాళిగంప. ఆ పండితుడెంత శాంత స్వభావుడో, ఆమె అంత గయ్యాళి అన్నమాట. దూర్వాసమహామునిలా ఎప్పుడు ధుమధుమలాడుతూ ఉంటుంది ఆమె ముఖం. ముక్కుమీద కోపం తాండవిస్తూ ఉంటుంది. ఎప్పుడూ భర్తను తిడుతూ, గసురుతూ ఉంటుంది. అయినా ఆ పండితుడు ఎప్పుడూ కొట్టనేనాకొట్టడు, సరికదా ఎప్పుడు తిట్టనేనా తిట్టలేదు. ఆయన ఎప్పుడూ తన పనిలోనే నిమగ్నుడై ఉంటాడు. తన ఆలోచనా ప్రపంచంలోనే విహరిస్తూ ఉంటాడు.

ఒకరోజున ఆ పండితుడి ఇంటికి, దూరదేశాలనుంచి, ఎందరో గొప్ప పండితులు వచ్చారు. వాళ్లనందరనూ ఆహ్వానించి తన గదిలో కూర్చోపెట్టేడు. వాళ్లతో ప్రొద్దుటి నుంచీ శాస్త్రచర్చలు జరుపుతున్నాడు. ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా చర్చలు సాగుతున్నాయి. టైము ఎంత అయిందో కూడా వాళ్లలో ఎవరికీ తెలియ లేదు.

ఆ పండితుని భార్య అన్నంవండి సిద్ధంచేసింది. తన భర్తను భోజనానికి పిలిచింది. శాస్త్రచర్చలలో మునిగి ఉండటంచేత, ఆయనకు ఆమె మాటలు వినబడలేదు. ఆమెకు కోపం వచ్చింది. వెంటనే ఇంట్లోకి వెళ్లిపోయింది. తాను కడుపునిండా భోజనంచేసి, పరుపుమీద పండుకొని నిద్రపోయింది. ఆమెకు తెలివి వచ్చేసరికి మూడుగంట లయింది. ఇంకా



ముత్యాల నవ్వు
ఫొటో: పి. ఎన్బి

ఆమె భర్త పండితగోష్ఠిలో మునిగి ఉన్నాడు. ఆమెకు అరికాలిమంట నెత్తికెక్కింది. తోక త్రొక్కిన త్రాచుపాములా భగ్గునలేచి, ఆ పండితులున్న గదిలోకి, భేతాళశక్తిలా వచ్చిపడింది. తన భర్తను, ఆ పండితులను, అందరనూ, ఇష్టము వచ్చినట్లు కసితీరా తిట్టింది. అయినా ఆ పండితునకు కోపం రాలేదు. తన పండితగోష్ఠిలో తన్మయత్వం చెంది ఉన్నాడు. ఆమె నోరు నొప్పిపెట్టే వరకు తిట్టి వెళ్లిపోయింది.

అయిదు గంటలయింది. పండితు లందరు తమ సమావేశం ముగించి ఎవరి యిండ్లకు వాళ్లు వెళ్లిపోటానికని లేచారు. పండితు లందరూ ముందు బయటకు వచ్చారు. ఆఖరున మన వేదాంతిగారు వచ్చారు. ఆయన యిలా బయటికి వచ్చేసరికి నెత్తిమీద దబ-దబమని నీరుపడింది. ఆయనభార్య, డాబామీద నుంచి, తనకసి తీర్చుకోటానికని, తన భర్త తలమీద బిందెతో నీరు క్రుమ్మరించింది.

అతని మిత్రులందరూ, భార్య గయ్యాళితనాన్ని చూచి ఆశ్చర్యపోయారు. వారు పండితునితో యిలా అన్నారు: "మీ భార్యకు కోపం ఎక్కువగా ఉన్నట్లుందే?" అది విని ఆయన యిలా అన్నారు నవ్వుతూ: "ఇందులో ఆశ్చర్యపోవటాని కేముంది! మధ్యాహ్నము నుంచీ ఉరుములు ఉరిమినాయికదా! ఈ మాత్రం వర్షమైనాపడదా?"

ఆ మిత్రులు, అతని శాంత స్వభావాన్ని, ఓర్పును, సహనమును చూసి ఆశ్చర్యపోయారు.

ఆ మహాపండితుడు ఎవరో తెలుసా? ఆయనే ప్రపంచమంతటా, గొప్ప వేదాంతిగా ప్రసిద్ధి వహించిన సోక్రటీసు. ★

ఒక నక్క చాల త్వరితమైన పని మీద, ప్రక్కఊరికి వెడుతోంది. అంత హడావుడిగా బయలుదేరి వెడుతూన్న నక్క ప్రయాణం కాస్త ఆగిపోయింది. ఆ ఊరి ప్రక్కనే వున్న యేటిలోకి నీరు బాగా వచ్చి వుంది. ఆ ఏరు అసలే చాల లోతైంది. పైగా వరద నీటితో ప్రవాహం మరీ యెక్కువగావుంది. నక్కకు యెలా దాటటమో అర్థంకాలేదు. అంతలోనే, ఓ ఒంటె యేటిఒడ్డున గరిక మేయటం కన్పించింది. ఆ ఒంటెను చూడగానే, ఎలాగైనా ఆ ఒంటె సహాయంతో యేరు దాటాలనుకొని ఒంటె దగ్గరగా వెళ్లి "ఏం ఒంటె బావా, కులాసానా" అంటూ పల్కరించింది నక్క.

ఒంటె "ఏం కులాసాలే, నక్క బావా! యేదో యిలా జీర్ణతృణాలు మేస్తూ బ్రతుకుతున్నాను" అంది, సగం యెండిపోయిన గరికను చూపుతూ. "అదేంటి ఒంటె బావా నీకేం తక్కువని, ఇలాంటి యెండిన గరిక మేయాలి? హాయిగా, యేటి అవతల ఒడ్డుకు వచ్చావంటే, నీకు తిన్నంత చెరకూ అబ్బా! చెపుతుంటే నాకే నోరూరుతోంది. నిజంగా బావా, నావెంట వచ్చావంటే, నీకు చాల యేపుగా పెరిగిన చెరకుతోట చూపిస్తాను రా!' అంది. పాపం ఆకలితో నకనకలాడుతూన్న ఒంటెకు నోరూరింది. 'అలాగే, పద నక్కబావా' అంది.

"నేను రావటానికి అభ్యంతరం లేదుగాని, ఒంటె బావా, మరి యేరెలా దాటను? పోనీ నీ వీపుపై నన్ను దాటవేయి" అంది నక్క.

ఒంటె వీపుమీద కెక్కింది నక్క. ఒంటె యేరు దాటవేసింది నక్కను.

ఏటిఒడ్డునే, చెరకుతోట చూపి "దీనిలో చెరకు తిను, నిన్నెవ్వరూ అడ్డగించరు" అని చెప్పి వెళ్ళిపోయింది తన పనిమీద నక్క.

గంధం యాజ్ఞవల్క్యశర్మ

ఒంటె 'సరే' అని చెరకు తినటంలో నిమగ్నమయింది.

నక్క ప్రక్కఊరిలో తన పని పూర్తిచేసికొని మళ్ళా తిరుగుప్రయాణమై యేటి ఒడ్డుదగ్గర కొచ్చింది. ఒంటె యింకా తింటూనే వుంది. నక్కకు త్వరగా యింటికి వెళ్ళాలనిపించి 'బావా యిక వెళదాము రా' అంది.

ఒంటె 'నాకింకా కడుపు నిండలేదు సాయంత్రం వరకూ వుండు వెళదాము' అని సమాధానం చెప్పింది. నక్కకు సాయంత్రంవరకు అక్కడ వుండటం యిష్టంలేక ఎలాగైనా ఒంటెను బయలుదేర తీయాలనుకొని, చెరకుతోటలో కూర్చొని అరవటం మొదలు పెట్టింది. నక్క అరుపు విని పొలము కాపు పరుగున వచ్చి, పైరు పాడుచేస్తున్న ఒంటెను చావచితకకొట్టాడు. పాపం, ఒంటెకు చెరకు వదలిరాక తప్పింది కాదు. శరీరమంతా గాయాలతో ఒంటె నక్క దగ్గరకొచ్చి "అదేమిటి బావా, అలా అరిచావు—" అని అడిగింది. అందుకు నక్క 'నేనేం చెయ్యను బావా, నాకు భోజనం చేయగానే, అలా అరవాలని శాపం. నేను అరవద్దు అనుకొన్నా నాకు తెలియకుండా, అలా అరుస్తాను." అని తెలివిగా తప్పుకొంది.

ఒంటె నక్క వేసిన యెత్తు గ్రహించి "సరే వెడదాము పద' బావ అంటూ, నక్కను వీపుమీద ఎక్కించుకొని యేటిలో దిగి సగం దూరం వెళ్లాక 'నక్క బావా, నేను నీళ్ళలోకి మునుగుతున్నా" అంది.

నక్క భయపడి "నేను చచ్చిపోతాను అలా చెయ్యొద్దు" అని బ్రతిమిలాడింది. "కానీ ఏంచెయ్యను బావా భోజనంచేశాక నాకు నీళ్లలో మునగటం అలవాటు" అంటూ ఒంటె నీటిలో మునిగి, కొద్ది క్షణాల తదనంతరం తేలింది. నక్క ప్రవాహవేగంలో కొట్టుకుపోతూ దూరాన కన్పించింది.

అందుకే 'తాడి యెక్కేవాడికి తలదన్నే వాడుంటాడు.' ★

★ దగా పడిన తమ్ముడు ★

[20 వ పేజీ తరువాయి]

పుల్లయ్య. ఆ కోనేవాళ్లు ఫలానావాళ్లనీ, వాళ్లే రైతులనీ కాబట్టి ఇంకొకరి కెలా ఇస్తారని ప్లీడరు ఖచ్చితంగా చెప్పాడు.

ఇలా ప్రాధేయపడటంపోయి పౌరుషాల వరకూ వచ్చింది. ప్లీడరు పెద్దమాటలాడగానే పుల్లయ్య ఖద్రున లేచాడు. "లా పాయింటులూ, గీపాయింటులూ లేవుబాబూ—మా తాతల కాలంనుంచీ ఆ పొలం దున్నుతున్నాం. యే గవర్నమెంటోడు సాగు హక్కు లేదంటాడో సూస్తాను. మీరెన్ని కోర్టులు తిరుగుతారో తిరగండి. నాను భూమి మాత్రం వదలను," అని వెళ్ళిపోతుంటే, ప్లీడరు గట్టిగా అన్నాడు "యేటా ముచ్చలిక్కలు రాసారోయ్. సాగుహక్కు యెక్కడ వచ్చిపడింది? మీలాంటోళ్లెందరిని చూశాను? యెందుకు తుప్పన గెంతుతావు. తరువాత యీడెబ్బకూడా దొరకదు" అన్నాడు.

"రాబాబో! నీకాగితాలమీద నాయం లేకపోతే, నావూరంతా కచేరీలో నిజం సెప్పరా. సాగుహక్కు అప్పుడెలా రాదో నానూ సూస్తాను" అంటూ యింటి ముఖం పట్టాడు.

పుల్లయ్య వెళ్ళాక రాజిగాడు, యింకో రైతూ ప్లీడరు యింట్లోకి వెళ్లారు "ముందర పత్రం రాసేయండి. మీరు విడిపించకపోతే నాను యిడిపించుకుంటాను. ఆడికి రోజులు దగ్గరపడ్డాయి" అని రాజిగాడు అనగానే ప్లీడరుకు కోరుకెక్కటం తప్పిందని సంతోషంగా రెండెకరాలు అమ్మేసి రెజిస్ట్రీషను చేయించేసు.

వవిరి పెద్దవీధిలో సీస యింటిదగ్గర ఈ విషయం మాటలేవో పడ్డాయ్. పుల్లయ్య జరిగిన తంతు తెలియగానే అగ్గయిపోయాడు. సీస ఓర్పుమాటతో "అయ్యో పుల్లిగా దేముడున్నాడురా!"

"దేముడా! పొలంగట్టుకు యెవడొస్తాడో సూస్తాను ఆడి బుర్ర బద్దలవదా?"

"వాళ్లకి మనుషుల బలం, డబ్బు బలం రెండూవున్నాయి. కాసులుగలవాడు దాసీదానికొడుకైనా రాజే! నీపక్క నాయం వున్నాది. నాయమే దేముడు, దేముడికి సావు లేదని సిన్నపిల్ల నడిగినా సెప్పుతాది!"

సీస సర్ది అంటున్న మాటలకు పుల్లయ్య మరీ విజృంభించి "యెప్పుడూ దేముడు దెయ్యమని కూర్చుంటావురా? దేముడు—? ఇదేనట్రా నాయం-లోకం మండిపోతున్నాదిరా అన్యాయంతో—ఆ దేముడే మూల పస్తున్నాడో? దేముడున్నా డంటన్నావు దేముడు?"

సీస ప్రశాంతంగా "ఉన్నాడురా. నీముకంలా నాముకం యెందుకు నేదు? నీబతుకులా నాబతుకెందుకు నేదు? మనిషికొక ఆకారం మనిషికొక బతుకు యెందుకున్నాది?—"

ఇంక పుల్లయ్య సీసను చెప్పనివ్వకండా "రేపొద్దున్నే పొలాన యేరు వూస్తాను. ఏ, మీసంగల మొగోడువచ్చి యేరిప్పుతాడో సూస్తాను" అని మీసం నులిపితే, మీసంలేని కొడుకుకూడా మీసం త్రిప్పేశాడు!

ఈ రగడంతా వింటున్న, చూస్తున్న కుష్ఠురోగి కాలీడ్చుకొనివస్తుంటే రాజిగాడు ఎదురయ్యాడు. వాడికి అప్పుడే అంతా తెలిసిపోయింది. సంజీవితో "ఏలాగ యేరు వూస్తాడో నానూ సూస్తానని" మీసాలు మెలివేసి అంటుండం విన్నాడు. తిన్నగా నీలిదగ్గరకువెళ్లి "అమ్మా తల్లీ! రేపు పొలంలోకి పుల్లిబాబు యెళ్లాడంటె బతకడమ్మా... ఆరాజిగాడూ గట్టిపట్టే పట్టాడు. భూములు డబ్బుపోసి కొనుక్కున్నాడా? ప్రజా ఆడియేపే అంటారు—గవుర్నమెంటోడు ఆడియేపే మాటాడుతాడు కానీ బగమంతుడు నేడా?"

నీలి కొద్దిగా కంగారుపడినా సర్దుకుంది. రాత్రి నిద్రపోయేవరకూ యీ విషయా లేమైనా మొగుడు చెప్తాడేమోనని యెదురు చూసింది. పుల్లయ్య మౌనంగా గంభీరంగా వున్నాడు. ముసలమ్మ జ్వరాధిక్యతవలన ఒకమూలపడి మూలుగుతోంది. చంటిపిల్ల అప్పుడే లేచి కేకలుపెట్టి యేడుస్తోంది. ఏమో, తల్లిపాలు చాలటం లేదు. ఈ నెలల పిల్లకు అన్నం పిసికికూడా పెట్టోంది. పాలు కొనడానికి డబ్బు సరిగ్గా చేత ఆడలేదు. పిల్లకు పాలుఇస్తూ యిటూ అటూ నిద్రపట్టక కదులుతున్న పుల్లయ్య వేపు చూసింది. ఆనాడు చింతచెట్టుక్రింద బలవంతం చేసిన పుల్లయ్య... పెళ్ళినాడు తను చూసినఓరచూపుకు ప్రత్యక్షమైన మొగుడూ.....పట్నం ముస్తాబై యిద్దరూకలిసి వెళ్లిన్నాడగపడ్డ యీ వస్తాదికీ—యీ వేళ బాధతో, దిగులుతో, పౌరుషంతో అట్టుడికిపోతున్న రైతూ యెంత తేడా? ఆమె చూస్తునే మొగుడిమీద కనికరం వేసింది. ఇదంతా తనకెందుకు చెప్పలేదో ఆమెకు తెలుసు! ఎంత మెతనిగుండె!

కొద్దిసేపటికి పిల్ల నిద్రపోయింది. ముసలమ్మ మూలుగుతూంది. మల్లుతండ్రిపక్కనే పడుకున్నాడు, నీలి బుడ్డీదీపం తగించి మెల్లగావెళ్ళి మొగుడుప్రక్కన కూర్చుంది. భార్య కూర్చున్నట్లు ఆమెచెయ్యి తన నుదుటిమీద పడేవరకూ పుల్లయ్య పోల్చుకోలేదు. ప్రేమతో చూస్తూ మెల్లగా, కమ్మగా, తియ్యగా చిరునగవునవ్విన, నీలి వేపు ఒకసారి చూశాక మళ్ళీ చూడలేకపోయాడు. ఆమె ఆ చేతిని మెల్లమెల్లగా ఆ గీరా గిరజాలలోకి పోనిచ్చి తలదించి ముఖంలో ముఖం పెటింది. పుల్లయ్యశరీరం యెందుకో కంపింపసాగింది. ఆమె అతి మెలగా సహజ శాంతస్వరంతో "యింత జరిగినా వూరంతటికీ సెప్పి, నా దగ్గిరే నా దాపరికం?" అంది.

పుల్లయ్య మాటాడలేదు. శరీరం గగుర్పాటు చెందసాగింది. ఏదో నేరస్థుడిలా అయిపోయాడు. కానీ ధైర్యం చిక్కించుకొని చూస్తూ "వూరందరిదగ్గర నాకు బయం నేదు!" అన్నాడు.

నీలి మొగుడు ప్రక్కనే ఒరుగుతూ, మొగుడితలను తన వక్షానికి అదుముకుంది. అభిమానానురాగాలు కట్టలు త్రెంచుకొని ప్రవహించుటచేత యిద్దరికళ్లల్లోనూ కన్నీరైంది. కొంతసేపటికి గానీ మాటలు రాలేదు. నీలి గోడకు చారబడికూర్చుంటే ఒడిలో తలపెట్టుకున్న మొగుడి కళ్లల్లోకి చూడకండానే "రేపు యిల్లు కదలకు, పౌరుషాలు వస్తే మనుసులు పసువులైపోతారంటారు. మనరాత అలాగవుంది. యేంచేస్తాం? కాళ్లూ సేతులూ గట్టిగా...వున్నాయికదా!"

ఆమె బహుశా దుఃఖం ముంచుకురావటం వల్లకామోసు మరి మాటాడలేదు. కానీ ఆమె కళ్లనీరు కారి భర్త మీద పడలేదు. మౌనంగా ఆమెబాధను అర్థంచేసుకున్న పుల్లయ్య "నలుగురికీ మనకి అన్యాయం జరిగిందని తెల్సిరావద్దే" అన్నాడు.

"ఈ పిల్లలు ముకంసూసి పౌరుషం తగ్గించావంటే బతుకుతాం! ఎవరికి ఆస్తి పాస్తులుండిపోవు—ఎవరూ యీలోకాన్న వుండిపోరు. మంచీ చెడ్డా మిగిలిపోతాది. ఒక కంట నీరు కారితే యింకో కన్ను నవ్వితేనే బతుకు—నీయిష్టం!"

ఆమె మరి మాట్లాడలేదు. మెల్లగా లేచి మంచంమీద నున్న పిల్ల ప్రక్కన వెళ్లి పడుకుంది.

తెల్లవారింది. పొద్దుమీదకు లేచింది. పుల్లయ్యకు రాత్రంతా జరిగింది కలలా అయిపోయింది. కొద్దిగా గెంజిత్రాగాడు. చల్లని

అంబలి జుర్రాడు. అప్పుడే వూరంతా ప్రాకి పోయింది పుల్లయ్యకి రాజిగాడికి యీ వేళ యేదో గలాటా వుందని. బుర్రలు పగులా యని కొందరు అనుమానపడ్డారు. మొదట వాళ్ళెం మానివేస్తే అనుకున్నాడు మీసాలు తీసేసా నేమోనని అనుమానపడ్డాడు. ఇన్ని కబుర్లాడి 'ఛాఁ'నస్తే సప్తాను. పిరికిపందనై పోతానా? మల్లునాయుడి కొడుకు, మాట అన్నాడంటే జరిపించుకోవలసిందే! పెజల్లో ముఖం నిటారుగా సూపించవలసిందే!

చంకన బాణాకర్ర పెట్టాడు. పోతులను విప్పి, నాగలి భుజాన వేశాడు. వెనువెంట కొడుకు వున్నాడు-నీలి మౌనంగా యీపను లన్ని చేస్తున్న భర్తవేపు చూస్తోంది. పుల్లయ్య పెళ్ళాంవేపు చూడలేదు. సరే! బయలుదేరాడు. ఇంట్లో మంచంమీద పిల్ల కెవ్వున కేకలు వేస్తోంది. ముసలమ్మ మూలు గుతూనే మనుమణ్ణి పట్టుకోబోతే జుత్తు పీకి, కొట్టి మరీ విడిపించుకొని అయ్యవెంట పడ్డాడు. నీలి మొగుడు యేమంటాడనో చూసింది. మాటాడకుండా వెళ్ళిపోతున్నవాని వెంటపడి వెనకనించి చంకలోని బాణాకర్ర పట్టుకొంది. వెనుతిరగబోతే నాగలి పూడు నీలితలకి టక్కున తగిలింది. ఆమె కళ్ళవేపు చూశాడు-కర్ర వదలి ముందుకు నడిచాడు. ముందుకు అడుగులు వేస్తున్నాడేగాని కళ్ళు వెనుకే వున్నాయ్.

పొలంగట్టు చేరాడు. తనచిన్నతనంనుంచీ యీగట్టు తనదే అనుకున్నాడు. గొడ్డె పిల్లనూ, పందెంపోతునూ. పశువులకుయేత్తుగా యీ గట్టుమీద పెరిగినగడ్డికోసి మేపేవాడు. తనలా తన కొడుకూ కోసి మేపుతాడను కుంటే, ఇప్పుడిలా వచ్చింది. తన తల్లి తండ్రిమీద యెంత మమకారమో యీ భూమిని చూస్తే అంతకు రెండింతలు—ఇలాంటి మన్ను తన్నది కాదట!

నాగలి దించాడు. కొడుకు చిన్న బెత్తాం పట్టుకొని పోతులను ఆపాడు. కాడికట్టాడు పొలం తూర్పు దిక్కుకు తిరిగి నాగలి మొన పెట్టాడు. ఇంతలో పీసపరుగెత్తుకొచ్చాడు. "అయ్యా ఆలు మందలు మందలు కర్రలు పట్టుకొస్తున్నార్రా? నా మాట విను పుల్లిగా పదరా యెళ్ళిపోదాం...వచ్చేస్తున్నారు... అదిగోరా తోటదాటి పోనారు...అదిగోరా వచ్చేస్తున్నారు నాయనా...నా నాయనా పుల్లిగా—నీ కాళ్ళు పట్టుకుంటానురా...! నాయనా........"

పీస భయంతో అలసి పోతున్నాడు; సొలసి పోతున్నాడు. ఇందులో ఒక్క మాటా వినిపించుకోనట్లుగా పుల్లయ్య పొలం దున్నుకుంటున్నాడు. వాళ్ళువచ్చేశారు... అదిగో ఒకరు యిద్దరు కారు...పొలం, చుట్టు ముట్టేశారు. పీస ఆతృతగా "వచ్చార్రా! ఒక్కడినికొట్టడానికి...యిందరు...కర్రలు పట్టుక రావాలా? మీరంతా మనుసులేనా? నాయం వూళ్ళో లేదు—అడవిలోకి యెల్లి పోయింది!"

రాజిగాడు పొలంలో కాలుపెట్టి పీసను యీడవబోతే పీస తప్పించుకొని మల్లుని యెత్తుకొని బయటకు పోడానికి వచ్చాడు. మల్లుయేడుస్తూ తాతనుకొట్టూ విడిపించు కున్నాడు. అచిన్న గోచిపాత వూడి పోయింది. ముచ్చట గొల్పుతోంది. గోచీ సర్దుకొంటూ మళ్ళీ అయ్య వెంట పడ్డాడు. రాజయ్య పీసను పొలం అవతలకు తోసి వేశాడు. అవతలనుంచి పీస కేకలు వేసు న్నాడు. నాయనా పుల్లిగా...తొందర పడకు?

రాజిగాడు పోతులు యెదరగా వెళ్ళి ఆపాడు. పుల్లయ్య పోతుల్ని అదిలించాడు. అవి ముందుకు పోబోతుంటే కర్రలు పట్టుకు మరి యిదరు ముందుకు వచ్చారు. పోతుల నాపి కన్నెలను విప్పేశారు. పుల్లయ్య పళ్లు బిగబెట్టాడు. చుట్టూ ప్రజని తను చూడ లేదు. ఒళ్ళంతా రాజుకుపోయింది. కళ్లు మండుకు పోతున్నాయ్. ఆ యెండలో తల జివ్వున పోడుస్తోంది. కోపంతో మసకలు దేరిన కళ్ళతో పోతులు విప్పిన రాజిగాడి వైపు చూశాడు. కళ్ళూ మసకలు కమ్మా యేమోనని కళ్లు తుడుచుకున్నాడు. ఇంకా ఆకంటికి నీలే కనిపిస్తోంది...యేమిటీ? నాపోతు లిప్పింది రాజిగాడు కాడా? నీలా?...నీలమ్మ...

యెక్కువలేని పిరికి సహనం బాగా నిండి పోయింది—మల్లువేపు చూడగానే మరం తగా అసహాయుడై పోయాడు. చేతిలో కర్రలేదు. కర్రవుంటే పళ్లొన్నా తను కొట్టేవాడు.

అస్త్రం విడిచి వెళ్ళని పోతులకు గట్టి దెబ్బలు కర్రతో రాజిగాడు వెయ్యడంలో పొలం బయటకు పరుగులెత్తాయ్. మల్లుకు పౌరుషం వచ్చింది. "యెవడవురా...మా పోతుల్ని బాదావు?" అంటూ చేతిలోని బెత్తంతో రాజిగాడ్ని కొట్టాడు. రాజి గాడు కోపంతో మల్లును పొలం బయటకు యీడ్వబోతుంటే గట్టిగా రాజిగాడి తోడ కరిచి విడిపించుకొని అయ్యదగ్గరకు పరు గెత్తాడు.

రాజిగాడు వుగ్రుడైపోయాడు; నాగలి విసిరేస్తూ "పొలంనుంచి కదుల్తావా లేదా" అంటూ ఒక తిట్టువిసిరాడు.

పుల్లయ్య సర్వనాడులూ విజృంభిం చాయ్! ఒక్కఎగురు ఎగిరి సింహంలా వాడి మీద పురికిపడబోయాడు. కాని ఆ గెంత డంలో యేదో అసహాయత...కాలుజారి దున్నిన భూమిలో చారబడిపోయాడు. అంతలోనే లేచి పరుగునవెళ్ళి మీద పడ బోయాడు. ముగ్గురు అడ్డగా కర్రలు పెట్టా "ముందుకు అడుగేశావంటే తల పగులుతా దన్నా"రు.

అలా నిల్చొని పుల్లయ్య ఆ కర్రలమధ్య నుంచి చూశాడు. యెదురుగా యెందరో ఉన్నారు. రాజిగాడు కూడా వున్నాడు. కాని వాళ్ళెందరూ కనబడలేదు—యెవరది? నీలి... నా నీలి... నా నీలి నా సంప బోయాను?

ఆ ముగ్గుర్లో యిద్దరు తన రెండుచేతులూ పట్టుకున్నారు. కొడుకు నింకొకడు పట్టు కున్నాడు. రాజిగాడు చెప్పినట్లు బయటికి యీడ్చుకవసుంటే ఆ పొలంమీద తండ్రీ కొడుకు లిద్దరూ రాలి మన్నును ముద్దుపెట్టు కుంటూనే పొలం అవతల పడ్డారు. పరు గెత్తి దగ్గరగావచ్చిన పీస పుల్లయ్యకంటిలో నీరుచూసి "నాపుల్లిగా...నివ్వా నాయనా యేడుస్తున్నావ్? పులి, పిల్లి అయిపోయిందా తండ్రీ! యేంగతి వచ్చిందంటూ" అని నెత్తి బాదుకొని గట్టిగా బోల బోలా యేడ్చా డు. ★

[ఇంకా వుంది]

పప్పులో విషం

(9-వ పేజీ తరువాయి)

చూశాడు, "నాగదిలో నీకేంపని?" అని వాణ్ణి ప్రశ్నించాడు. మా బలరాం తన విషయంలో జరిగిన ఈ అన్యాయంయొక్క అంతు కనుక్కోడానికే నిశ్చయించు కున్నాడు, "ఇంత అన్యాయమా! నేను కొలెడు డబ్బుపెట్టి డిటెక్టివ్ నవలలు కొను క్కోడం చూసే చూడ్డంతో అంతా విరు చుకు పడడం — ఎవరో ఒకరు చూసిం దాన్నల్లా ఎగరేసుకుపోతూండడమూనా?"

"ఏమిటబ్బాయి, ఈగొడవంతా? ఇది మా అమ్మాయి పుస్తకం. రైల్లో చదువుకుందా మని తెచ్చుకున్నాను."

మా బలరాంకి అప్పుడుకాని జ్ఞాపకం రాలేదు.

ఇది వాసంతి పుస్తకమా! అయితే, మరి— తనపుస్తకం? ఇప్పుడు గుర్తొస్తోంది. రైల్లో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. విల్లి వాకం స్టేషన్ వచ్చేసింది. తనకి తెలియనే లేదు. తీరా రైలు కదిలే టైమ్‌కి కాని తనకి స్పృహరాలేదు. చటుక్కున దిగేతొందరలో పుస్తకం కాస్తా రైల్లో ఉండిపోయింది. అరరే, ఎంత పొరపాటు జరిగింది! మావాడు కంగారు పడుతూ భీమారావుతో, క్షమించండి అన్నాడు.

"ఇంతకీ నాగదిలోకి నువ్వెందు కొచ్చి నట్టు?"

"ఎందు కొచ్చానంటారా?"

"అవును."

"నిజమే-అలా అడిగే అధికారం మీకు

లేకపోలేను."

"ఇదిగో, మూడోసారి నిన్నడుగుతున్నా ఈగదిలోకి నువ్వు రావలసినపనేమొచ్చింది?"

మావాడు నిజానికి చాలా కంగారే పడ్డాడు. ఏం చెప్పాలో తోచక కళ్లునులుముకుంటున్నాడు. అయితే అప్రయత్నంగా మావాడి నోట్లోంచి ఒక ప్రశ్న హఠాత్తుగా బైటకొచ్చింది.

"భీమారావుగారూ, మీరు రిటైర్డు మిలిటరీ ఆఫీసర్ కదూ?"

"అవును - లెఫ్టినెంట్ కర్నల్ ని."

"మీరు ఉద్యోగధర్మంలో చాలాదేశాలు తిరిగారు కదూ?"

"అవును-అయితే?"

"దయచేసి ఒక్కవిషయం సెలవిస్తారా? ఆ విధంగా దేశదేశాలు తిరిగే సందర్భంలో మీరొక విషయం తెలుసుకునే ఉంటారు, ప్రేమ అనేది ప్రపంచమంతా వ్యాపించి ఉందనే దారుణ సత్యాన్ని గూర్చి మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను. ప్రేమ అనే దానికి దేశకాలాలతోటి, జాతిమతాలతోటి, వాతావరణంతోటి ఎట్టి సంబంధం లేదన్న విషయం మీరు గుర్తించే ఉంటారు. జీవజాలమంతా ఆ ప్రేమయొక్క అద్భుతప్రభావానికి వశపడి ఉంటుందనే వాస్తవాన్ని మీరు గ్రహించేఉంటారు.

"అడవి మనిషయేది నవనాగరికుడయేది, లక్షాధికారయేది భిక్షాధికారయేది ప్రతీవాడూ తన అర్ధాంగిని ఎన్నుకోడంలో అతి శ్రద్ధ వహిస్తాడన్న విషయం మీరు కనిపెట్టే ఉంటారు. అటువంటి పరిస్థితిలో మరి నాబోటి కిశోర రచయిత మాత్రం తన జన్మహక్కుని సాధించబూనడంలో తప్పేముంది చెప్పండి. మిమ్మల్ని సూటిగా అడుగుతున్నాను."

★

(మిగతా పైవారం)

జుగుప్స

(15 వ పేజీ తరువాయి)

అన్నాడు మురళి.

"వండర్ ఫుల్! ట్రెమెండస్! ఒరేయ్ మురళీ! నిన్ను వెంటనే ఆంధ్రా యూనివర్సిటీ "సైకాలజీ ప్రొఫెసర్"గా వేయమని రేపే రిజిష్ట్రారుకు రాస్తాను"-అంటూ నవ్వుతూ బయలుదేరాడు.

తొమ్మిది గంటలు దాటింది—

"అనుభవమైతే గాని అర్థము కాదోయ్ బ్రదర్! ఏదో ఒకరోజు నువ్వు నన్ను క్షమార్పణ కోరవలసి వస్తుంది" అన్నాడు మురళి.

ఆ యింటికి వెళ్లాడు— గేటు తీసుకొని లోపలికి వెళ్లాడు. తలుపు తట్టాడు. సమాధానము రాలేదు. కిటికీలోనుంచి మిణుకు మిణుకు మంటున్న దీపం కన్పించింది. కిటికీలోనుంచి తొంగిచూసేసరికి ఆమె కిటికీ దగరగా తూలిపోతూ వచ్చి, తన్ను చూసి ఆశ్చర్యపోయింది—

'డాక్టర్ !'—

"అవును నేనే! మీకు యింజక్షన్ ఇచ్చి వెళ్దామని వచ్చాను. తలుపు తీయండి.

"వద్దు డాకర్! నాకు యింజక్షన్ వద్దు, వెళ్లిపొండి. ఆయన ఇంట్లో లేరు. ఆయన, ఈ సమయంలో మిమ్మల్ని యిక్కడచూస్తే చాలా ప్రమాదం. మీకు ఎంతయినా పుణ్యముంటుంది. దయచేసి వెంటనే వెళ్లిపొండి" అని నమస్కరించింది.

సత్యం ఆమెను నిశ్చలంగా చూశాడు. ఏడ్చి ఏడ్చి ముఖమంతా కందిపోయింది. చంపలమీద కన్నీటి చారలు అస్పష్టముగా కనిపించాయి. భయంతో బెదిరి వణికిపోతుంది. ఆమె ఆ ఆకారం సత్యానికి మతిపోగొట్టింది. వెనక్కు తిరిగాడు—

అంతవరకు ఎక్కడికో వెళ్ళిన సుబ్బారావుగారు ఎదురుపడ్డారు—!

"ఓ!...డాక్...ర్! ఎక్కడికి వచ్చారు?" తన కోపమంతా కక్కేశాడు సుబ్బారావుగారు.

"మీ భార్యస్థితి సాయంత్రం చాలా ప్రమాదస్థితిలో వుందిటకాదా? అందుకని మళ్లీ యింకో యింజక్షన్ ఇచ్చి వెళ్దామని వచ్చాను."

"అందుకని ముందుగా చెప్పకుండా రావటం మీ తరహాకాబోలు-అందులోనూ రాత్రిళ్లు..." ఆయన కోపం తగలేదు—

సత్యానికి పరిస్థితి అర్థమయింది. స్నేహితుని అభిప్రాయమూ, కిటికీలోనుంచి ఆమె మాట్లాడిన రెండుక్షణాల మాటలు—సుబ్బారావుగారి యీ కోపం—అంతా ఒక్కసారి సినిమారీలులా తిరిగింది సత్యం మనస్సులో.

"క్షమించాలి! తెల్లవారితే పండగ! నా వివాహం జరిగింతర్వాత యిదే మొదటి పండుగ. ఇంట్లో పనివుండటంవల్ల ముందుగానే తెలియపర్చటానికి వీల్లేకపోయింది. తీరావచ్చి చూసేసరికి తాళం వేసివుంది. వెళ్లిపోతున్నాను. ఇంతలోకే మీరూ వచ్చారు. ఇవాళ మీ భార్యవున్నస్థితికి ఆమె కదలకూడదని చెప్పానే! ఎక్కడికి తీసుకెళ్లారు? ఆస్పత్రికా?" అన్నాడు సత్యం ఆమెను చూడనట్లుగా.

అప్పటికి ఆయనగారు ఓవిధంగా శాంతించాడు. తలుపుతీశాడు. ఇంకేమి అడగలేదు. మాట్లాడకుండా యింజక్షన్ చేసి యింటిదారిపట్టాడు సత్యం. తన మనస్సు స్థిమితంగా లేదు. భార్య లోపలవుండగా తలుపు తాళం వేసి భర్త బయటకు వెళ్లాడు. ఈ మాటే దారిలో అనేకసారు అనుకొన్నాడు. తనతో మురళి చెప్పినమాటలు—ఆమె ఆవేదన—ఆమెభర్త కోపం—ఇవే ప్రత్యక్షమయాయి అతని ఎదురుగా. తన దాంపత్యాన్ని వారి దాంపత్యంతో పోల్చి చూసుకొన్నాడు సత్యం—అతని గుండె చెలువయిపోయింది—ఇంటికి చేరేవరకు అతనికి మతిలేదు. ఎలాగో యిల్లుచేరాడు.

తిన్నగామేడమీదకువెళ్లాడు. తన గదిలో లైటువేసి చూసేసరికి మంచంమీద నుంచి లేచినది ఎవరో తెలుసుకోవటానికి ఆటేసేపు పటలేదు. "మీతో ఒకటి మాట్లాడాలి!" అంది సరోజ ఏమనూ! అప్పటి సరోజ రూపానికి—యిందాక తను యింజక్షన్ చేయటానికి వెళ్ళిన ఆమె రూపానికి ఏమి తేడా కన్పించలేదు సత్యానికి. "ఇటువంటి భర్తతో జీవించేకంటే మరణమే మే"లని ఆమెకుమల్లే యీ సరోజ కూడా భావిస్తోందా? ఇంక తను భరించలేకపోయాడు - తన కన్నీళ్ళ మధ్య సత్యం ముఖభావాల్ని గ్రహించలేకపోయింది సరోజ— అతని స్పర్శమాత్రం గ్రహించగలిగింది - అలాగే అతని చేతులలో వాలిపోయింది-ఇద్దరి నోట నుంచీ ఒక్కమాట కూడా పెగల్లేదు—

కింద, భోజనం వడ్డించటానికి సత్యం కోసం ఎదురుచూస్తోంది అతని తల్లి. కొంతసేపటికి సత్యం వచ్చి కంచంముందు కూర్చొన్నాడు - తల్లి వడ్డించబోయింది - 'నువ్వుండమ్మా! అదొస్తుంది' అన్నాడు సత్యం.

అందరూ సత్యంవైపు చాలా ఆశ్చర్యంగా చూశారు. ఇన్నాళ్ళనుంచీ లేని ఆప్యాయత అకస్మాత్తుగా యీ అర్థరాత్రి ఎల్లా పుట్టిందా? అని— కాని - సత్యం మనస్సు ఎంత మారిందో వాళ్ళకందం కాలేదు—"మీరుండండి అత్తయ్యా! నేవడ్డిస్తాను" అంటూ వచ్చింది సరోజ.

భోజనానంతరం సతీపతులు పడకగదిని చేరారు. లోపల ఏం మాట్లాడుకొంటున్నారో తెలియకపోయినా, యిద్దరూ లోపలికి వెళ్ళటం చూసి, సంతోషించారు అంతా. ఇన్నాళ్ళకేనా భగవంతుడు వాళ్లను కలిపాడుకదా అని—

"చివరకి నేనేకదూ నెగ్గాను" అన్నాడు సత్యం.

"అవునవును. ఇంకా చెప్పారు. నేనే అంత పిచ్చిదాన్ని పాపం! ఎల్లా అయినా మీరు నా పాశాన్నించి తప్పించుకోలేకపోయారు. నేనే నెగాను" అంది సరోజ.


"ఉత్త డబాయింపు. నేనే నెగ్గాను"

"ఉహూ! నేనే"

"సరి సరి - పడుకో - మళ్ళీ తెల్లారకట్టే లేపేస్తారు - తలంటుకోవటానికి"

"మీరు ఓడిపో..........." అంటున్న మించి మాట్లాడటానికి వీలులేకుండా ఆమె పెదవులను తన పెదవులతో మూసివేశాడు సత్యం.

★



సినిమా

సినీ టెక్నీషియన్‌ల మహాసభ

చప్పుచప్పుని కుప్పతిప్పలుగా డబ్బు గడిం చెయ్యడానికి, అడ్డదారి 'సినిమాఫీల్డు' మీదుగా పోతుందని అంతా అంటారు.

* * *

"నేనూ అలాగే అనుకున్నానుకొని, సినిమాలో పనిచేసేవాళ్ళ జీతభత్యాల, జీవిత పత్యాలగురించిన నివేదిక చూశాక, నిజస్థితి గ్రహించాను" అని ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీ వి. వి. గిరి గతవారం మద్రాసు రాజాజీ హాలులో సినీ టెక్నీషియన్‌ల మహాసభను ప్రారంభిస్తూ అన్నారు.

మహాసభ అధ్యక్షుడు, శ్రీ బి. ఎం. తాతె (సౌండ్ ఇంజనీరు - బొంబాయి), మాట్లాడుతూ టెక్నీషియన్‌లు అంతా ఇందులో సభ్యులుగా చేరి దీన్ని పటిష్టం చేయాలనీ, అపైన, లక్ష్యసాధనకు ఐక మత్యంతో పనిచేయాలనీ అన్నారు.

సభకు బెంగాల్ నుండి దర్శకులు ప్రఫుల్ల రాయ్, మధుబోస్, సౌండ్ ఇంజనీర్లు శ్యామసుందరఘోష్, ఎం. ఎస్. సుబేదార్ ప్రభృతులు, బొంబాయినుండి కృష్ణగోపాల్ రాధాకర్మార్కర్, ప్రభృతులు వంద మంది వచ్చారు. మద్రాసులో, ఈ సభ సందర్భంగా సెలవు ఇవ్వడం జరగనందువల్ల తీరుబాటు ఉన్నవారు వచ్చారు.


ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ ఎల్. వి. ప్రసాద్ అస్వస్థులుగా ఉన్నందువల్ల సమా వేశకర్త శ్రీ ఎస్. కృష్ణస్వామి, స్వాగతం చెప్పారు. తరువాత, అధికార అనధికార ప్రముఖులు పంపిన సందేశాలు చదివారు. అనంతరం, ఛాయాగ్రహణంలో, దర్శక త్వంలో, అగ్రశ్రేణి ప్రజ్ఞాశాలి అని పేరు గడించుకున్న స్వర్గీయ కె. రామనాథ్ చిత్ర పటాన్ని శ్రీ మురుగదాసన ఆవిష్కరిం చారు. మధ్యాహ్నం టెక్నీషియన్‌ల గోష్ఠి జరిగింది.

శ్రీ ప్రఫుల్లరాయ్ అధ్యక్షతవహించారు. శ్రీయుతులు హెచ్. కృష్ణన్, సి. శ్రీని వాసన్, మన్నాలాడియా, ఎం. వి. రాజన్ ఆయా సాంకేతిక విషయాలపై మాట్లాడారు. రెండవరోజున శ్రీ పి. వి. రాజమన్నార్ అధ్యక్షత చలనచిత్రాలపై గోష్ఠిజరిగింది. పార్లమెంటు సభ్యులు శ్రీమతి అమ్ము స్వామినాథన్, శ్రీ టి. ఎస్. పట్టాభిరామన్ శ్రీ సి. ఆర్. రామస్వామి (ఎం. ఎల్. ఎ. మద్రాసు), బెంగాలీ దర్శకుడు శ్రీ మధు బోస్ పాల్గొన్నారు. సాయంత్రం పత్రికా రచయితలకు విందుజరిగింది. తరువాత ఆఖరు సభ మద్రాసు విద్యామంత్రి శ్రీ సి. సుబ్ర హ్మణ్యం అధ్యక్షతన జరిగింది.

వినోద కార్యక్రమంతో మహాసభలు ముగిశాయి.

'అడక్కపోతే'

"అడక్కపోతే అమ్మైనా పెట్టదంటారు. అందుచేత, సబబైన జీతభత్యాలు ఇవ్వాలనీ, ఉద్యోగాలకు భద్రత ఉండే కట్టుదిట్టాలు చెయ్యాలనీ, మనం అందరం చిత్రనిర్మాత లను, సుడియో అధిపతులను అడిగి ఒప్పించి



కాశీనాథ్ ప్రొడక్షన్స్‌వారి 'రామాంజనేయ యుద్ధం'లో లక్ష్మణుడు (సూర్యనారాయణ), రాముడు(అమర్‌నాథ్), విశ్వామిత్రుడు(ముక్కామల)

సంపాదించ ప్రయత్నించ వలసి ఉంది. అందువల్ల, చిరకాలవాంఛితమైన ఈ అఖిల భారత టెక్నీషియన్ల మహాసభను కట్టుదిట్టంగా కట్టుకవచ్చి బలపరచుకొని మనం కోరికలు సాధించుకోవాలి" అని సినీటెక్నీషియన్ల మండలి వారు, మహాసభ సందర్భంలో ప్రచురించిన సంచికలో లక్ష్యాన్ని వివరించారు.

ఈ సంఘంలో, చలనచిత్ర ఛాయాగ్రహణం, శబ్దగ్రహణం, దర్శకత్వం, కళాదర్శకత్వం, మేకప్, ఎడిటింగ్ మొదలైన వివిధ సాంకేతికశాఖలలో పనిచేసేవారంతా సభ్యులు. గ్లామర్ ప్రధాన లక్షణమైన ఫిలిం పరిశ్రమలో పేరూ, పెద్దసైజు కారూ ఉన్నవాళ్లకి తప్ప, చిత్రం రూపు ధరించడానికి అతిముఖ్యులు అయిన చిన్నపనివారికి, రాబడి, సదుపాయాలు గడించడంలో పలుకుబడీకూడా ఏవిధంగానూ గొప్పగా చెప్పుకో తగ్గవిగా లేవు.

అలాగే తమతమ విద్యలలో కొత్తవిషయాలు నేర్చుకొని, ఇతరదేశాలలో వారితో సమానంగా వృద్ధికి రావడానికి సదుపాయాలూ లేవు. ఉన్నంతలో సమర్థులనిపించుకున్న పెద్ద టెక్నీషియన్లు కూడా కొత్త సంగతులు తెలుసుకోవడానికీ, కొత్త ప్రమాణాలు అందుకోవడానికి సదుపాయాలు లేవు. అందుకోసం సాంకేతిక శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలనీ, మంచి ఫిలిం లైబ్రరీ ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ప్రభుత్వం ఆ మధ్య సూత్రప్రాయంగా అంగీకరించి, దరిమిలా దీనికి ప్రయత్నాలు ఆరంభించినా, అవి కార్యరూపం ధరించడానికి మాత్రం ఇంకా వేళ కాలేదు.

ఇన్నాళ్లకి..

సినిమా దేశంలోని పెద్దపరిశ్రమలలో ఒకటి. ప్రభుత్వానికి పెద్దఎత్తున పన్నులుకట్టే వాటిలో ముఖ్యమైనది. అయినా ఈ పరిశ్రమ అభివృద్ధికి డబ్బు ఖర్చుపెట్టడం విషయంలోమటుకు, దీన్ని ఇంకా ముఖ్యపరిశ్రమగా గుర్తించలేదు.

* * *

"కాని ఇన్నాళ్ళకి ముడి ఫిలిమును ముఖ్యావసర వస్తువుల జాబితాలో చేర్చడంతో ఈ కొరత కాస్తా తీరిపోయింది ఈ విధంగానైనా సినిమా ముఖ్య పరిశ్రమలలో చేరినందుకు సంతోషం" అని దర్శకనిర్మాత శ్రీ సి. పుల్లయ్య మొన్న ఓ చిన్న ఛలోక్తి విసిరారు.

సినీటెక్నీషియన్ల మహాసభ ప్రత్యేక సంచికలో ఒక వ్యాసం రాస్తూ, మొత్తానికి ఏదోవిధంగా, ఎలాగో అలా ప్రభుత్వం ఈ పరిశ్రమని గుర్తించింది కాబట్టి, ఇకనైనా, ఈ నాటి పరిశ్రమ అవసరాలూ

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి 'వీరప్రతాప్'లో పద్మిని.



★ బొంబాయి సినిమాలేఖ ★

శుభవార్త వినగానే, సినీ మహాజనులు యావన్మంది సునీల్ - నర్గీస్‌లకు శుభాకాంక్షలూ, ఆశీస్సులూ అందచేశారు. ముస్లిం వర్గాలలో కొందరు ఈ వార్త గురించిన పుకార్లు కొన్నాళ్ళక్రితం విన్నపుడు, అది తగదని నర్గీస్‌కు నచ్చచెప్పచూసి, అసమ్మతి తెలియచేసినా, చాలమంది ఇపుడు, సంతోషంతోనే దంపతులను దీవించారు.

నిజానికి నర్గీస్ సునీల్ దత్‌ల ప్రణయం గురించి ఏడాదినాడే పుకార్లు షికార్లకు బయల్దేరాయి. సరిగ్గా పన్నెండు నెలల క్రితం బిల్లిమోర్ గ్రామంలో మహబూబ్ 'మదరిండియా' షూటింగ్ సందర్భంలో నర్గీస్‌ను సునీల్ దత్ అగ్నిప్రమాదం నుండి కాపాడాడు. అతరవాత వారిద్దరికి పరస్పరాభిమానం కలిగిందని, పెళ్ళిచేసుకుంటారనీ కొని సినీ పత్రికలు వ్రాశాయి. నర్గీస్ అంతటి ప్రమాదంనుండి తప్పించుకొన్నపుడు, రాజ్ కపూర్ మాటవరసకేనా సానుభూతి తెలుపలేదనీ, ఆమె నొచ్చుకుందనీ కూడా వ్రాశాయి.

అప్పట్లో పలువురు సినీ జనులు, ఆఖరుకు సునీల్ దత్ కూడా ఈ పెళ్ళివార్తలను వట్టి పుకార్లు అని ఖండించారు.

నర్గీస్ మటుకు అగ్నిప్రమాదం నుండి బయటపడడం అక్షరాలా తనకు పునర్జన్మ అనీ, ఇకనుండి తనజీవితం కొత్తపంథాలో నడుస్తుందనీ అంది.

ఏడాది తిరిగాక, ఈ మార్చి 12న, నేపియన్ సీ రోడ్‌లోని పృధ్వీ చేంబర్స్‌లో ఉన్న సునీల్ బసలో, చట్టరీత్యా ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఆ మర్నాడు, దంపతులిద్దరూ, సునీల్ కొత్తగా కొన్న బంగళాకు వెళ్లారు. పాలీహిల్ (బాంద్రా) లోని ఆ బంగళాలో, సునీల్ సోదరి, మరి కొద్దిమంది ఆప్తుల సమక్షాన, హైందవశాస్త్ర రీత్యా వివాహం జరిగింది. బంగళా, మనూ సుబేదార్ అనే రాజకీయ వాదిది. సునీల్ దానిని కొనగానే, మరమ్మతులు చేయించి, అలంకారాలు చేయిస్తున్నాడు. వారంరోజులలో ముస్తాబులు పూర్తికాగానే, శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేస్తారు.

పెళ్ళిఅయిన రోజురాత్రి, వివాహకాండ ముగియగానే, ఇద్దరూ, కాల్ షీట్ డేట్‌లను మన్నించి, స్టుడియోలకు వెళిపోయారు. స్టుడియోలో పని పూర్తికాగానే ఇద్దరూ కలుసుకున్నాక శుభవార్తను బొత్తిగా, ఎవరికీ చెప్పకుండా ఉండలేక, ఇదరికి దగిర మిత్రులైన దేవానంద్ దంపతుల ఇంటికి వెళ్లి, రాత్రి ఒంటిగంటకు తలుపుకొట్టారు. తెల్లవారి ఐదుగంటలవరకూ, నలుగురూ సంతోషంతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. తెల్లవారగానే దేవానంద్, కల్పనా టెలిఫోన్‌దగ్గర కూర్చుని పేరుపేరునా స్నేహితుల్ని పిల్చి, విశేషాలు ఏమిటని అడిగి, అడిగించుకొని ఊదరించి వివాహవార్తను వెల్లడిచేయసాగారు. బారెడు పొద్దెక్కేసరికి ఊరందరికీ తెలిసిపోయింది. అందరూ నవదంపతులను అభినందించారు. పత్రికలవారు, ఫొటోలు తీయబోతే, సునీల్ దత్ అంగీకరించలేదు. అసలు ఇది ఎవరికీ తెలియడం అతనికి ఇష్టంలేదు. నర్గీస్‌కు మటుకు ఆ పట్టింపులేదు.

సునీల్, నర్గీస్‌లు, ఇప్పట్లో, 'హనీమూన్' కు వెళ్ళే అవకాశంలేదు. ఇంతకు ముందే, చాలమంది నిర్మాతలకు కాల్ షీట్‌లు ఇచ్చినందువల్ల, తీరిక కుదరదనీ, బహుశా రెండు మూడు నెలలు పట్టవచ్చునీ నర్గీస్ చెప్పింది. ఈలోగా ఏవైనా చిత్రాల షూటింగ్‌లు నాలుగైదు రద్దు అయితే బహుశా వెళ్ళడం జరుగవచ్చునని సునీల్ అన్నాడు.

పోతే సినిమాలో నటన కనీసం ఇంకో రెండు మూడేళ్ళవరకూ విరమించుకునే ఆలోచన లేదని నర్గీస్ అంది.

* * *

కేరళ రాష్ట్రంలో కాలాడి గ్రామంలోని రామకృష్ణ మిషన్ నిధికై నర్తకి కమలాలక్ష్మణ్, మరి కొందరు బొంబాయి నాట్యతారలూ ఇక్కడి భారతీయ విద్యాభవనంలో నృత్యప్రదర్శనం ఇచ్చారు. దర్శక నిర్మాత శ్రీ బిమల్ రాయ్ అధ్యక్షత వహించారు. ఈ ప్రదర్శనం ద్వారా కమలాలక్ష్మణ్ బృందం మొత్తం 17 వేల రూపాయలు వసూలుచేసి, ఆశ్రమ నిధికి సమర్పించారు.



రిపబ్లిక్ వారి "పెళ్లి సందడి"లో పెళ్లి చూపులకు మారు వేషంలో బయలుదేరిన నాగేశ్వరరావు.

* * *

సంగీత దర్శకుడు నౌషాద్, నిర్మాత సున్నీలు కలిసి నిర్మించిన 'మాలిక్', వర్మ ఫిలింస్ వారి 'నైట్ క్లబ్', గత వారం విడుదల అయ్యాయి:

ఎస్. ఎం. యూసఫ్ దర్శకత్వాన తయారైన 'మాలిక్' చిత్రంలో సురయ్యా, తలత్ మహమూద్, కుమార్, జీవన్ నటించారు.

ఇది దెబ్బ తినకుండా ఉండడానికి మంజూరు కొదగ్గ 'వరాలూ' పరిశీలించి, చెయ్యతగ్గ సహాయం చెయ్యడం మంచిదని, అసలు లేదనే బదులు, ఆలస్యంగానైనా సాయంచేయడం మెరుగనీ పేర్కొన్నారు.

ఈ సంచికలో ఇంకా, దక్షిణభారత టెక్నిషియన్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీ ముదిగొండ లింగమూర్తి దర్శకుడు వి. శాంతారాం, మేకప్ ఆర్టిస్ శ్రీహరి బాబు దర్శకుడు శ్రీ పి. చెంగయ్యగారల వ్యాసాలూ, నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావు వ్రాసిన ఆహ్లాదకరమైన కథానిక, ఉన్నాయి. ★

"శ్రీరామభక్త హనుమాన్"

మహాపండితుడూ, మతిమంతుడూ, వీరుడూ, ధీరుడూ, భక్తుడూ, సినీజగత్ లో బాక్సాఫీస్ హీరో అయిన హనుమంతుడి కథను బసంత్ పిక్చర్స్ వారు, చక్కని చలనచిత్రంగా తీశారు. పేరు: 'శ్రీరామభక్త హనుమాన్' పూర్ణా పిక్చర్స్ వారు ఉగాది కానుకగా, ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పించారు.

వాయుదేవుడి అనుగ్రహంవల్ల అంజనీదేవి కన్ననాటినుండి కథను ఆరంభించి, చిన్ననాటి ముచ్చట్లు చూపించి, రామదర్శనం సముద్రతరణం, లంకాదహనం మొదలైన ఘట్టాలమీదుగా ఎగిరి "ఈ గుండెలు తీసిన బంటు" విశ్వరూపదర్శనంతో ముగించారు. మనోహరమైన చిన్న చిన్న సన్నివేశాలతో కథను అలంకరించారు. సున్నితమైన హాస్యంతో అలరించారు. అనవసర ఘట్టాలకు ఆస్కారం ఇవ్వకుండా, ఇచ్చిన వాటిని చాదస్తంగా సాగదియ్యకుండా, చిత్రాన్ని రక్తి కట్టించారు. దర్శకుడు బాబుభాయ్ మిస్త్రీ ఇందుకు అభినందనీయుడు.

అయితే, ఈ చిత్రం చూస్తున్నప్పుడు, చూచినతరువాతా ఒక్క భావం కలుగుతుంది. ఈ కథను, ఇందులోని వివిధ సన్నివేశాలను చిత్రించడంలో అనవసరంగా పారలౌకిక శక్తులకు ఆస్కారం ఇవ్వకుండా, మానవుడి శక్తి, మానవుడి అనుభూతి ప్రాతిపదికగా సాగించి ఉంటే, ఇది ఎంత మధురంగా, మనోహరంగా ఉండేదో అని.

ఉన్నంతలో ఇందులోనూ చెప్పుకోతగ్గ సన్నివేశాలు ఉన్నాయి. ఆయాపాత్రల రూపకల్పనలో గౌరవాభిమానాలు కలిగించే శిల్పం ఉంది. విలీతి అనిపించే ఘట్టాలూ కొన్ని ఉన్నాయి. ఇలా తేలిపోయిన వాటిలో, వాలి వధ, జటాయువు కథ మొదలైనవి చేరుతాయి.

వాలి వధతో, సుగ్రీవుడు, 'తరువాయి కథ' మరచి-సుఖాలు మరగి ప్రమత్తుడు అయి ఉన్న వేళ, లక్ష్మణుడు, నిందాగర్భితమైన మాటలతో, డొంకతిరుగుడుగా హనుమంతుడిని మందలించి, కర్తవ్యం సంగతి సుగ్రీవుడికి గుర్తుచేయిస్తాడు. ఈ రకం లౌక్యం నచ్చకనే కాబోలు, రాముడు లక్ష్మణుడిని రావణ బ్రహ్మదగ్గరకు వెళ్ళి రాజనీతి నేర్చుకోమని ఆదేశిస్తాడు. మహాపండితుడు రావణుడు, అపుడు శ్రీరాముడి అభిమానానికి కృతజ్ఞత తెలిపి, సామదానభేదదండోపాయాలు ఆదిగా రాజనీతిని ఉపదేశిస్తాడు.



రిపబ్లిక్ వారి "పెళ్లి సందడి"లో
సురభి బాల సరస్వతి

ఉన్న పాత్రలలో రావణుడిరూపకల్పన, నటనకూడా ప్రశంసనీయంగా ఉన్నాయి. అంగదుడు, రావణసభలో తన దక్షిణపాదాన్ని ప్రతిష్ఠించి, బలమున్నవారు దాన్ని కదపాలని అంటాడు. అందరూ విఫలులు అయిన వేళ, రావణుడే గద్దెదిగి వస్తాడు. అంతటివాడు తన కాలుపట్టడం తప్పు అని ఎంచి, తక్షణం కాలు వెనక్కి లాక్కుని, "ఆ శ్రీరాముడిపాదం పట్టవయ్యా" అని హితవు చెబుతాడు. రాముడికికూడా శత్రువుపట్ల గౌరవం ఉన్నట్లు చూపించారు.

యుద్ధరంగంలోకి వస్తే, రాముడు, రావణబ్రహ్మకు వందనంచేసి మరీ విల్లెక్కుపెడతాడు. చాలా బాగున్న మరొక సన్నివేశం, రావణాసురుడి సదసద్వివిచారం. పదితలలోనూ ఐదు, దుర్గుణాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. నాలుగు నీతిని బోధిస్తాయి. "అసలు తల" ఉభయపక్షాల వాదాలూ విని, కర్తవ్యం నిర్ణయిస్తుంది. (ముఖ్యంగా ఈ ఘట్టంలో గాత్రధారి కె. వి. ఎస్. శర్మ సంభాషణలు చెప్పినవిధం చాలా బాగుంది).

రావణ, ఆంజనేయ పాత్రలను, మంచి విగ్రహం, కళఉన్న నటులను ఒప్పగించినా, మిగతావారి విషయంలో అంతశ్రద్ధ తీసుకున్నట్లు తోచదు. శ్రీరాముడు (మహీపాల్) వదనం ప్రసన్నంగా, ఉందికాని, రాజకళ, దివ్యతేజం శూన్యం. అసలు, 'రాముడికి ఈసినిమాలో ఇచ్చినంత 'పబ్లిసిటీ'ని హనుమంతుడు చిన్ననాడే కనీవినీ ఉండకపోతే, శబరి అతనికి గట్టిగా నచ్చచెప్పి ఉండకపోతే, ఇంద్రుడు 'నిన్ను హనుమాన్ అని పిలిచినవాడే రాముడు' అని కొండగుర్తు చెప్పిఉండకపోతే, రామవేషంలో వచ్చిన మహీపాల్ ని చూసి త్రిపాఠీ ఖాతరు చేసేవాడా అని అనుమానం వేస్తుంది.


రావణుడు సీతనికామించి తీసుకుపోలేదనీ, రామదర్శనం కోసమే అలాచేశాడనీ వినబడేకథలో, కొందరు కొంటెగా చెప్పే అంతరార్థానికి సీతపాత్ర ధారిణి నిదర్శనం. (ఇందుకు తగ్గట్టే ఈ ఇద్దరూ సినిమాటిక్ గా యుగళగీతాలు పాడుతారు.)

ఇక హనుమంతుడుగా. ఎస్. ఎన్. త్రిపాఠీ నటనమాత్రం అన్నివిధాలా మెచ్చతగ్గదిగాఉంది. మంచివిగ్రహం, ప్రసన్నమైన హావభావాలూ, ఈకథలోని పాత్రను అన్నివిధాలా ఒప్పించాయి. హనుమంతుడి అద్భుతాలను చిత్రించడంలో ట్రిక్ ఫోటోగ్రఫీ కూడా అద్భుతంగా రాణించింది.

[illegible] ఆఫ్ ఆల్ ఫ్లెష్' ఆధారంగా అదే పేరుతో తయారైన హాలీవుడ్ హిట్. అది హిందీలోనూ, ఇతర భారతీయ భాషలలోనూ ఇదివరకే 'ఫొటో'లు తీయించుకున్న సంగతి తెలిసినదే. (తెలుగులో 'నాయిల్లు' పేరుతో ఒక చిత్రం వచ్చింది) ఇన్నాళ్లకి మళ్ళీ కొత్తగా తీస్తున్నామన్న ఊహకూడా లేకుండా, పురాతన పద్ధతిలో దీన్ని పునర్నిర్మించారు. మధుర గాయని సురయ్యా, గాయకుడు తలత్ మహమద్ లు ఇందులో ఉన్నా ఘులాం మహమద్ కూర్చిన సంగీతం ఆపాత మధురంగా లేదు. ఏ పాటె మధురం గానులేదు. సంగీత ప్రియుల్ని మైమరపింప చేసేవాటిలో ఇదిచేరదు.

'నైట్ క్లబ్' లో నటులు అశోకుమార్ కామినీకౌశల్. చౌకబారు హాస్యంతో "సెన్సేషనల్" డాన్సులతో, నిండిన అపరాధ పరిశోధక వృత్తాంతాన్ని ఇందులో చిత్రించారు. ఒక దొంగలరాణి, పోలీసు ఆఫీసర్ ను వలచి వలపించుకోవడం కథాంశం. అందుకోసం, ఆవిడా, జతికతెలాబోలెడన్ని బాక్సాఫీస్ డాన్సులు చేస్తాగు చేస్తే చేశారుకాని, అది ఎబ్బెట్టుగా తయారవడం శోచనీయం. అశోకుమార్, కామినీ కౌశల్ ఇందులో వేషాలు వెయ్యడాన్నీ వాళ్లు ప్రదర్శించిన నటననీ వర్ణించడానికి కూడా శోచనీయం అనేమాటే, పునరుక్తి దోషంఉన్నా, వర్తిస్తుంది. ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



పొన్నలూరి బ్రదర్స్‌వారి 'శోభ'లో అంజలీదేవి, వెంకుమాంబ, రామారావు.

ఇది ఈ చిత్రానికి విశేషాకర్షణ. లంకాదహనం, రామరావణయుద్ధం బాగా చిత్రించారు. అవవులుమటుకు స్టుడియో మాగ్కుక్కవిక్కవడం అంత అమోఘంగా లేదు.

అమోఘంగా ఉన్నది చిత్రం చివర, హనుమంతుడు తన గుండెచీల్చి, అందులో, కొలువు తీరిఉన్న సీతారామ లక్ష్మణులను చూపడం. (ఈ దృశ్యాన్ని రంగులలో చిత్రించారు.) నమ్మిచెడినవారు లేరు.

ఈ చిత్రానికి మాటలు పాటలు వ్రాసినవారు శ్రీ శ్రీ. సంగీతం కూడా చాలా బాగుంది. ఘంటసాల, శ్రీనివాస్, రాజా, సుశీల, జిక్కి ఆయాపాటలు హాయిగా పాడారు. ★

ఢిల్లీలో డాక్యుమెంటరీ చిత్రోత్సవం

కథాచిత్రాలు తీసే ప్రతిసంస్థకూ, డాక్యుమెంటరీ చిత్రనిర్మాణశాఖ ఒకటి ఉండాలని కేంద్రమంత్రి డా॥ బి. వి. కేస్కర్, మొన్న ఢిల్లీలో డాక్యుమెంటరీచిత్రోత్సవం ప్రారంభిస్తూ అన్నారు.

మార్చి రెండోవారంలో, ఈ ఉత్సవం బొంబాయిలో ఆరంభమైంది. ఢిల్లీలో మూడు రోజులు జరిగింది. తరవాత కలకత్తా, మద్రాసు కేంద్రాలలో జరుగబోతోంది. అన్నిచోట్లా, డాక్యుమెంటరీ చిత్రాల పట్ల ప్రేక్షకుల శ్రద్ధాసక్తులు నిన్నటికన్నా నేడు ఎక్కువగా కనిపిస్తున్నాయనడంలో సందేహం లేదు.

డాక్యుమెంటరీలు అంటే, ఆ పుమీద 'కాంపోజిషన్' రాయడంబాపతు పని అని, చప్పగా ఉంటాయని కొంతకాలం వరకూ కొందరు ప్రేక్షకులలోను, ఫిలిం నిర్మాతలలోను వున్న దురభిప్రాయం క్రమంగా అంతరించిపోయింది.

ఈ చిత్రాలవిషయంలో మొన్న మొన్నటివరకూ బాగా వెనకబడివున్న మనదేశం, అచిరకాలంలోనే, మంచి పేరుప్రతిష్ఠలు గడించుకొని, అగ్రశ్రేణికి వచ్చింది. అంతర్జాతీయ ఉత్సవాలలో మనచిత్రాలు బహుమతులు తెచ్చుకొన్నాయి. స్వతంత్ర నిర్మాతలు కూడా ప్రభుత్వ సహాయంతో, ప్రభుత్వం పనుపున చక్కటి చిత్రాలు తీస్తున్నారు.

"ఫలానా డాక్యుమెంటరీ వేస్తున్నారు కాబట్టి, ఫలానా చిత్రానికి వెళ్దాం" అనుకునే ప్రేక్షకుల సంఖ్యకూడా పెరుగుతోంది.

ఈ సమయంలో స్వతంత్ర నిర్మాతలు ముందంజవేసి, డా॥ కేస్కర్ సలహాను అనుసరించ ప్రయత్నించడం మంచిది.


మన కథాచిత్రాల నిడివి, ప్రస్తుతం ముడిఫిలిం ఇబ్బందివల్ల ఎలాగా తగ్గుతోంది కాబట్టి, ముమ్ముందు ఈ అవస్థ లేకపోయినా, పన్నెండు వేల అడుగులలోనే చిత్రం నిర్మించి, దానికి దన్నుగా, తోడుగా, ప్రత్యేక ఆకర్షణగా మంచి డాక్యుమెంటరీ చిత్రాన్నో, హాస్యచిత్రాన్నో ప్రదర్శించే పద్ధతిని అమలులో పెట్టడానికి ఇప్పటినుండీ కృషి ఆరంభిస్తే ముమ్ముందు మంచి ఫలితాలు ఉంటాయనడానికి సందేహం లేదు.

సీమలో చాలా పెద్ద కంపెనీలు, ఈ పద్ధతివల్ల పేరుతో పాటు లాభాలూ గడిస్తున్నాయని ఇక్కడి నిర్మాతలందరికీ తెలుసును. వాళ్ళు ఏడెనిమిదివేల అడుగులలో కథాచిత్రం తీసి, ఆపైన, ఒక డాక్యుమెంటరీ, ఒక హాస్యచిత్రం, లేదా ఒక కార్టూన్ ఇలాంటివి దానికి జోడించి, మొత్తం రెండుగంటల కాలక్షేపానికి సరిపోయే 'కాంపోజిషన్' ను విడుదలచేస్తారు.

* * *

డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణంలో క్రమంగా స్వతంత్ర నిర్మాతలకే ఎక్కువ పని ఒప్పచెప్పవలసిన సమయం వచ్చిందనీ ప్రభుత్వం ఇందుకు తగు సదుపాయాలు చేస్తుందని ఆశిస్తున్నామనీ డాక్యుమెంటరీ నిర్మాతల సంఘం అధ్యక్షుడు పాల్ జిల్స్, ఢిల్లీ ఉత్సవంలో అన్నారు.

తమ ఆశయంకూడా అదే అని డా॥ కేస్కర్ జవాబిచ్చారు. ★



1915 నాటి ఫిలిం స్టుడియోలో ఒకభాగం. పేరు: ఎడిసన్ ఫిలిం స్టుడియో-న్యూ జెర్సీలో మెన్లోపార్క్ వద్ద ఉండేది - అప్పటికి టాకీలు రాలేదు కాబట్టి, ఇప్పుడున్నన్ని హంగులు, సదుపాయాలు లేవు కాబట్టి, స్టుడియో హాలులో తడికలలో చిన్న చిన్న గదులు నిర్మించి ఒక్కొక్క గదిలో ఒకొక్క చిత్రం చొప్పున వరసగా చిత్రాలు తీస్తూ ఉండేవారు. 'షూటింగ్' సాగిస్తున్న రెండు యూనిట్లను ఇందులో చూడవచ్చు.

అమెరికన్ చలనచిత్రకళ పరిణామాల కథ


చలనచిత్రాలను ప్రప్రథమంగా కనిపెట్టిన ఖ్యాతి వివిధ దేశాలకు చెందిన పలువురు విజ్ఞానవేత్తలకు చెందుతుంది. 1824లో పీటర్ మార్క్ రాజెట్ "దృష్టి నిలకడ" అనే విషయం కనిపెట్టి, ఆ విషయమై ఉపన్యసించటం ప్రారంభించాడు. దానినే పరిభాషలో "పర్సిస్టెన్స్ ఆఫ్ విజన్" అంటారు. ఆ సిద్ధాంతంతో చలనచిత్రకళాసృష్టికి అంకురార్పణ జరిగింది. ఆటుపిమ్మట కొన్ని సంవత్సరాలకే బెల్జియం దేశస్థుడు జోసెఫ్ ప్లాటో, ఆస్ట్రియా దేశస్థుడు సైమన్ రిటర్ వాన్ స్టాంఫెర్ ఒక పళ్లానికి బొమ్మలు అతికించి, దానిని గుండ్రంగా తిప్పుతూ, బొమ్మకదులుతున్న భ్రమ (చలనచిత్రపు "ఇల్యూజన్") కలిగించారు. ఫ్రెంచి ఖగోళ శాస్త్రవేత్త శుక్రగతిని పరిశీలించేటందుకుగాను 1874లో ఒక మోషన్ పిక్చర్ కెమెరా తయారు చేశాడు. రాగిరేకుపై వెండిపూత పూసిన ఒక గుండ్రటి పళ్లాన్ని (డాగురో టైప్) ఆ కెమెరాలో అమర్చాడు. అదే మొటమొదటగా తయారైన మోషన్ పిక్చర్ కెమెరా. 1889లో జార్జి ఈస్ట్‌మన్ 'ఫ్లెక్సిబుల్' ఫిల్మ్ తయారు చేశాడు. బాగా పనిచేసే మోషన్ పిక్చర్ కెమేరా అప్పటివరకూ, తయారు కాలేదనే చెప్పాలి. ముడిఫిల్మ్ తయారవటానికిపూర్వం 30సంవత్సరాలనుంచీ ఫోటోగ్రాఫిక్ ప్లేట్లమీదా, చివరకు 'డాగురో టైప్' యొక్క వెండిపూతమీదా చలనచిత్రం ఫోటోగ్రాఫ్ తీయటానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అమెరికా దేశస్థుడు కొల్మన్ సెల్లర్స్ 1860, 1861వ సంవత్సరాల్లో తన భార్యా పిల్లల ఫోటోగ్రాఫ్లు వరసగా తీసి, వాటి కాపీలను ఒక చక్రానికి చుట్టూ అంటించి స్టీరియోస్కోప్ లెన్సెస్ వెనకప్రక్కగా ఆ చక్రం తిప్పాడు. ప్రతి దృశ్యాన్ని రెండు లెన్సులు ఉపయోగించి ఒకే సమయంలో ఫోటో తీసి, మూడు కొలతలలో చలనచిత్రం (పొడుగు, వెడల్పు, లోతు) చూపించే (త్రీడైమెన్షనల్ ఫిలిం) విధానానికి

ఆయన మార్గదర్శకుడయాడు. పది సంవత్సరాలైన తర్వాత ఫిలడెల్ఫియా నగరనివాసి హెన్రిరెనో హేల్ గాజుపళ్లానికిఫొటోలు అంటించి, 1600 మంది ప్రేక్షకులకు తొలిసారిగా 'చలన చిత్రాన్ని' ప్రదర్శించాడు.

గాజు పళ్లాలపై బొమ్మలు అంటించి చలన చిత్రంగా ప్రదర్శించటంలో ప్రఖ్యాతిగాంచినవ్యక్తి ఎడ్వర్డ్ మ్యాబ్రిడ్జి. గుర్రం స్వారి చేస్తున్నప్పుడు నాలుగు కాళ్లు ఒకేసారి ఎత్తి పరిగెడుతుందని లీలాండ్ స్టాన్‌ఫోర్ తన స్నేహితుల్లో ఒకరితో పందెం వేశాడు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం స్థాపించిన వ్యక్తి ఆయనే. పందెం వేశాడన్న మాటేగాని దానిని నిరూపించడమెలాగా అన్న విషమ సమస్యలో పడ్డాడు. మ్యాబ్రిడ్జిని ఆశ్రయించి తన పందెంసంగతి వివరించి, "నిరూపించగలవా?" అని అడిగాడు. "ఓ, భేషుగ్గా" అని మ్యాబ్రిడ్జి స్టాన్‌ఫోర్డ్‌కు సమాధానమిచ్చాడు.

గుర్రం స్వారిచేసే బాటప్రక్కను అక్కడక్కడ కెమెరాలు ఏర్పాటుచేసి ఫొటోలు తీసి, మొత్తంమీద స్టాన్‌ఫోర్డ్ చెప్పినది నిజమని నిరూపించాడు. స్టాన్‌ఫోర్డ్ సంతోషానికి అంతులేదు. కెమెరాలద్వారా జంతువుల పరుగును బాగా కనిపెట్టవచ్చునని ఆ భావాన్ని, ఉపాయాన్ని మ్యాబ్రిడి కొంత పైకానికి విక్రయించాడు. మ్యాబ్రిడ్జి ఉపాయం ఇది: గుర్రం పరిగెత్తుతున్న బాటప్రక్కన సమానదూరంలో 24 కెమెరాలుఉంచి, గుర్రం ఒక్కొక్క కెమెరాముందు పరిగెత్తేటప్పుడు, వాటిషట్లర్లు యాంత్రికంగా తెరచుకొని తిరిగిమూసుకొనే ఏర్పాటుచేశాడు. 1880 వ సంవత్సరంలో ఆయన గాజుపళ్లెం పద్ధతిలో ఆ ఫొటోగ్రాఫులన్నిటిని శాన్‌ఫ్రాన్సిస్కోలో చలనచిత్రంగా ప్రదర్శించాడు.

మ్యాబ్రిడ్జికీ, థామస్ ఎ. ఎడిసన్‌కీ మధ్య గడిచిన కాలంలో ఎంతో మంది పరిశోధకులు



గత్యంతరంలేక గదిలో దాక్కుంటే ఈ దాసీదొరకతే! - రిపబ్లిక్ వారి హాస్య ప్రధానచిత్రం "పెళ్లిసందడి"లో ఒక సరస సన్నివేశంలో నాగేశ్వరరావు, లక్ష్మి, అంజలీదేవి.

వివిధ రకాలైన ప్రయోగాలు చేసి పరిశోధనలు జరుపుతూనే వచ్చారు. వారిలో చాలామంది ఫ్రెంచివారూ ఇంగ్లీషువారూను. శాస్త్రవేత్తలనుంచి, చలనచిత్రప్రదర్శకుల వరకూ ఆ పరిశోధనలు జరుపుతూనేవచ్చారు.

ఫోనోగ్రాఫ్‌ను, ఎలెక్ట్రిక్ బల్బును కనిపెట్టి జగత్ప్రసిద్ధుడైన ఎడిసన్, 1887 లోనే సినిమా విషయమై పరిశోధనలు ప్రారంభించాడు. తాను కనిపెట్టిన ఫోనోగ్రాఫ్‌ను (గ్రామఫోను) చలనచిత్రాలద్వారావివరించి చెప్పాలనే లక్ష్యంతో ఆయన ఆ పరిశోధనలకు పూనుకొన్నాడు.

మొదటి టాకీచిత్రం

ఆయన 1889 లో యూరప్ పర్యటన ముగించుకొని తిరిగి వచ్చేసరికి ఆయన అసిస్టెంట్ డబ్ల్యు. ఎల్. కె. డిక్సన్ మొట్టమొదటి టాకీచిత్రాన్ని తెరపై చూపించాడు. 1891 నుంచి 1895 వరకూ ఎడిసన్ యాభైఅడుగుల నిడివిగల చిన్న చిన్న చిత్రాలు తయారుచేశాడు. కళ్లకు దగ్గరగా పెట్టుకొని చూచే 'కైనెటోస్కోప్' ద్వారానే వాటిని చూడటానికి వీలయింది. 1895 లో అన్ని హంగులు కలిగిన కెమెరాను ఎడిసన్ నిర్మించాడు. ఆ చలనచిత్ర నిర్మాణవిధానాలను విదేశాల్లో డబ్బు ఖర్చుపెట్టి పేటెంట్ చేయించటం కేవలం వృథాశ్రమఅని ఊరుకొన్నాడు. "అమెరికాలో మహా అయితే పది ప్రొజెక్టర్లకంటే అవసరం ఉండదు" అనే ఉద్దేశ్యంతో, ప్రొజెక్టర్లు భారీఎత్తున నిర్మించటానికి ఎడిసన్ పూనుకోలేదు. ★

(మిగతాది పైవారం)

'పాండురంగమాహాత్మ్యం'

ఎన్. ఎ. టి. వారు శ్రీ కమలాకర కామేశ్వరరావు ప్రదర్శకత్వాన నిర్మించిన 'పాండురంగమాహాత్మ్యం' ఆంధ్రలో బహుళ జనాదరణకు పాత్రమై ఏడు కేంద్రాలలో నూరురోజులు నడచింది. అన్నిటికీ కలిపి, మార్చి 15 న, విజయవాడ లక్ష్మి టాకీసులో వైభవంగా శతదినోత్సవాలు జరిపారు. రాష్ట్ర ఆర్థికమంత్రి గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, చదలవాడ పిచ్చయ్య, శ్రీమతి తోలేటి శేషమ్మగారలు, ఈ చిత్రాన్ని ప్రశంసించి, దీన్ని ఇంత చక్కగా రూపొందించిన కళాకారులను, టెక్నీషియనులను అభినందించారు. ఎన్. ఎ. టి. సంస్థ ఇంకా ఇటువంటి చిత్రాలు తీయాలన్నారు.

ఉత్సవానికి మద్రాసునుండి వచ్చిన శ్రీయుతులు కె. కామేశ్వరరావు వి. నాగయ్య, కె. శివరావు, సముద్రాల రామానుజాచార్యులు (జూనియర్), హరిబాబు, శ్రీయుతులు అంజలీదేవి, ఛాయాదేవి గారలను హాస్యనటుడు శ్రీ ఎన్. టి. రామారావు పరిచయంచేశారు. శ్రీ మద్ది రామకృష్ణరావు వారికి పూలమాలలు వేసి గౌరవించారు. అనంతరం శ్రీ గోపాలరెడ్డి, శతదినోత్సవ కేంద్రాలలోని (విజయవాడ, గుంటూరు, తెనాలి, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విజయనగరం) ఆయాథియేటర్ల యాజమానులకు, చిత్రనిర్మాతలకూ, టెక్నీషియనులకు బహుమతులు పంచిపెట్టారు.

శ్రీ ఫణిభూషణరావు వందన సమర్పణతో సభ ముగిసింది. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



ప్రీడావతి

ఫొటో: జి. రామమూర్తి.

ప్రతీ రోజూ ఒక్క మాటే

సూపర్ వైట్ కోలినోస్

టూత్ పేస్టుతో పళ్లను తోముకుంటే దంతక్షయమును, దుర్గంధమును గలిగించే క్రిములను ధ్వంస పర్చును.

*కుటుంబములోని వారందరూ అమిత తెల్లని 'కోలినోస్' యొక్క చల్లని పరిశుభ్రకర మైన మనోల్లాసకర రుచిని ఇష్టపడుదురు.



ప్రతి భోజనానంతరమున్నూ తమ పళ్లను తోముకోజాలని వారు—జ్ఞాపకముంచుకోండి సూపర్ వైట్ 'కోలినోస్' టూత్ పేస్టుతో రోజుకు ఒక్కమాటు పళ్లు తోముకుంటేనే, అది మీ పళ్లను కొత్త అమిత తెల్లగా శుభ్రపరుస్తూ వాటిని భద్రముగా కాపాడును.

దంతక్షయము నుండి రక్షించును.
సూపర్ వైట్ 'కోలినోస్', రోజుకు ఒక్కమాటే వాడినప్పటికీ, దంతక్షయమును, తొట్టులను గలిగించే క్రిములను చాలా మట్టుకు ధ్వంసపర్చును, అని పరిశోధనలు రుజువు పర్చినవి.

దుర్గంధము నుండి కాపాడును.
సూపర్ వైట్ 'కోలినోస్' టూత్ పేస్టు తక్షణం నోటి పాచి కంపును నిర్మూలించి నోటినుంచి విడిచే మీ ఊపిరిని పరిశుభ్రంగాను సువాసనగాను వుంచును.

పళ్లు శుభ్రంగానుండును! నోరు పరిశుభ్రంగానుండును
సూపర్ వైట్ 'కోలినోస్' టూత్ పేస్టు ఎంత త్వరితంగా మీ పళ్లను అతి కాంతిగాను అతి తెల్లగాను జేసి, నోటిని హాయిగా నుండు పరిశుభ్రంగా నుంచునో చూడండి.

సూపర్ వైట్ 'కోలినోస్‌ను' అడగండి.



Registered User
Geoffrey Manners & Company Private Limited

సంపూర్ణ నిదర్శనము



సూపర్ వైట్ 'కోలినోస్'తో పళ్లను ఒక్కమాటే తోముకొంటే, అది దంతక్షయముకున్ను నోటి దుర్గంధముకున్ను ముఖ్య కారకములైన, నోటి క్రిములను చాలా మట్టుకు పూర్తిగా ధ్వంసపర్చునని లేబొరేటరీ పరిశోధనలు రుజువు పర్చినవి.

K. 71